జీవన సత్యాలు

యద్దనపూడి సులోచనారాణి

క్వాలిటీ ప్రచురణ
ముద్రణ :
ఫిబ్రవరి - 2009

జీవన సత్యాలు
రచన :
యద్దనపూడి సులోచనారాణి

వెల : రు. **50-00**

ప్రచురణ కర్త :
కె.వి.యస్.ఆర్. పతంజలి

టైప్ సెట్టింగ్ &
ముద్రణ
శ్రీ పరమేశ్వరి ప్రెస్
విజయవాడ - 2.
ఫోన్ : 2434817

మా మాట

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి, దాదాపు నాలుగున్నర దశాబ్దాల నుంచీ, తెలుగుసాహితీ రంగంలో, అసంఖ్యాకులైన అభిమాన పాఠకుల ఆదరణ పొందిన ఏకైక రచయిత్రి. తెలుగు నవలా సాహిత్యానికి ఆమె నవలలు ఒక దిశని నిర్దేశించాయి. నవలారంగానికి మహర్దశని కూడా పట్టించాయి.

కుటుంబం అనేది స్త్రీ పురుషులకే కాదు. ఈ సమాజానికే ఉత్తమోత్తమైన మార్గం అని ఈమె నమ్మటమే కాదు, తన అశేష అభిమాన పాఠకుల చేత కూడా నమ్మించింది. స్త్రీ పురుషులు అర్ధనారీశ్వరులు. ఒకరు లేకుండా మరొకరు మనలేరు. ఇద్దరూ అన్యోన్యంగా కలిసి వుంటేనే యీ జగత్తు వారికి స్వర్గధామం. పోట్లాడుకుంటే, వారి మనసులు - జీవితాలూ భూకంపాలే అనే మనోవైజ్ఞానిక విశ్లేషణ ఈమె రచనల్లో తొంగిచూస్తుంది. ఈమె నవలలకి 'కుటుంబమే' కేంద్రబిందువు. ఈమె కథాంశాల్లో అంతస్సూత్రం మనిషికీ మనిషికీ మధ్యగల అనుబంధం. బాధ్యత, ఈమె నవలల్లో మంచి తల్లితండ్రులు - చెడ్డ తల్లితండ్రులు, అన్యోన్యులయిన దంపతులు - రాక్షసుల్లాటి ఆలుమగలు, మంచి సంతానం - దుర్మార్గ సంతానం, మంచి స్నేహితులు, చెడ్డ స్నేహితులు, స్వార్థపరులు - త్యాగమూర్తులు, జీవితం తెలిసిన చతురులు - తెలియని అమాయకులు, ధనాన్ని దైవంగా పూజించే వారు, ధనాన్ని గడ్డిపోచగా తీసి పారేసేవారు, ధైర్యవంతులు - భీరువులు - బీదవారు - గొప్పవారు. ఇలా మన చుట్టూ సంఘంలో ఎన్ని రకాల వ్యక్తులున్నారో ? అంతమందీ మనకి యీ పాత్రలలో దర్శనమిస్తారు.

సెక్రటరీలో 'రాజశేఖరం', జీవనతరంగాల్లో 'రోజా', మీనాలో 'మీనా', పార్థులో 'పార్థు', నీరాజనంలో మేనక, కీర్తికిరీటాల్లో 'స్వర్ణ' ఈతరం కథలో 'రమేష్', ఆగమనంలో 'ప్రసన్న', అగ్నిపూలులో 'కృష్ణ చైతన్య', ఇలా ఎన్నెన్నో పాత్రలు, యీమె నవలలు అనగానే మన కళ్ళముందు సజీవ వ్యక్తులుగా కన్పిస్తారు.

తెలుగు యువతుల గుండెల్లో తన 'వ్యక్తిత్వపు పరిమళాలతో' గుబాళించిన రాజశేఖరం, మగవాళ్ళ మనసుల్లో ఈర్ష్యాగ్ని రేకెత్తించిన మాట వాస్తవం. ఈమె కలం తెలుగు ఆడపిల్లకి 'వ్యక్తిత్వం' అనే 'వెన్నెముక' ఏర్పరిచింది.

ఈమె కలం కొన్ని నవలల్లో పంచకళ్యాణిలా పరుగులు దీసింది. మరికొన్ని నవలల్లో జలపాతంలా, సస్పెన్స్‌తో కూడిన సంఘటనలు వురికినాయి. ఇంకా కొన్నింటిలో పాఠకుల మనసుల్ని పండువెన్నెల్లో నిండు గోదావరి నీటిలా తళతళలాడి పోతున్నాయి.

అందుకే 5 దశాబ్దాలకి దగ్గరవుతున్నా ఈమె రచనలు, దశాబ్దాలు దాటినా, తరాలు మారినా, మొక్కవోని అభిమాన హృదయాల పరంపరతో, ఈనాటికీ తిరిగి ముద్రణలు వస్తున్నాయి. ఈమె నిజంగా తెలుగు నవలా దేశానికి, తిరుగులేని మహారాజ్ఞి. ఈమె కీర్తిచంద్రికలు, పాఠకుల మనోగతాల్లో వెన్నెల బావుటాలు.

ఈమె నవలలో అక్కడక్కడా, మనల్ని అబ్బురపరిచే, ఆలోచింపచేసే, జీవనసత్యాలు అనేకం వున్నాయి. అవి మన ఒంటరితనాన్ని పంచుకుంటాయి. చదివిన కొద్దీ అవి మన ప్రియనేస్తాలు అవుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, స్త్రీ - పురుషులు ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి ఉపయోగపడే కరదీపకలు యివి.

ఇవన్నీ ఏర్చి, కూర్చి మీ ముందు వుంచటానికి మాకు మహదానందం. ఇక వాటిని చదివి ఆలోచించటం మీ వంతు.

ప్రకాశకులు

నా మాట

ప్రియమైన పాఠకులకి,

నమస్కారం, దాదాపు నాలుగున్నర దశాబ్దాలు రచనలు చేస్తూ ఆయురారోగ్యాలతో, తరగని కీర్తిప్రతిష్టలతో, వసివాడని ఆదరాభిమానాలతో, జీవితయాత్రలో ఇన్ని సంవత్సరాలు అధిగమించటం అంటే, నిజంగా నా అదృష్టమే అన్పిస్తోంది.

శ్రీ మురళీకృష్ణగారు తను ప్రచురిస్తున్న నా 30 నవలల్లో అక్కడక్కడా వున్న 'జీవన సత్యాలు' కూర్చి ఒక పుస్తకం వేస్తే బాగుంటుందనే సూచన చేసినప్పుడు, వీటిల్లో అంతగొప్పవి ఏం వున్నాయి అనుకున్నాను. వారు ప్రచురించిన యీ 30 పుస్తకాల్లో వెతుకుతుంటే అక్కడక్కడా బాగానే దొరికాయి. ఇది నాకు ప్లెజెంట్ సర్ప్రైజ్. అలాగే మరికొన్ని నవలలు.

నా ప్రపంచం ఒక విధంగా చాలా చిన్నది అని, నేనెక్కడికీ రానని, మనుష్యులతో కలవనని ఒక విమర్శ నామీద బాగావుంది. నేను బైటకి ఎక్కువ రాని మాట నిజమే. కానీ నన్ను వెతుక్కుంటూ, ప్రపంచమే నా దగ్గరకి వస్తోందని చాలా మందికి తెలియదు. నా దగ్గరకి వచ్చే రకరకాల మనుష్యులు, నాకు రకరకాల గ్రంథాలుగా అన్పిస్తారు. వాళ్ళ బాధల్ని పంచుకోవటంలో, సమస్యలు వినటంలో, సంతోషంతో వారు చెప్పే మాటలకి స్పందించటంలో, నేను వారి నుంచి చాలా నేర్చుకున్నాను. మనిషి అంతరంగంలోకి తొంగిచూడగల విద్య అలవడింది. నైపుణ్యం పెరిగింది. నా యీ నవలల్లో మూల సంఘటనలు, ఇతివృత్తాలు, వ్యక్తిత్వాలు, వారి మంచి చెడుల, భిన్నవిభిన్న స్వభావాల అందమైన కలనేతకి, నా సృజనాత్మకత నగిషీలు మాత్రమే చెక్కింది అనటం యదార్థం. వీరికీ నాకూ మధ్య స్వభావంలో ఒక నమ్మకంలో సారూప్యత ఒకటి బలీయంగా వుంది. అది 'కుటుంబం' గురించిన నమ్మకం. కుటుంబాల్ని ద్వేషించే మనిషి మనసులో ఎక్కడో అంతర్గతంగా సైకాలజికల్ శిధిలావస్థ వుందని నా దృఢ నమ్మకం. రాష్ట్రపతి దగ్గర నుంచి రాళ్ళు కొట్టే వ్యక్తివరకూ, ప్రతి వారి యొక్క ఆంతర్యాలలో ఒదిగిపోయివున్న నివురుకప్పిన నిప్పులు, ఒయాసిస్‌లు

తెలుసుకోవాలని ఆరాటపడే మనస్తత్వం నా కలానికి ప్రాణంగా మారింది. నాయీ నవలలు చదువుతుంటే, ఇందులో సంఘటనలు, పాత్రలు, వారి స్వభావాలు, యింతగా చిత్రీకరించగల నైపుణ్యం కాలం, నా కలానికి ఎప్పుడు పదును పెట్టిందా అని ఆశ్చర్యం అన్పిస్తోంది. ఇవి గొప్ప నవలలు కాకపోవచ్చు. కానీ, నేను పయనించిన యీ కాలగమనంలో, కొంతమంది నాతోటి బాటసారుల జీవనదర్పణాలు అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఈ నవలలు చదివి ఎవరైనా "ఇప్పుడయితే మీరు యింకా బాగా వ్రాయగలరా" అని ప్రశ్నిస్తే రాయలేను అని ఢంకా మ్రోగించి చెప్పేయగలను. ఎందుకంటే, నాలుగుదశాబ్దాల క్రిందట నాలోవున్న ఆ అమాయకత్వం, ఆ స్పందించే మనసు ఆ కలల్ని నిజాలుగా చూపించగలిగే నిర్భీతి నాలో యిప్పుడు లేవు. అనుభవం అనే పాఠశాలలో నేను ఉత్తీర్ణురాలిని అయాను. కానీ, నా భావుకతలో, అమాయకత్వం ముగ్ధత్వం అంతరించిపోయినాయి. ఫరిణితి చెందిన మనసు మనిషికి చాలా ఉపయోగం. కానీ, సృజనాత్మకతకి మాత్రం అడ్డంకి. అప్పుడు ఊహల రెక్కల గుఱ్ఱాలమీద పరుగుదీసే మనసుంది. ఇప్పుడు వాస్తవాల్ని తోడు కోరుకునే వ్యక్తిత్వం ఇది. కాబట్టి ఇప్పుడు నేను సెక్రటరీలాటి నవల వ్రాయలేను. మరో రాజశేఖరం లాటి క్యారెక్టర్ సృష్టించలేనేమో అనుకుంటున్నాను.

ఈ పుస్తకంలో 99% యీ నవలలోవే, అని అప్పటి భావ జలధారల జలపాతాలుగా వురికినవే. వీటితోపాటు, ఇప్పుడు ఇవి వ్రాసేటప్పుడు అప్పటికప్పుడు మెరుపు వేగంతో వచ్చిన ఆలోచనల సత్యాలని కూడా మీ ముందు వుంచుతున్నాను. ఇవి రాబోయే పుస్తకాల్లో వుంటాయి.

మీకు నా కృతజ్ఞతలు, ఇప్పటికి ఇక శలవా మరి ? ఈ పుస్తకం మీకు అందించిన మురళీకృష్ణగార్కి కూడా కృతజ్ఞతలు మరో పుస్తకం రూపంగా మళ్ళీ మీ దగ్గరికి రాగలననే అనుకుంటున్నాను.

వుంటాను.

యద్దనపూడి సులోచనారాణి.

జీవన సత్యాలు

జీవనతరంగాలు

1. మనసులో అనుక్షణం డబ్బు గురించి బెంగపెట్టుకునే మనుష్యులు జీవితంలో సాహసించి ఏ సుఖమూ పొందలేరు.
2. ఆడపిల్లలకి డిగ్రీలు, హోదాలు కాకుండా మంచిచెడులు గ్రహించగలిగిన విచక్షణ, తనకి అన్యాయం జరగకుండా చూచుకునే తెలివి తేటలు కూడా చాలా ముఖ్యం.
3. జీవన ప్రవాహం ఎంతయినా వెనక్కుతోయనీ, దానికీ ఎదురీదాల్సిందే. భవిష్యత్తులో జూదం ఆడితీరాల్సిందే. ఒంటరిగా, నిస్సహాయంగా వున్నప్పుడు ఒక్కోసారి ఒక్కొక్క సంఘటన ఒక్కో తరంగంలా లేచి మీదపడి అడుగంటా ఘుంచేయాలని చూస్తుంది. దెబ్బతిన్నప్పుడల్లా, అపజయం పొందినప్పుడల్లా, రెట్టింపు మొండితనం చెప్పనలవి కానంత ధైర్యం, పిచ్చిబలం తెచ్చుకుని పోరాడాలి.

4. అభిమానమే ప్రాణంగా భావించుకునే వ్యక్తులకి అది చంపుకుని తిరగటం కంటే ఘోరమైన చిత్రవధ ఏదీలేదు.

5. ఈ ప్రపంచంలో దేనికీలేని శక్తి మనిషి మాటకుంది.

6. ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ గుండెల మీద చేయివేసుకుని ధైర్యంగా నాకెలాటి బాధలేదు, నేను నిశ్చింతగా వున్నాను అని చెప్పలేరు.

7. డబ్బులేకపోతే లేదనేది ఒక్కటే బాధ, డబ్బుంటే దానితో వచ్చే బాధలు అనేకం.

8. ఒక్కోసారి కొంతమంది చూడగలశక్తి వుండికూడా గుడ్డివాళ్ళు అవుతారు.

9. ఈ మనుష్యులందరూ ఎప్పుడూ దేవుడు అని చెబుతుంటారే ఆ దేవుడు మంచివాళ్ళ మనోమందిరాల్లో నివాసం వుంటాడని నా విశ్వాసం.

10. ఈ ప్రపంచంలో ఒకరికోసం ఒకరు వున్నారనుకోవటం పెద్ద భ్రమ.

11. ఈ ప్రపంచం ఎంత చీకటి అయితే నాకేం ? నువ్వే నా దీపం అయినప్పుడు నాకు భయం ఏముంది ?

12. మనుష్యుల్ని చంపాలంటే కత్తులు కఠార్లకంటే మాటలు, చేష్టలే పదునైనవి.

13. పొరబడటం మానవనైజం. కానీ పొరపాటు అని తెలిసిన తర్వాత చక్కదిద్దుకోవటం ఉత్తమమైన సంస్కారుల లక్షణం.

14. ఈ ప్రపంచంలో కొంతమంది అతి తెలివిగలవాళ్ళు వున్నారు. వాళ్ళు మనుష్యుల్ని అవసరానికి వాడుకుని తర్వాత అసలు ఎరగనట్టే ప్రవర్తిస్తారు. అలాటివాళ్ళు పురుగులుతో సమానం.

15. ఈ మనుష్యులు పుణ్యం కోసం యిన్ని పూజలు చేస్తారు. దానం పేరిట ఇన్ని ధర్మాలు చేస్తారు. భగవద్గీత, ఖురాన్, బైబిల్ యింతగా పఠిస్తారే తప్ప, వాటిల్లో వున్న వొక్క చిన్న సూత్రం అందరినీ మంచిగాచూడు. సమానంగా భావించు అన్నదాన్ని ఎందుకు ఆచరణలో పెట్టరో కదా.

16. చాలామందికి జీవితంలో తమ అపరాధం తెలుసుకుని పశ్చాత్తాపపడే లోపల విధి కౄరంగా శిక్షిస్తుంది. అప్పుడు ఆ మనిషి బాధ పదిరెట్లు అయి తరించటం సహజం.

17. ఒక్కోసారి ఎన్నెన్నో వూహించుకుంటాం. ఎంతో ఎదురుచూస్తాం. ఆ క్షణాలు వస్తాయి, వెళ్తాయి. ఏమీ జరగదు.

18. తెలివితక్కువతనంతో ఎవరైనా ఏదయినా తప్పు చేస్తే అది జీవితాంతం మెడలో గుదిబండగా భరించనవసరంలేదు. ఓర్పుతో సమయం కోసం ఎదురు చూసి, అదును దొరకగానే ధైర్యంతో దాన్ని తెగ్గొట్టుకోవాలి.

19. నిన్నెవరైనా చెడ్డవాడు అంటే, అది పట్టుకోవటానికి రెండు మార్గాలున్నాయి. దానికి వ్యతిరేకంగా మంచి పన్లుచేసి, వారి మాటని అబద్ధం చేయటం. రెండోది వారి మాటలని లక్ష్యపెట్టకపోవటం.

20. ఎవరి పొరపాటు వారిని బాధిస్తే ఫర్వాలేదు. అది ఇంకొకరి జీవితాన్ని బలితీసుకోకూడదు.

21. ఇదివరకు సమర్థులు, వ్యక్తిత్వం గలవాళ్ళ మధ్య ఎంత దివ్యంగా అపురూపంగా వుండే ప్రేమ ఇప్పటివాళ్ళ బలహీనతలకి, కోర్కెలకి బురఖా అయిపోయింది.

22. నీతి-అవినీతీ, ధర్మం-అధర్మం నీ మీద ఎంతగానైనా కత్తికట్టనీ, నా కన్నతల్లి కోసం ఈ ప్రపంచంతో ఒక్క నోటితో కాదు, వేయి నోళ్ళతో పోరాడతాను.

23. జీవితంలో ఐశ్వర్యం లేకపోయినా, పుష్కలంగా తెలివితేటలుంటే చాలు. ఒడిదుడుకులు దాటుకుని ఒడ్డుకి చేరవచ్చు.

24. ఎదుటివారికి ఏమీ ఇవ్వకుండా, తాము కావాలనుకున్నది ఒడుపుగా గుంజుకోవటం కూడా ఒక కళే.

25. ప్రతి ఆడపిల్లా నేర్చుకోవాల్సిన పాఠం "ఈ ప్రపంచంలో నన్ను నేను తప్ప యింకెవ్వరినీ నమ్మను."

26. భవిష్యత్ గురించి తెలియకపోతేనే జీవితంతో ధైర్యంగా పోరాడవచ్చు. తెలిస్తే ఒక్కోసారి గుండెలు బద్దలు అయ్యే ప్రమాదం వస్తుంది.

27. దురదృష్టవంతుడైన ప్రతివ్యక్తి చివరికి నాలాంటి దురదృష్టం పగవాళ్ళకి కూడా వద్దనుకుంటాడు.

28. ఎదుటి మనిషిలో మంచితనం చూసి నమ్మి మోసపోయాను అని గుండెలు బాదుకునేకంటే, నమ్మకపోతేనే సుఖం.

29. కొంతమంది ప్రేమంటే చెయ్యీ చెయ్యీ పట్టుకుని ప్రేమగీతాలు పాడుకోవటమే అనే భ్రమతో ప్రేమవైపు ఆకర్షింపబడతారు. తీరా

దిగిన తర్వాత అక్కడ పచ్చటి పచ్చిక బయళ్ళు కాకుండా ముక్కు పగలగొట్టే మురికి గుంటలు, ముళ్ళపొదలు, కరిచే పాములు, జెర్రులు వున్నచోటు అని అర్థం అవుతుంది.

30. తొలి యవ్వనంలో తొందరపడే వ్యక్తికి, వివేకం, విచక్షణా జ్ఞానం లోపిస్తే ఎప్పుడో ఒకసారి తెగిన గాలిపటంలా కూలిపోక తప్పదు.

31. జల్సారాయుళ్ళ ఖర్చు మహా సముద్రం అంత, జాగ్రత్తమంతుడి ఖర్చు నీటి తుంపరంత.

32. నా మనసు అనేక బాధలతో అవమానాలతో తూట్లు పడిపోయింది. నా బాధలు తీర్చటానికి భగవంతుడు ప్రత్యక్షం అయాడు కానీ ఆయన్ని కూడా నేను నమ్మలేక పోయాను.

33. మంచివాడు - సహృదయుడు అయిన మనిషి సమర్థుడయితే ఈ లోకంలో చాలా మంది అభాగ్యులకి, అశక్తులకి, ఉపకారం న్యాయం జరుగుతాయి.

34. ఈ రోజుల్లో జేబులు కొట్టేయటం అంటే వేరుశనక్కాయలు తిన్నంత తేలిక అయిపోయింది.

35. ఓ విధంగా ఈ ప్రపంచం చాలా మంచిది. దానికి చాలా వ్యాపకాలున్నాయి. ఎలాటి ఘోర విషయాలైనా యిట్టే పాతబడిపోతాయి.

36. బలహీనులకి - నిరాశ్రయులకి ఈ ప్రపంచం ముళ్ళపొద లాంటిది.

37. బుద్ధిహీనులు అసంఖ్యాకంగా వున్న ఏ దేశం పైకి రాదు.

38. కొంతమంది సాటి మనుష్యుల్ని కుక్కలకంటే హీనంగా, కుక్కల్ని మనుష్యులకంటే గౌరవంగా చూస్తారు.

39. అత్యాచారాలు, కుట్రలు, ద్రోహం, లంచగొండితనం అవినీతి మొదలయిన అంటురోగాలతో మన సంఘం మురిగిపోతోంది.

40. ఈ రోజుల్లో మనిషికి నీతి ముఖ్యమో - సుఖం ఎక్కువో దేన్ని చేపట్టాలో తెలియని అగమ్యగోచర పరిస్థితి ఎదురవుతోంది.

41. ఈ ప్రపంచంలో ఒక్కొక్కరికి ఒక్కొక్కపని సులువు అవుతుంది. బాగా పాడగలిగినవాడు పరుగెత్తలేడు. పరుగెత్తేవాడు పొలం దున్నలేడు. అందుకని ఎవరికున్న నేర్పుతో వారు జీవితాన్ని సౌఖ్యవంతం చేసుకోవాలి.

42. మనిషి ఎప్పుడూ తనని గురించి తాను వాస్తవం తెలుసుకోవాలి.

43. ఈ రోజులలో ప్రతివారికీ కష్టపడకుండా సుఖం రావాలి. గుఱ్ఱపు పందేలు, లాటరీలు మనిషిని యీ సత్యం నమ్మమని ప్రోత్సహిస్తున్నాయి.

44. సజీవమైన - సమర్థతగల జాతి ఎప్పుడూ తన సంస్కృతిని నిలబెట్టు కుంటూనే, ఎదుటివారిలో ఉన్న మనిషిని పొందటానికి తపన పడ్తుంది.

45. ఈ రోజులలో అనుకరణ - అర్థంలేని ఆడంబరం ఇదే ఒక పెద్ద సంస్కృతిగా మారింది.

46. ఈ లోకంలో పూర్తిగా అదృష్టవంతులు లేనట్టే - పూర్తిగా దురదృష్టవంతులు కూడా లేరు.

47. ఇదివరకు దొంగలు అని కొంత వర్గమే వుండేది. ఇప్పుడు ఆ వృత్తి అందరిదీ అయిపోయింది.

48. సాటి మనిషిని, ఎవరు ఎంత బాగా దోచుకోగలిగితే అంత ఘనత, అంత ప్రతిభ.

49. వార్ధక్యంలో తల్లిదండ్రులకి సుఖం - మనశ్శాంతి ఇవ్వని సంతానం క్షమించరాని నేరస్థులే.

50. నా భర్తగా నా జీవితంలోకి రావాల్సిన వ్యక్తిలో నేను కోరుకునే అర్హతలు : అతను పేదవాడయినా ఫర్వాలేదు. సమర్థుడు అయి ఉండాలి.

నన్ను ప్రాణంతో సమానంగా చూసుకోవాలి.

నా జీవన శోభకి అతను కరదీపిక కావాలి.

అతని ఆదర్శాలకి నేను కేంద్ర బిందువుగా మారాలి.

ఈ ప్రపంచంలో ఏ సంపదా యివ్వలేని సుఖం అతని సాన్నిహిత్యంలో నాకు లభించాలి.

మినా

1. దాంపత్యంలో భర్త అధికుడు - భార్య అల్పురాలు అయితే, అది యజమాని - సేవకుల సంబంధం అవుతుంది.
ఇద్దరూ సమాన ఉజ్జీలు అయితే, రణరంగంలో ప్రత్యర్థుల్లా అవుతారు. ఇద్దరిలో తెలివి, సమర్థత, మంచితనం - మమత వున్న జోడి ఆదర్శ దంపతులు అవుతారు.

2. ఈ ఫాషన్స్ అనేవి మహా చెడ్డవి అయస్కాంతాల్లా మనల్ని ఆకర్షించి, వాటికి బానిసలను చేసుకుంటాయి. మన ప్రవృత్తినే మార్చివేస్తాయి.

3. అలంకరణ అనేది మన సరదా కోసం మనం సృష్టించుకున్నదే తప్ప వాటికోసం మనం పుట్టలేదని ప్రతి స్త్రీ అర్థం చేసుకోవాలి.

4. ఈత వచ్చిన వాడికి లోతు నీళ్ళలో దిగే నిర్భయత్వం - తెగింపు ధైర్యం మనిషికి జీవితం పట్ల వుంటాయి. జీవితాన్ని అర్థం చేసుకున్నప్పుడే అది వస్తుంది.

5. కన్న తల్లితండ్రులని తప్పులు పట్టే అధికారం ఏ సంతానానికీ లేదు.

6. తల్లిని పూజించాలి, తండ్రిని గౌరవించాలి. భర్తని ప్రేమించాలి, స్నేహితుని పట్ల నిజాయితీగా వుండాలి. కన్నబిడ్డల పట్ల మమకారం వుండాలి. ఇవన్నీ మనిషి కుటుంబం నుంచి పారిపోకుండా పెద్దలు తెలివిగా చేసిన శృంఖలాలు.

7. కొన్నిచోట్ల ఆత్మీయత డబ్బు ప్రభావంతో కలుషితం అయిపోతుంది.

8. ఈ డబ్బు అనే నిచ్చెన దొరికితే, దానిమీద అలాగ్గా పైకి ఎక్కి కీర్తి ప్రతిష్టలు - స్వర్గ సౌఖ్యాలు అందుకో వచ్చని చాలా మంది అనుకుంటూ వుంటారు. కానీ ఈ నిచ్చెనకి దుఃఖము అశాంతి అనే రెండు భయంకర విషసర్పాలు పెనవేసుకుని వున్నాయి వాటి బారినుంచి తప్పించుకోవటం కష్టం అని చాలామందికి తెలియదు.

9. మనిషి మన తాత ముత్తాతల తరంలో, నిండుగా నూరేళ్ళు అనుభవించే జీవితం, ఈ తరంలో అడుగడుగునా ఎదురయ్యే ప్రమాదాలతో క్షణం తర్వాత మనం వుంటామా లేదా అన్నట్టు తయారయింది.

10. ఈ రోజుల్లో ఈ స్వామీజీల పుణ్యమా అని, జీవితం బుద్బుద ప్రాయం అని అర్థం అయినకొద్దీ, మనిషికి అన్నీ అనుభవించాలనే ఆరాటం ఎక్కువైంది.

11. పట్నవాసంలో గుడికి వెళితే, ఏ సినిమా హాలుకో, ఎగ్జిబిషన్‌కో వెళ్ళినట్టు ఎప్పుడు బైటపడ్తామా అన్పిస్తుంది.

12. కొన్ని జైళ్ళుంటాయి, వాటికి తలుపులు తాళాలు వుండవు. క్రమ శిక్షణ పేరిట అంతస్థులు, ఆచారాలు అంటూ పిల్లల్ని మానసిక జైలులో తోస్తారు తల్లిదండ్రులు. కొంతమంది కిమ్మనకుండా అనుభవిస్తారు. కొంతమంది ఎదురుతిరిగి పారిపోతారు.

13. జీవితంలో జరిగినవన్నీ గుర్తుండవు. గుర్తుంటే బలమైన సంఘటనలు, జ్ఞాపకాల్లో అప్పుడప్పుడూ ఆక్రందనలు చేస్తూనే వుంటాయి.

14. మనం మన పిల్లలకి చిన్నప్పటి నుంచీ ఆధ్యాత్మిక చింతన నేర్పితేగానీ, ఈ సమాజంలో ఈ దొంగసాధువులు అనే చీడపురుగులు నశించరు.

15. సున్నిత హృదయులారా జాగ్రత్త. సెంటిమెంట్ అనేది పాతచింతకాయ పచ్చడి అనే రోజులు వచ్చాయి.

16. నన్ను పెళ్ళి చేసుకునేవాడు, తన యింట్లో నాకు సామ్రాజ్యం సృష్టించాలి. నా భర్త - పిల్లలు - నా యిల్లు అనేవి, నా వార్ధక్యంలో నాకు మధురస్మృతులుగా మిగలాలి.

17. అపజయం నేను అస్సలు భరించలేను. అది నాలో వున్న రోషాన్ని రెచ్చగొట్టి నన్ను శివంగిలా చేస్తుంది.

18. ఆడపిల్ల ఎప్పుడూ తనలో తిరుగుబాటుని నివురుకప్పిన నిప్పులా దాచుకోవాలి.

19. ఇష్టంలేని వారి నుండి పాదరసంలా దొరకకుండా తప్పించుకు తిరిగే జాణతనం ప్రతి ఆడపిల్లా నేర్చుకోవాలి. లేకపోతే యీ ప్రపంచం నిండా ఆమె పాలిట 'ఇష్టం' ప్రదర్శించే కత్తుల్లాంటి మగవాళ్ళు చాలా మంది వున్నారు.

కీర్తి కిరీటాలు

1. మనిషి చదువు వల్ల పొందవలసింది మానవత్వం - మంచితనం కానీ, ఆడంబరం, అధికారం కాదు.

2. మనకి ఏం కావాలో మనం క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడే మన ప్రపంచం మనం సృష్టించుకోగలుగుతాం.

3. మన వ్యక్తిత్వం - మన తెలివితేటలు, సామర్థ్యం పట్టి మనం కోరుకున్న ప్రపంచం విస్తృతపరుచుకోగలం.

4. జన్మ నిచ్చినంత మాత్రాన ఎవ్వరూ తల్లిదండ్రులు కాలేరు పిల్లల్ని పెంచి పెద్దచేయాలి. వాళ్ళ మంచిచెడులు చూడాలి. అలా ఎవరు చూస్తారో వాళ్ళే నిజమైన తల్లితండ్రులు.

5. స్వార్థం కోసం ఎవరైతే పిల్లల్ని దూరం చేసుకుంటారో వాళ్ళంత వికృష్టులు లేరు. వారికి తల్లితండ్రులు అని చెప్పుకునే అర్హత లేదు.

6. ఆకలితో బాధపడే వాళ్ళు పడ్తూనే వుంటారు. వున్న వాళ్ళు వినోదాలకి, విలాసాలకి డబ్బు వెదజల్లుతూనే వుంటారు. ఇది మనం మార్చలేని చరిత్ర.

7. ఆవేశంలో వున్న ఏ మనిషీ సరైన ఆలోచన చేయలేడు.

8. ఈ పెద్దవాళ్ళంతా యింతే, పెళ్ళి అవగానే పిల్లలు మారిపోయారో అని గోలపెడ్తారు.

9. కొంతమంది జీవితంలో డబ్బుని తప్ప యింక దేన్ని ప్రేమించలేరు.

10. విరహం మనిషిని విషాదంగా - విరక్తిగా మారుస్తుంది.

11. అంతులేని కాంక్ష మనిషిని యంత్రంగా మారుస్తుంది.

12. స్వతంత్రం యివ్వకపోతే యివ్వలేదంటారు. యిస్తే ఎంత వరకూ ఉపయోగించుకోవాలో తెలియదు.

13. తెలిసీ తెలియని వయస్సులో హద్దులేని స్వేచ్ఛ చిన్న పిల్లాడి చేతిలో కత్తి లాటిది.

14. ఈ లోకంలో డబ్బుకి మించినది, డబ్బుని లెఖ్ఖచేయనిది - ఒకటి వుంది. దాని పేరు ప్రేమ.

15. ఈ ప్రపంచంలో డబ్బుకి లొంగిపోని వ్యక్తి అంటూ వుండడని కొంత మంది ప్రగాఢ విశ్వాసం.

16. ఏ వ్యక్తికి అయితే తనంటే ప్రాణంగా చూసుకునే వ్యక్తి జీవితంలో వుంటాడో, ఆ మనిషికి ఎనలేని సంపద వున్నట్టే.

17. బీదవాళ్ళంతా డబ్బుకి కక్కుర్తిపడతారనటం చాలా అన్యాయం.

18. ఆమెలో సగం చిన్నపిల్ల మనస్తత్వం. సగం కన్యలో ముగ్ధత్వం, అదో కలనేత వ్యక్తిత్వం.

19. కట్టుబాటు ఏర్పరిస్తే తెంచుకోవాలనే మనస్తత్వం మనిషికి వుంటుంది.

20. మనిషి మనసు స్వతహాగా స్వతంత్ర ప్రతిపత్తి గలది. దాన్ని నియంతృత్వంతో ఎవరైనా అణిచి వుంచాలని చూస్తే తిరగబడుతుంది.

21. నా ఉద్దేశ్యంలో ప్రతి మనిషి ఎదుటవ్యక్తిని ప్రేమించే కంటే తన మనసులో ప్రేమని ఆ వ్యక్తికి పటం కట్టి ఆ పటం ప్రేమిస్తాడు అనుకుంటాను.

22. ప్రేమించిన వాళ్ళ మధ్య అపార్థాలు, కొట్లాటలు అంటే వాన రాని ఉరుములు, మెరుపులు ఆర్భాటం అన్నమాట.

ప్రియసఖి

1. మంచి స్నేహితుడు అంటే మనలో లోపాల్ని నిర్మొహమాటంగా చెప్పేవాడు.
2. చాలా వరకు ప్రతీదీ మన స్వయంకృతమే. మనకృషి ఎటువైపుచేస్తే అటువైపు మన భవిష్యత్తు పెరుగుతుంది.
3. ఆడపిల్ల జీవితానికి రెండే రెండు ముఖ్యమైన విషయాలున్నాయి. కష్టపడి చదువుకోవటం, మంచి వ్యక్తిని చూసి భర్తగా పొందటం. కానీ, చాలామందికి యీ రెండింటిలో ఏదో ఒకటే దొరుకుతుంది.
4. పేరు ప్రతిష్టలు అనేవి మనిషిని ఎంత ఒంటరివాడిని చేస్తాయో అవి దక్కిన వారికే తెలుస్తుంది.
5. పేరులేని వాళ్ళు ఏ పని చేసినా ఎవ్వరూ పట్టించుకోరు. పేరుగల వాళ్ళు ఏ పనిచేసినా అందరూ భూతద్దాలతో చూస్తారు.
6. నా గుండెలు సానువుగా పరిచి దీనిమీద నువ్వు శయనించినప్పుడు నా హృదయ లోతుల్లో సంగీతం నీకు విన్పిస్తాను.
7. నువ్వెక్కడో - నేను అక్కడే వుంటాను కలలు నిండిన నీ కళ్ళలోనే మన కాపురం.

8. నువ్వంటే నాకు యిష్టం అని నీకెలా తెలియజేయను ? ఈ ప్రపంచంలో ఎవ్వరూ వాడని పద్ధతి నాకు కావాలి.
9. మనిషి జన్మ ఒక అపురూపమైన వరం. అందులో యవ్వనం ఒక మధుపాత్ర లాటిది.
10. ప్రేమికుల మధ్య మౌనమే అందమైన సంభాషణ.
11. సృజనాత్మకత గల ప్రతిమనిషిలోనూ భగవంతుడు ఒక అంతులేని వ్యధని కల్పిస్తాడు. అప్పుడే ఆ బాధ అనే కవ్వంతో చిలికిప్పుడే సృజనాత్మకత అనే వెన్న ఉదయిస్తుంది.
12. ఒక అంతులేని 'వ్యధ' ఒక 'మహత్కార్యానికి' నిచ్చెన మెట్టు అవుతుంది.
13. మనమే సుడిగుండంలో పడి కొట్టుకుపోతున్నప్పుడు యింకొకరికి ఏం ఆసరా యిస్తాం.
14. ఏ మనిషీ ఒకటి పొందటం కోసం యింకోటి పోగొట్టుకోకూడదు. అలా పోగొట్టుకుంటే ఆ నష్టం ఎప్పటికీ బాధిస్తుంది. పొందిన దాన్ని నిర్వికారంగా, ఎన్నటికీ ఆనందంగా అనుభవించలేడు.
15. చాలా మందికి యిష్టపడిన వాళ్ళతో జీవితం ముడిపడదు. కోరుకున్న వారు దగ్గర వుండరు. ఇది జీవితం మనిషితో ఆడే ఆట.
16. మగవాడితో అనుబంధమే జీవిత సర్వస్వం అనుకునే స్త్రీ పరమ మూర్ఖురాలు.

17. కాస్త చూసే నేర్పు - గమనించ గలిగే శ్రద్ధాసక్తులు వుండాలే గానీ, మన చుట్టూరా మానవ గ్రంథాలు ఎన్నో వున్నాయి.

18. ఈ నగరం నాకు ఒక పెద్ద మానవ జీవన గ్రంథాలయంగా కనిపిస్తోంది.

19. ప్రతి మనిషికి తన పట్ల తనకి నమ్మకం, భవిష్యత్ పట్ల ఆశ వుండాలి.

20. వసంత ఋతువుని చూడాలంటే గ్రీష్మం, వర్షఋతువులుని దాటాలి. జీవితం కూడా అంతే, సుఖశాంతులు పొందాలంటే బాధలు దాటాలి.

21. ఈ సృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ చెరి సమభాగాలు. వారిలో ప్రేమతో నిండిన ఏకత్వం లేకపోతే పరిపూర్ణత లేదు.

22. నా మనసు నీ దగ్గర నుంచి దూరంగా వెళ్ళిపోవాలని శాసిస్తోంది. నీ దగ్గరగా వుండాలని ఆశిస్తున్నది.

23. కోపతాపాలకి అతీతమైనది మన అనుబంధం. మనిద్దరిలో ఎవరైనా సరే ఒకరిని సంప్రదించకుండా ఒకరు ఏ పనైనా చేయవచ్చు. ఆ స్వేచ్ఛలో ఒకరిపట్ల ఒకరికి నమ్మకం వుండాలి.

24. నీ నుంచి నేను విధేయతని కోరను. విశ్వాసాల్ని కోరను. అధికారాన్ని వాంఛించను. నేను కోరేది ఒక్కటే, ప్రేమ.

25. ఈ ప్రపంచంలో కెల్లా అత్యంత దురదృష్టవంతులు - నిజమైన స్నేహితులను పోగొట్టుకున్న వారే.

26. మనిషి శాస్త్రవిజ్ఞానంతో చంద్రమండలం మీద కాలు పెట్టగలిగానని విర్రవీగుతున్నాడు. కానీ ప్రకృతి విలయతాండవం చేస్తే గడ్డి పోచలా మారిపోతాడు. అప్పుడపుడూ మనిషికి అతని స్థితి ఏమిటో తెలియ చెప్పటానికే ప్రకృతి యిలా విలయతాండవం చేసి తన ఉధృతరూపం చేపిస్తోందేమో.

27. మనిషి బ్రతకటానికి ఏదో ఒక వ్యాపకం వుండాలి. ఆ వ్యాపకం జీవితాన్ని అభివృద్ధి చేసేది అయితే మంచిది కదా.

ఈతరం కథ

1. మంగళసూత్రం అంటే జీవితం అనే తాడుకి రెండు హృదయాలు ముడివేయటం.

2. ఎక్కడ చూసినా పోటీ ! పోటీ ! ఈ రోజుల్లో మనిషి అహర్నిశలూ పరుగు పందెంలో వ్యక్తిలా, సర్వం మరిచి, అవతలవాడు ఎక్కడ ముందుకు వెళ్తాడోనని వూపిరి బిగబట్టి పరుగెత్తాల్సిందే. ఏమరుపాటుగా వుంటే వెనకవాడు ఒక్కతోపుతోసి ముందుకు వెళతాడు. ఆ ఒక్క తోపు వెనక్కి నెట్టటంలో, కొన్ని సంవత్సరాలు, కొన్ని జీవితాలు, కొన్ని భవిష్యత్తుకి వెనక్కి పడిపోతాయి.

3. ఈ ప్రపంచంలో ప్రతి మనిషికీ జీవితంలో ఒక్క రోజయినా 'నేను ప్రత్యేక వ్యక్తిని' అని ఆనందపడగలిగే రోజు రావాలి.

4. నేను ఆమెని ప్రేమ వివాహం చేసుకున్నాను. ఈ సంఘం చేసే శల్య పరీక్షకి, సంతలో పశువులా నిలబడాల్సి వచ్చింది.

5. ఈ ప్రపంచంలో న్యాయాన్యాయాలు, నీతి – అవినీతి అంటూ తూచే తులాదండానికి నిర్ధిష్టమైన నిలకడ ఏదీలేదు.

6. ఈ ప్రపంచాన్ని చేతిలో తోలుబొమ్మలా ఆడించాలంటే, నువ్వు మొదట డబ్బు సంపాయించాలి.

7. నీ దగ్గర ధనరాశులుంటే, సంఘం దయా ధర్మాలకి నువ్వు చూడనవసరం లేదు. అదే పేరు ప్రతిష్టలని వెంటపెట్టుకుని నీ ద్గగర వస్తుంది.

8. డబ్బు చిత్రమైంది. దాని విలువ అపారం. దాని విలువ శూన్యం.

9. విమర్శల కెరటం ఒక్కొక్కసారి ఉవ్వెత్తున వస్తుంది. సమర్థులం అయివుండి కూడా ఒక్కోసారి దీనికి తలవంచక తప్పదు.

10. పెళ్ళిళ్ళ పేరయ్యకి పెళ్ళి కుదర్చటం వరకే. కాపురాలు నిలబెట్టటం ఆయన బాధ్యత కాదు.

11. ఈ ప్రపంచంలో ఎంతమంది అన్నం లేక నకనకలాడ్తున్నారు. ఈ వున్న వాళ్ళేమో కోపతాపాలతో భోజనం వద్దని భీష్మించుకు కూర్చుంటారు.

12. ఈ మనుష్యులంతా, వాళ్ళ రంగులు, జాతులు, భాషలు వేరుగానీ, బుద్ధులు మాత్రం ఒకటే.

13. ఈ మనుష్యులు తలోరకం అయినా, ఒక్కదానిలో మాత్రం అందరిదీ ఏక కుటుంబీకుల్లాటి స్వభావం. అది ధనాశ.

14. ప్రేమికులు పోట్లాడుకున్న తర్వాత రాజీపడటంలో పొందే ఆనందం అపురూపమైనది.

15. కొంతమంది భార్యలు, భర్తలని గారాబం చేసి, వారిని సోమరిపోతులుగా తయారుచేస్తారు.

16. భర్త అంటే భరించేవాడు. అని నిన్నటి సత్యం. భరిస్తాడా ? అవును. భార్య సతాయింపులు భరిస్తాడు కదా. ఇది ఈ రోజు సత్యం.

17. జీవితం పట్ల కన్నెపిల్ల కలలకి – వాస్తవానికి, ఆకాశం – భూమి అంత తేడా.

18. మనుష్యులకి గౌరవం తెచ్చిపెట్టేది వాళ్ళ బుద్ధులుగానీ, వాళ్ళ వృత్తులు కాదు.

19. కష్టాలు కలకాలం వుండవు. కానీ అవి వచ్చినప్పుడు ఒకరికి ఒకరు అనుకునే మాటలే చిరకాలం మిగిలిపోతాయి.

20. అదృష్టానికి నిర్వచనం డబ్బుకాదు. తృప్తి, ఆనందం.

21. ఏం పట్నవాస జీవితాలు, అసంతృప్తుల కీకారణ్యాలు, నీటి కరువు, పాల కరువు, క్షణం క్షణం చిరాకే. ఎక్కువ కాలం ఉదయం లేవగానే 'పనిమనిషి రాలేదు' అనే ఆదుర్దాతో మొదలయితే రాత్రి పడుకోబోయే ముందు 'ఛీ వెధవలైట్లూ ఎప్పుడూ పోవడమే' ముగుస్తుంది.

22. జీవితం యంత్రంలా తిరిగిపోతోంది. పెళ్ళి - తర్వాత పిల్లలు, వాళ్ళు పెద్ద వాళ్ళవటం, వాళ్ళ పెళ్ళిళ్ళు అల్లుళ్ళు - కోడళ్ళ రాకలతో సమస్యలు, గుట్టుచప్పుడు కాని పేచీలు - సర్దుబాట్లు, నీ తల నెరుస్తుంది. పళ్ళు వూడ్తాయి. తరం మారిపోతుంది.

23. పిల్లల్ని తల్లితండ్రులు కొడ్తారేమో అనే భయంతో వుంచాలి తప్ప కొట్టకూడదు

24. నేను దేనికైనా రాజీపడగలను, ఒక్క నా పిల్లల భవిష్యత్తు భయంకరమైన దారిద్ర్యం అన్న విషయం తప్ప.

25. భర్తలు వదిలేసిన భార్యలు, ఆశ్రయంలేక ఆత్మహత్యలు చేసుకున్న స్త్రీలు, తిండానికి గడవక మానవదోపిడీని మౌనంగా సహించే స్త్రీలు వీరిని చూస్తుంటే, నాకు స్త్రీత్వం మీద ఈ రచయితలు కీర్తించేదంతా ఒట్టి బూటకం అని అగం అనింది అంత

26. అమాయకుల్నీ - మొహమాటస్థులనీ ఈ లోకం క్రూరంగా హింసిస్తుంది. రౌడీలని - గూండాలని చూస్తే తోక ముడిచిన పిల్లి అవుతుంది.

27. స్త్రీ తన జీవితాన్ని యిల్లు - భర్త - పిల్లలు అనే ప్రపంచానికే పరిమితం చేసుకుంటే ఆమె పయనం ఎప్పుడో ఒకసారి ఎండమావులు అని తెలుసుకుంటుంది.

28. లోకానికి ఋజువు చేయలేనంత మాత్రాన సత్యం - అసత్యంగా ఎప్పటికీ మారదు.

29. ఈ రోజు మనకి ఉత్తమం అనిపించిన విషయం, ఎప్పుడో ఒకరోజు భవిష్యత్తులో ఒట్టి తెలివితక్కువ నిర్ణయం అని తెలుస్తుంది.

30. పిల్లలు అంటే కట్టుకున్న భార్యకే గాని వుంచుకున్న స్త్రీకి కాదు అనుకుంటాడు మగాడు. ఆ నమ్మకానికి ప్రతిరూపాలే ఇన్ని అక్రమ సంతానాలు.

31. మగవాళ్ళకి పరువుకోసం - పిల్లల కోసం పతివ్రతలులాటి భార్యలు కావాలి. హుషారు కోసం ఉంపుడుకత్తెలు కావాలి. అలాటి స్వార్థపరులైన రెండు నాల్కల మగవాళ్ళు వున్నంతకాలం సమాజంలో అమాయకులైన పిల్లలు బలి అవుతూనే వుంటారు.

32. ఈ మగవారికి పెద్దమనుషులుగా నీతిగా బ్రతకాలనే నిష్టలేదు. నిగ్రహం లేదు. పైకి చూస్తే రాముడి వేషం. లోలోపల చూస్తే కోర్కెల సహస్రఫణుల నాగుబాములు.

33. భర్త అంటే మనసా-వాచా నా వాడయి వుండాలి. అని నమ్మేతరం ఈనాటి ఆడపిల్లది.

నీరాజనం

1. ఈ రోజుల్లో డబ్బులేని వాళ్ళకంటే, డబ్బున్న వాళ్ళకే కష్టాలు ఎక్కువ. ఎందుకంటే ఆ ధనకాంతికి అభిమాన పురుగులు చాలా చేర్తాయి.

2. కొంతమంది అనుభవజ్ఞులకి, లోకం గురించి చెప్పాలంటే, పండితుడిని అక్షరాలు గుర్తుపట్టమన్నట్టే.

3. ఏ మహారాజు అయినా, తన యింటి విషయాలు లోకానికి తెలియకుండా జాగ్రత్తపడగలడు కానీ, తన నౌకర్లకి తెలియకుండా దాచలేడు.

4. కొందరికి దరిద్రంలాగానే తెలివితేటలు కూడా శాపంలా మారుతాయి.

5. ఈ జీవితాన్ని మనం బాధలు కష్టాలు, కన్నీళ్ళు, ఆనందం, ఆశాభంగం అనే ఇటుకలు, ఇసక, సిమెంట్‌తో నిర్మించుకోవాలి.

6. పిరికివాళ్ళకి చిన్న రాయి కూడా పెద్ద శిలలా భయపెడ్తుంది.

7. అవమానం, అవమానం ఇప్పటి తరం నోట్లోంచి మొదటిగా వచ్చేమాట. ప్రేమించిన వాళ్ళు ప్రేమని తిరస్కరిస్తే అవమానం,

పరీక్ష తప్పితే అవమానం. పెళ్ళికాకపోతే అవమానం, ఉద్యోగం లేకపోతే అవమానం తల్లితండ్రులు తిడితే అవమానం, భర్త చూడకపోతే అవమానం. అసలు యిప్పటి తరం ఆలోచనలోనే వక్రమార్గం వుంది. ఏ చిన్న కారణం అయినా సరే భూతద్దంలో నుంచి చూసి, అవమానం అనుకుని నిద్రమాత్రలు మింగటం లేక ఉరేసుకోవటం కాకపోతే కిరసనాయిలు పోసుకుని తగలపెట్టుకోవటం ఇదొక మ్యాడ్ థింకింగ్. వెరీ వెరీ రాంగ్ థింకింగ్.

8. ఆత్మహత్య చేసుకున్న వారు వాళ్ళు ఒక్కరే మృతిచెందుదురు. వారు చచ్చిపోతూ ఇంట్లో వున్న మిగతా అందరినీ మృతప్రాయులుని చేస్తారు. ఆ యింట్లో వారి మృత్యు నీడ వెక్కిరిస్తూనే వుంటుంది. వారి జీవితాల్లో ఆనందం తుడిచివేయబడుతుంది. ఇది తప్పు చేయని వారికి శిక్ష.

9. ఈ జీవితం వుందే, ఇది పూర్తిగా ఎవ్వరికీ లభించదు. ఏ ఒక్కరిని చూసినా ఏదో ఒక లోపం వుండి తీరుతుంది.

10. ఈ జీవితం ఒక చెట్టు లాంటిది. దీని శాఖోపశాఖలు అనేకం. ఒక కొమ్మకి చీడపడితే, అది నరికేస్తారు కానీ చెట్టు మొత్తం కొట్టేయరు. జీవితంలో ఆశాభంగాలూ - అవమానాలు అంతే అనుకోవాలి.

11. మన జీవితాల్లో ఎదురయ్యే సమస్యలు కూడా విషజ్వరాల్లాటివే, వాటికి తగిన మందులు అనే పరిష్కారాలు వాడి మళ్ళీ కోలుకోవాలి.

12. ఆత్మహత్యలకి ముఖ్యకారణం జీవితం పట్ల ఆశ – నమ్మకం లేకపోవటమే.

13. ప్రేమించటం నేరం కాదు. ప్రేమని అర్హతలేని వ్యక్తికి అర్పించటమే నేరం. దానికి వచ్చే శిక్ష ఎవ్వరూ తప్పించుకోలేరు.

14. చచ్చిపోతే ఏముంది ? చీకటి ? నల్లటి గుహలాటి అనంతమైన చీకటి. దానికంటే ఈ సృష్టి మధ్య బ్రతుకువెలుగులో నిలబడి జీవితంతో పోరాటమే వేయిరెట్లు నయం.

15. ఏదయినా జరగాలని మన మొహాన వ్రాసి వుంటే, ఏ మంత్రతంత్రాలూ దాన్ని ఆపలేవు.

అనురాగ తోరణం

1. చాలామంది భర్తలు, భార్యలని డబ్బు సంపాయించడం చేతకాదని ఈసడిస్తూ వుంటారు. కానీ మగవారు డబ్బు సంపాయించటానికి ఆ భార్యలు అందించే సహకారంలో ఎంత శ్రమ వుందో వారికి తెలియదు.

2. భర్త–భార్యని 'నీ పుట్టింటికి ఫో!' అని యీసడించినప్పుడు, అవమానాగ్నితో భగభగలాడే ఆమె హృదయంలో అతన్ని చంపాలి అనే ఆలోచని నిశబ్ధ కెరటంలా లేచి నిశబ్దంగా అంతరిస్తుంది.

3. భర్త ఎప్పుడూ అహంకారంతో నేను నా భార్యకి తిండిపెడుతున్నా అనుకుంటాడు. కానీ అహంకారం పొందాల్సింది భార్య. ఆమె నీడలో అతను బ్రతుకుతున్నాడని అతనికి తెలియదు. ఆమె ఆ భర్తకి చేసే కష్టం యింకెక్కడ చేసినా అంతకు మించి ఆమెకి దొరుకుతుంది.

4. స్త్రీ తను చాలా మంచిదాన్ని అని – పురుషుడు తను గొప్పవాడినని విర్రవీగితే ఆ సంసారంలో భూకంపం వస్తుంది.

5. ఈ రోజుల్లో యువతకి భార్యగా తన బాధ్యతలేమిటో క్షుణ్ణంగా తెలుసు. అంతేకాదు భర్త దగ్గర నుంచి తను పొందాల్సిన అనురాగం, అర్హత, అధికారం కూడా [illegible] బాగా తెలుసు.

6. మా అమ్మమ్మ తరం భర్త అంటే మగమహారాజు అనుకునేవారు. మా అమ్మ తరం మనకి అన్నంపెట్టే ధర్మాత్ముడు అనుకునేది. నా తరం 'మొగుడంటే మొగుడే' అనుకునేది. ఇప్పటి తరం 'మొగుడంటే దిగివచ్చిన దేవుడేం కాదు. నేను ఎంతో తనూ అంతే' అంటుంది.

7. ఇప్పటి ఆడపిల్లలు తెలివిగలవాళ్ళు, వాళ్ళు సంసారం చక్కటి ప్లానింగ్‌తో చేసుకుంటారు. భర్తకి కూడా సరిహద్దులు గీస్తారు. ఆ సరిహద్దుల్లో యిమడకపోతే అతన్ని తమ జీవితంలో నుంచి గెంటేయటానికి వెనుకాడరు.

8. భర్త లోకం బైట ప్రపంచం అదో తలనెప్పి. భార్య లోకం యింట్లోనే, ఈ ప్రపంచం మరీ తలనెప్పి.

9. ఈ రోజుల్లో సంపాదనలో పురుషాధిక్యత అనే మాట అదృశ్యం అయిపోతుంది. కొద్ది రోజుల్లో స్త్రీ ఆధిక్యత పర్సంటేజ్ ఎక్కువ అవుతుంది.

10. ఈ రోజుల్లో అందరికీ జీవితం అంతా సమస్యల మయం. ఆదుర్దా, ఆందోళనలతో నిండి వుంది. ఈ పిచ్చి ప్రపంచం నుండి దూరంగా పారిపోవాలంటే 'దాంపత్యం' అనే శాంతి దీవి నీకు తప్పక కావాలి.

11. రెండు ద్వారబంధాలని కలిపే పచ్చటి మామిడాకు తోరణంలా, భార్యాభర్త లిద్దరి మధ్యా అనురాగ తోరణం వుండాలి.

12. ఈ ప్రపంచంలో దెయ్యాలు లేవు. ఉన్నదల్లా వాటి గురించి మన మనసులో భయం.

13. మనకి కావాల్సిన దానికోసం విసుగుపడకుండా ప్రయత్నం చేస్తూనే వుండాలి.

14. ఈ రోజుల్లో యువకులకి ఆడపిల్ల అందచందాలతో పాటు ఉద్యోగాలు చేసే అర్హతలు కూడా కావాలి. డబ్బు, శక్తి సరదాలు, కోరికలు, కలలు అతనికి ధారపోయాలి. అర్హురాలయిన ఆడపిల్ల అడిగింది "నా కోరిక విను. నాకు భర్తగా శ్రీరామచంద్రుడంత ఏకపత్నీవ్రతుడు, కృష్ణుడంత రాజకీయవేత్త, బుద్ధుడంత శాంతమూర్తి కావాలి" అతనికి కోరుకున్న స్త్రీ దొరికింది. ఆమెకి కోరుకున్న మగాడు దొరకలేదు.

15. మన పాత చాందస భావాలమీద, వివేకం అనే వెలుగువర్షం పడేదెప్పుడో?

16. సమస్యలు వచ్చినప్పుడు మధ్యతరగతి వాళ్ళకి ఓపిక ఒక్కటే వజ్రాయుధం.

17. ఈ రోజుల్లో ఆడపిల్లలకి చదువు - సంపాదన రెండు రెక్కలు వచ్చినట్టుంది.

18. మనం బజారు కెళ్తాం. షాపులో ఖరీదైనవి - అందమైనవి చాలా బట్టలుంటాయి. మన పర్సులో వున్న డబ్బుమేరకే మనం కొంటాం. జీవితం కూడా అంతే. ఈ ప్రపంచంలో ఎన్నెన్నో సుఖాలున్నాయి. అన్నీ మనకి దొరకవు అని తెలుసుకున్నవాడు జ్ఞాని.

19. కొంతమందికి జీవితంలో ప్రతిదీ లోటే. చాలా కాలం వృథా అయిన తర్వాత గానీ వారి ప్రయాణం మొదలవదు.

20. ఈ ప్రపంచంలో 'మంచి' అనే దాని ప్రాణం చాలా సుకుమారం. దాన్ని ప్రతి మనిషీ జాగ్రత్తగా కాపాడాలి. లేకపోతే ఈ సంఘం రాక్షసుల మయంగా మారిపోతుంది.

హృదయగానం

1. మగపిల్లాడికంటే, ఆడపిల్లకి తల్లి అండ ఎంతో అవసరం.
2. ఇప్పటి యువతులు ఎంత తెలివిగలవాళ్లు వాళ్ళకి సంసారం చేయటం అంటే రాజ్యం ఏలినట్టే. ఆమె కుటుంబానికి ఆమే మహారాణి.
3. నదికి ఉపనదులుంటేనే నిండు. మనిషికి విద్యతోపాటు సంస్కారం, సంస్కృతి, మంచితనం, ప్రేమ, నిరాడంబరత ఇవికూడా వుంటేనే నిండయిన వ్యక్తిత్వం.
4. కౌమారదశలో ప్రేమ తొలకరి చినుకులాంటిది.
5. కొంతమందికి పక్క మనుష్యుల్ని ముంచేసి తమని తాము రక్షించుకునే నేర్పు వుంటుంది.
6. ఈ లోకంలో ప్రేమ వేరు - ఆరాధన వేరు. పెళ్ళివేరు స్నేహం వేరు, అనురాగం వేరు, ఆత్మీయత వేరు. వీటి నిర్వచనాలు సరిహద్దులూ చాలా మందికి తెలియవు. ఒకటి అనుకుని పొరబడిపోయి యింకోదానిలోకి వెళ్ళిపోయి జీవితం సమస్యల వలయం చేసుకుంటారు.

7. ప్రేమ ఎదుట మనిషి నుంచి తనతో ఏకత్వం కోరుకుంటుంది.
8. కోకిల అయినా కాకులతో కలిసి తిరుగుతుంటే కాకిసుమా అంటారు. మనం ఎవరితో స్నేహం చేస్తామో వారి ప్రభావం మన మీద తప్పక పడుతుంది.
9. ఉంటే సజ్జనుడు అయిన వ్యక్తితో స్నేహంగా వుండాలి. లేకపోతే ఒంటరిగా మిగిలిపోవటం ఉత్తమం.
10. ఎదుటివారిని అర్థంచేసుకోగలిగితే సగమే లాభం. నిన్ను నువ్వు అర్థం చేసుకుంటే నీకు పూర్తి రక్షణ.
11. మంచి మనుష్యుల గుండెలోతుల్లో మానవత్వం పాడే రాగమే హృదయగానం.

ఆగమనం

1. పిల్లల్ని ఎంత గారాబం చేస్తామో - అంత డిసిప్లిన్ కూడా నేర్పితే వారి వ్యక్తిత్వం సంపూర్ణంగా ఎదుగుతుంది.
2. భర్త లేకపోయినా, వదిలేసినా, ఒంటరితనంతో కృంగిపోకుండా చాలా మంది మధ్యతరగతి సాధారణ స్త్రీలు పిల్లలని పెంచి పెద్దచేసి తమ కర్తవ్యం నెరవేరుస్తారు. వీరు నిజంగా ఎవ్వరూ ప్రశంసించని హీరోయిన్లు అంటాను నేను.
3. ప్రతి స్త్రీ తెలుసుకోవాల్సినది ఒకటి వుంది కుటుంబం నడపటానికి ఎవరిమీద ఆధారపడకుండా పనిచేయటంలో కష్టం ఎంత వుందో ఆనందం కూడా అంత వుంటుంది. ఆ కష్టపడటంలో స్వేచ్ఛ ఎవరికీ తెలియదు.
4. నిన్నటి తరం స్త్రీ డబ్బు సంపాయించే మగాడిని చేసుకోవటానికి ఆరాటపడేది. అది తారుమారు అయింది. ఇప్పటి యువకుడు అదే దోవకి వచ్చాడు.
5. పెళ్ళిని గురించి సెంటిమెంట్‌కి పోతే మనసంతా క్షోభ. ఇద్దరు కలిసి జీవించటానికి అది ఒక సులభ సూత్రం అనుకుంటే ఏ పేచీ వుండదు.

6. పిల్లల్ని కనగానే సరిపోదు. వాళ్ళని జాగ్రత్తగా పెంచటం కూడా తెలియాలి.
7. దేవుడు కనికరిస్తే అపరిచితులు కూడా ఆత్మీయులు అవుతారు.
8. కష్టాలు కలకాలం వుండవు. నేను సుఖపడ్తాను అనే ఆశ మనిషికి వుండాలి. వర్షాకాలం వస్తుందని గాఢ నమ్మకంతోనేగా మనిషి గ్రీష్మ ఋతువు ఓర్చుకుంటాడు.
9. మనిషి ఏం కోరుకుంటాడో అది దొరకాలి. అపుడుగాని తృప్తి, ఆనందంతో జీవితం సంపూర్ణంగా బ్రతుకుతున్నట్టు అన్పించదు.
10. మనలో నూటికి 99 మంది జీవితం జీవిస్తున్నట్టు కాకుండా మొక్కుబడిగా బ్రతుకుతున్నట్టుంటారు.
11. ఎంత మనోనిబ్బరం వున్నా, ఎంత ప్రవర్తన విషయంలో ఖచ్చితంగా వున్నా, ఈ ప్రపంచంలో ఒంటరిగా బ్రతకటం అంటే పాము, తేళ్ళులాటి విషకీటకాల్లాటి మనుష్యుల మధ్య వున్నట్టే వ్యధాపూరిత, దుఃఖప్రేరిత ప్రతి స్త్రీ హృదయం, "నేనూ అందరిలా గౌరవంగా బ్రతకగలను. ఆ క్షణం కోసం నా జీవితం ధారపోసి, ఆఖరి నిముషం వరకూ ఎదురుచూస్తాను.
12. మనిషికి ఆకలివేస్తేగానీ అన్నం రుచి తెలియదు.
13. కష్టాలు అనుభవిస్తేగానీ, సుఖంలో వున్న అసలు ఆనందం అర్థం గాదు.
14. కళాకారుడికి కళని సృష్టించటమే తెలుసు. దాన్ని పదిమందిచేత గుర్తింపచేసి భేష్ అన్పింపచేయడం దానిని వెలకట్టే వ్యాపారికే తెలుసు. ఇది కళకి - వ్యాపారానికి వున్న అవినాభావ సంబంధం.

15. మగవాళ్ళు అపరిచిత ఆడవారితో పరిచయం ఆత్మీయతగా పెంచుకోవటంలో చతురులు. అది వద్దనుకుంటే అంతలోనే దాన్ని తుంచి వేయటంలో యింకా సిద్ధహస్థులు.

16. అరటితోట పచ్చదనం, కొబ్బరికాయల గుట్టలు, వరికంకుల చిరునాట్యం, ఆకాశం క్రిందవుందా, పైనవుందా అనిపించే రోడ్డు కిరుపక్కలా పంటకాల్వలు, గూటిపడవల్లో - వెన్నెలో పయనం, చీకట్లో కీచురాళ్ళ మోత ఇవే జీవన వృక్షానికి మూలాధారం.

17. నేను కీర్తి ప్రతిష్టలు అనే హిమాలయాలు ఎక్కాను, కానీ మనసులో చిన్న కుగ్రామం నుంచి వీడిరానని మొరాయిస్తోంది.

18. స్నేహితునితో సాన్నిహిత్యం మంచి గంధం లేపనంలా మనసుకి ఎంతో శాంతిని - హాయినీ యిస్తుంది.

19. మనందరికీ అసలు జన్మని ప్రసాదించేది ప్రకృతి. స్త్రీ గర్భసంచీ అనేది ప్రకృతి వెతుక్కున్న చోటు మాత్రమే.

20. జీవితంలో ప్రేమని పొందిన వ్యక్తికి స్వంత యింటిని పొందినట్లే ప్రేమ దొరకని వ్యక్తి పేవ్‌మెంట్ మీద నివాసుడే.

21. ఒక్కోసారి అవసరం 'ప్రేమ' నోటిని నొక్కేస్తుంది.

22. ఒక్కోసారి నిశ్శబ్దం ఎంత అందంగా వుంటుందో ! ఒక్కోసారి అత్యంత భీతావహంగా వుంటుంది.

23. కొన్ని యుగాలుగా స్త్రీ సహనం పాటిస్తోంది. ఇక ఆమె దానికి చెల్లు చీటి వ్రాయాల్సిన రోజులు వచ్చాయి.

24. నేను ఉద్యోగ విరమణచేసి వచ్చానని ఆనందపడ్డాను. నువ్వు పుణ్యకాలం చెల్లిపోయిందని చెప్పినట్టు ప్రాణం విడిచావు.

25. చాలామంది పనికిరాని ఆలోచనలతో, ఆవేశాలతో, జీవనజలం నేలకి జార్చుకుంటారు.

26. స్వార్థపరుడు అంటే ఈ ప్రపంచంలో వున్న వెన్నెలంతా నాకే కావాలి అని కోరుకునేటంత వెర్రివాడు.

27. ఆనందం అనేది ఎక్కడ నుంచో రాదు. అది నీ మనసులో పుట్టి నివసించాలి.

28. ఎదుటివాళ్ళు మొండిగా ప్రవర్తిస్తే నువ్వు జగమొండిగా మారగలవని వాళ్ళకి తెలియజేయి.

29. చీకటివేళ ముసిరే ఒంటరితనం రెట్టింపు బాధాకరంగా వుంటుంది.

30. దాంపత్యం అంటే, ఒకరి పక్కన ఒకరు, అర్థరాత్రి వేళ మెలకువ వస్తే మరొకరు తోడు. ఒకరికి భయంవేస్తే యింకొకరు ధైర్యం చెప్పటం. ఇలా జంటగా వుండేవారి దగ్గరకి ఒంటరితనం చుట్టుపక్కలకి కూడా రాదు.

31. చాలా మంది వయసుమీరిన వ్యక్తులు, గతించిన జీవితం వరండాల్లోనే తిరుగాడుతూన్నట్టు అవే మాటలు మాట్లాడుతూ వుంటారు.

32. కొంతమంది వృద్ధులకి వయస్సు భారంతో శరీరం జీర్ణించినా, మనసు చురుకుదనం మాత్రంపోదు. వీరు వయసు కుర్రకారులు. వయసులో వున్న కొంతమంది శరీరం చురుగ్గా వున్నా బుద్ధి మందగిస్తుంది. వీళ్ళు కుర్రవృద్ధులు.

33. ఈ ప్రపంచం ముందు ఆమె వ్యక్తిత్వానికి ఒక మేలి ముసుగు. భర్త ముందు మాత్రం ఆమె వ్యక్తిత్వం అనాచ్ఛాదిత.

34. ఈ ప్రపంచాన్ని ఎవ్వరూ మార్చలేరు. నేను దానికి అనుగుణంగా మారటం తప్ప నాకు గత్యంతరం లేదు.

35. అమావాస్య చీకటిలో చిరుదీపమే కొండంత వెలుగు. దుర్మార్గం నిండిన యీ ప్రపంచంలో, సాధ్యమైనంతవరకూ యింకొకరికి అన్యాయం చేయకుండా బ్రతకాలి అనుకునే వ్యక్తి మహామనిషి అనుకోవాలి.

దాంపత్య వనం

1. తమ స్థితి మర్చిపోయి అందలాలు ఎక్కాలని పరుగెత్తేవాళ్ళు బోర్లా పడక తప్పదు.

2. ఒకమాట అబద్ధం చెప్పిన దానికంటే, ఒక సత్యాన్ని వెల్లడించకుండా మౌనం వహించటం చాలా పాపం.

3. ఏ నదికి అయినా ఉపనదులు వుంటేనే బలం. మనిషికి విద్యతోపాటు సంస్కారం, సంస్కృతి, నిరాడంబరత, మానవత్వం వుంటేనే నిండయిన వ్యక్తిత్వం.

4. యవ్వనంలో యీ ప్రపంచాన్నంతా మార్చేయగలనని ధీమాపడ్డాను. వయసు మళ్ళేసరికి యీ ప్రపంచానికి అనువుగా నేనే మారాను.

5. నేను మానవత్వం కోసం వేటకి వెళ్ళాను. స్వార్థపరులు, చెడ్డవాళ్ళు అనే భయంకర మృగాలు నన్ను తరిమికొట్టాయి.

6. నేను పెళ్ళి అంటూ చేసుకుంటే నా ఆనందం కోసమే చేసుకుంటాను. ఈ భార్యా పిల్లలకి చాకిరీచేసే బానిసగా మాత్రం వుండను.

7. మనిషి ధైర్యంగా వుంటే బాధలేం చేస్తాయి.

8. జీవితంలో నా అనే వాళ్ళు లేకుండా బ్రతకటమే ఒక దురదృష్టం. పై నుంచి రాక్షసుల్లాటి మనుష్యుల నీడల్లో బ్రతకాల్సి రావటం యింకా మహా దురదృష్టం.

9. నేను నా దురదృష్టంతో జీవితాంతం యుద్ధం చేసాను. వానిని లొంగదీసుకోవాలని వెర్రి ప్రయత్నం చేసాను. నాకు నేను దానిచేతలో బందీనని, నాకు విముక్తిలేదని తెలిసింది.

10. నిస్వార్థంగా, మంచి మనసుతో నాకు తోడ్పడిన నువ్వు ఈ లోకం దృష్టిలో ఒక మామూలు వ్యక్తివి అయినా

ప్రేమలేఖలు

1. మనిషి ఆశపడటం నేరం కాదు. అమాయకంగా వుండటం అపరాధమూ కాదు.

2. జీవితంలో అనుభవం అనే సూర్యుడు తొంగిచూసినప్పుడు అమాయకత్వం, మంచుతెరలు తొలిగినట్టు మాయమౌతుంది.

3. గెలుపు ఓటమి సంగతి కాలం నిర్ణయించినా ఎదుర్కోటమే స్త్రీ జీవన ధ్యేయం కావాలి.

4. తెలిసీ తెలియని వయసులో ఏర్పరుచుకున్న ఆశలు కాలసర్పాలై కాటేయటానికి బుసలు కొడ్తుంటే చూస్తూ వూరుకునే నిస్సహాయురాలు కాదు యీ నాటి ఆడపిల్ల – ధైర్యం అనే వాడి కర్ర తీసుకుని దాన్ని ఎదుర్కొంటుంది.

5. ఏ పనైనా మనస్ఫూర్తిగా ఏకాగ్రతగా చేయటం ప్రారంభిస్తే అదే సామర్థ్యంగా మారుతుంది. దానికి ప్రతిభ అని ఎదుటవారు అంగీకరిస్తారేమో.

జలపాతం

1. మనిషికి కలిగే ఈ 'అవసరం' వుండే యిది మహా చెడ్డది. మనిషిని కీలు బొమ్మనుచేసి ఆడిస్తుంది. ఈ 'అవసరం' మూలంగా ఒక్కసారి అభిమానం వదులుకోవాలి. అసహ్యం అనే మాట గురించి మార్చిపోవాలి. పోనీ దానినే పట్టుకుని వేళ్ళాడతామా అది మనకి అన్నం పెట్టదు.

2. ఉపవాసం వుండి, దేవుడికి మొక్కినంత మాత్రాన ఆడిన అబద్ధం వల్ల వచ్చిన పాపం, పుణ్యంగా మారదు.

3. పరులని పీడించి, మోసంచేసి, వారు ఆత్మహత్యలకి గురిఅయి, సంపాయించే సంపాదనకంటే, నీచమైన డబ్బు ఈ లోకంలో యింకేదీ లేదు.

4. చాలా మంది తల్లిదండ్రులు వారికి నచ్చిన బ్రతుకులు పిల్లల్ని బ్రతికేలా చేయాలని తపిస్తారు.

5. డబ్బుతో సుఖపడటం తెలియనివాళ్ళు డబ్బుతో ఏం లేదు అంటూ శ్రీరంగనీతులు చెబుతారు.

6. ఈ రోజుల్లో డబ్బు మనిషికి వూపిరిలాంటిది. డబ్బు లేకపోతే మనిషి ఏదీ చేయలేడు, ఏదీ సాధించలేడు. జీవితంలో మనం

కోరుకున్న ఆనందాలవైపు, సుఖ సౌఖ్యాలవైపు మనల్ని సునాయాసంగా తీసుకువెళ్ళే 'కారు' లాటిది డబ్బు.

7. ఈ రోజుల్లో 'పెళ్ళి' అనేది ఒక అలవాటుగా మారిపోయింది దాని అర్థం - పరమార్థం గురించి ఎవరూ పట్టించుకోవటంలేదు. దానివల్ల 'పెళ్ళి' అనే ఒక మహాద్భుతమైన అనుభవం బూజుపట్టి పాడుపడిన యిల్లులా శిధిలావస్థకి చేరుకుంది.

8. ప్రతి మనిషి జీవితం యవ్వనంలో జలపాతంలా వుధృతంగా వుంటుంది. ఆ వేగం, ఆ తొందర, ఉరుకులు పరుగులతో ఆ ప్రచండశక్తి మనిషి శాశ్వతం అనుకోకూడదు. వయసులో వుండగానే మనిషి సత్ప్రవర్తన అనే ఆనకట్టతో దానిని బంధించాలి.

9. ఎదుటివారికి చెడు చేయటం అంటే అది తన జీవితానికి తానే అపకారం చేసుకోవటం అని మనిషి గుర్తించాలి.

10. మంచి, మానవత్వం లేని వ్యక్తిని చూసి మనం భయపడాలి. ఎందుకంటే ఆ వ్యక్తి కౄరమృగంకంటే భయంకరం.

11. మనకు జీవితంలో తటస్థపడేవారు గొప్పవారు, సంపాదనపరులు, కానక్కర్లేదు. హృదయమున్న మనిషయితే చాలు.

ఒంటరి నక్షత్రం

1. ఒక్కోసారి మనసు మహాభయంకరమైన ఒంటరితనం అనే క్రూరమృగం పాలిటపడిన పసిపాపలా గిలగిల లాడుతుంది.

2. చాలామంది మనుష్యులు స్వతహాగా తాము నమ్మినదానికంటే నలుగురూ ఏమనుకుంటారో అనే భయంతో ఆలోచన్ల మార్చుకుంటారు.

3. సుడిగుండంలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్న మనిషికి ఆసరా దొరికినట్టు, తప్పు చేయకుండా శిక్షని ఎదుర్కొన్న వ్యక్తికి ఒక్క మనిషి తనపట్ల నమ్మకం చూపించినా, అతని ఆత్మ శాంతిస్తుంది.

4. కొంతమంది వారి అనుమానానికి వారే నీళ్ళు పోసి పెంచి, దాన్ని శాఖోపశాఖలుచేసి అందరికీ అదే నిజం అని భ్రమ కలిగిస్తారు.

5. కొంతమందికి గాలివార్తలు సృష్టించటం అంటే సరదా.

6. నన్ను నమ్మిన వారిని నేను ఎప్పుడూ అన్యాయం చేయను.

7. కొంతమంది ఎదురుగా ఎంతో ఇష్టం వున్నట్టు మాట్లాడి వీపు తిప్పగానే విషపు జల్లులులాటి మాటలు కురిపిస్తారు.

8. మనం శాంతంగా సౌమ్యంగా, స్నేహంగా ప్రవర్తిస్తే ఎదుటివారు మనల్ని అర్థం చేసుకుంటారనే నమ్మకాలకి బూజుపట్టిన రోజులు వచ్చాయి.

9. నీకు మంచి స్నేహితులున్నారా ? అదృష్టవంతుడివి. అలాటివారు ఎవ్వరూ లేరా ? వెంటనే సంపాయించుకోవటానికి ప్రయత్నించు.

10. ఈ సృష్టిలోకెల్లా మనిషి జీవితం అద్భుతమైనది. ఆ అద్భుతమైన వరం నీకు లభించింది. దీన్ని పదిలంగా కాపాడుకుని, సంపూర్ణమైన మనిషిగా బ్రతుకు. కష్టలతో, కార్పణ్యాలతో ఈ జీవన కలశం నేల జార్చుకునే తెలివి హీనుడివి గాకు.

11. మనిషి ఒకరిని చూసి ఈర్ష్యపడటంకంటే దీనమైన హీనమైన స్థితి యింకేదీ లేదు.

12. మనిషి జీవన సౌధంలో మెట్లెక్కాలంటే కృషి, పట్టుదల, ఏకాగ్రత ఎంతో అవసరం.

13. అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఈ అన్నంకోసం మనం నీతిగా, నిజాయితీగా, కష్టపడాలి. మనం కష్టపడి సంపాయించిన దాంట్లో దీనులకి, ఆర్తులకి కాస్తయినా పంచగలగాలి.

14. మనిషి శరీరానికి పట్టిన మాలిన్యం వదిలించుకుంటున్నాడు, కానీ మాలిన్యంతో మసిబారిపోతున్న మనసు గురించి ఆలోచించటం లేదు.

15. జీవితంలో ఏదో ఒక టైమ్‌లో మంచి మాటలు వింటూనే వుండాలి. విన్న వాటిని ఆచరణలో పెట్టటానికి కూడా ప్రయత్నించాలి.

16. ప్రతి మనిషీ పుస్తకం చదవగలిగినట్టే, సంగీతం కూడా నేర్చుకోవాలి అందరూ సంగీత విద్వాంసులు కానవసరంలేదు. పుస్తకంలా సంగీతం కూడా నీకు నీ ప్రపంచం అనేది కల్పిస్తుంది.

17. ఏ కళ అయినా సరే, అది అనుభవం పొందినవారికంటే దాన్ని సృష్టించిన వారికే ఎక్కువ ఆనందం యిస్తుంది.

18. నా మనసంతా పరవశం, వీనులనిండా ఆనందగానం, శరీరం అంతా వెల్లువలా పొంగిపోతున్న ఉత్సాహం, ఎందుకో తెలుసా! నేను ప్రేమించిన వ్యక్తిని చూడబోతున్నాను.

19. కోరుకున్న మనిషికి దగ్గర కాలేకపోవటం ఎంత నరకమో అది ఎంత వ్యధని కలిగిస్తుందో అది అనుభవించిన వారికే అర్థం అవుతుంది.

20. ఈ ప్రపంచంలో బాధాపీడిత హృదయానికి శాంతి కలిగించే వ్యక్తికంటే మహోన్నత మనష్యుడు యింకెవ్వరూ వుండరు.

21. నీ అంతరంగంలో అంతులేని కరుణ వుంటే, సాటి మనిషిని అపారంగా ప్రేమించే మనసువుంటే, నువ్వు డాక్టర్ వృత్తిని చేపడితే, ఒక మహానదికి ఆనకట్టవేసి, ఆ నీరుతో పుడమితల్లిని సస్యశామలం చేసినట్టే, బాధాపీడిత హృదయాలకి నీ ఆశ్రయం లభిస్తుంది.

22. ఈ విశాల విశ్వంలో వున్న అందరూ నన్ను ప్రేమించాలనిపిస్తుంది. ఈ ప్రపంచంలో వున్న మనుష్యులందరూ, జాతి, మత, కుల రంగు వివక్షత మరిచి, ఆదరణ భావంతో ఒకరికి ఒకరు ముడిపడి వుంటే ఎంత బాగుంటుంది ఇది నా స్వప్నం. దీనికోసం వేయి జన్మలెత్తి అయినా ఎదురుచూడాలని వుంది.

23. ఈ మనుష్యులందరూ ఒకరిపట్ల ఒకరు పెంచుకునే ఈర్ష్యాద్వేషాలతో, జీవితం వృధాచేసుకుంటున్నారు.

24. అసూయతో కరకరలాడే మనిషి, ద్వేషంతో కుతకుత ఉడికే మానవుడు, తన జీవితానికి తనే నిప్పు పెట్టుకుంటున్నాడు.

25. ఒక్కోసారి నా కిష్టమైన సంగీతం వింటుంటే, నా మనసుకి వేరే లోకాలకి ద్వారం తెరిచినట్టుగా వుంది. నా మనసు విహంగంలా తెరుచుకున్న ఆ ద్వారం గుండా ఎగిరి వెళ్ళిపోతుంది. అక్కడ మరో ప్రపంచం. ఆ ప్రపంచం నిండా స్వేచ్ఛ, ఆనందం గుబాళిస్తూ వుంటాయి. అక్కడ స్వార్థం, ప్రలోభం, లాలస అనేమాటలే లేవు. నాకు సంపూర్ణ మనిషిగా బ్రతకటానికి యీ ప్రపంచం అమృతధారలతో నా మనసుని తడుపుతోంది.

26. గానం అతని ప్రాణం. గానం అతని బ్రతుకు, గానం అతని వూపిరి, గానం అతనికి యీ అనంత విశ్వం. గానమే అతని మృత్యువు. అతనే గానం - గానమే అతను. సంగీతంలో అతను ఐక్యంకావాలని తపించాడు. సంగీతమే వచ్చి అతనిలో ఐక్యం అయింది.

27. అతని జీవితంలో సంపదంతా బాహ్యమే. ఆంతర్యం అంతా అర్థరాత్రిలా ఒంటరిగా, నిశ్శబ్దంగా, చీకటిగా నిండివుంటుంది.

28. ఈ ప్రపంచంలో డబ్బు వుంటే చాలా మంచి పన్లు చేయవచ్చు. ఎంతో మంది కళ్ళనీళ్ళు తుడవ వచ్చు. కానీ యిప్పటివాళ్ళు ఆ డబ్బుతోనే ఎంతమంది కళ్ళల్లోనో నీళ్ళు తెప్పిస్తున్నారు.

29. ఎదుట మనిషి గురించి ఒక్క మంచిమాట మాట్లాడటానికి ఆయన నాలికే లేనట్టుంటాడు. అదే ఎదుటమనిషి మీద విషం కక్కటానికి వేయి నాలికలున్నట్టుంటాడు.

30. అతని చుట్టూ గ్లామర్, పేరు, డబ్బు రంగురంగుల వలయాలు సృష్టిస్తూ అతని జీవితం కళ్ళని మిరుమిట్లుగొలిపే కాంతిపుంజంగా అందరికీ కన్పిస్తోంది. అతని మనసు మాత్రం, మనసుని ఆహ్లాదపరిచే ప్రేమ అనే చిన్న దీపం కోసం పరితపిస్తోంది.

31. పేరు ప్రతిష్టలు రావటం అంటే, మనిషి పరుగుపందెంలో గుఱ్ఱంగా మారాడన్నమాటే.

32. ఏ కళలోనైనా ఏ వ్యక్తి అయినా, కీర్తిశిఖరాల్ని చేరుకుంటే, అతను యిక పబ్లిక్ ప్రాపర్టీ క్రిందే లెఖ్ఖ. జనం అభిమానం మీదనే ఆ వ్యక్తి జీవనసౌధం నిలబడి వుంటే అది యిక అద్దాలమేడ క్రిందే లెఖ్ఖ.

33. తల్లితండ్రులు పిల్లలు దూరంగా వెళ్తున్నారని బాధపడ్తారా ! లేక వారి జీవితాలమీద తమ పెత్తనాలకి ముగింపు వచ్చిందని బాధపడడ్తారా.

34. ఆకలి ! ఆకలి ! ఒకరికి ధనం ఆకలి ! ఒకరికి అధికారమే ఆకలి. ఒకరికి అనురాగపు ఆకలి. ప్రతిమనిషీ ఆకలి పీడితుడే.

35. ఏ మనిషి అయినా ఎంత డబ్బు సంపాయించాడు అని కాదు కొలమానం. అతనిది ఎంత సంపూర్ణమైన జీవితం అని.

36. ఈ పేరు, డబ్బు అనే యావలోపడి చుట్టూ ప్రపంచాన్ని చూడలేని యంత్రాలు అవుతాం. ఒక్కసారి పరిశీలనగా చూస్తే, ఉదయించిన

సూర్యుడు అస్తమిస్తాడు. విరిసిన పువ్వు ఒడిలిపోతుంది. ఎగిసిన కెరటం విరిగిపడ్తుంది. అంటే యీ సృష్టిలో ప్రతి పదార్థానికి ఒక 'సమయం' అనేది వున్నదన్నమాట. ఆ 'సమయమే' దాని సంపూర్ణ జీవితం. మనిషి కూడా వాటితోపాటే.

37. ఈ ప్రపంచం నుంచి సర్వం పొందాలని ఆరాటపడినంత మాత్రాన నీ జీవితంలో ఒక్క క్షణం కూడా భగవంతుడు పెంచడు.

38. ఈ జీవితం ఎన్నెన్నో యిస్తానని ఆశపెట్టి, భ్రమలు కల్పించి మనిషిని శృంఖలాలతో బంధించి తన వెంట బానిసలా తీసుకుపోతుంది.

39. జీవితాంతం 'ప్రేమ'కి బానిసగా వుండటం నీ కిష్టమా, లేక నువ్వు ఒక వ్యక్తిగా స్వేచ్ఛగా బ్రతకటం యిష్టమా ?

40. మనిషికి దుఃఖం తెలిసినప్పుడే ఆనందపు విలువ అర్థం అవుతుంది.

41. తలెత్తి చూస్తే వినీలాకాశంలో ఎన్నెన్నో నక్షత్రాలు, ఒక్కొక్క ఒంటరి నక్షత్రం చరిత్రా ఒక మహాద్భుతం. అలాగే కళా గగనంలో విభిన్న తారకలు. తరిచి చూస్తే ఒక్కొక్క కళాకారుని కథా ఒక్కొక్క మహాకావ్యం.

ఆశల శిఖరాలు

1. విషం స్వభావమే చేదు. ఒకసారి తిన్నా - వందసార్లు తిన్నా చేదుగానే వుంటుంది. అప్రియమైన విషయం ఎప్పుడు విన్నా బాధగానే వుంటుంది.
2. నా అనుభవాల వేడికి, నాలో సుఖస్వప్నాల గాఢసుషుప్తిలో వున్న మనిషి మేలుకున్నాడు.
3. మనిషికి తెలియక చేసిన తప్పుకంటే తెలిసి చేసిన తప్పు మరీ వేధిస్తుంది.
4. కాలేజీ రోజులే వేరు. అక్కడ వున్నప్పుడు ఉత్సాహం, ఆశలు, కలలు, యదార్థ జీవితంలోకి అడుగుపెడితే, ఏమిటో యీ ప్రపంచం అంతా గందరగోళంగా, అయోమయంగా వుంటుంది.
5. ఏ కాస్తయినా ఆధారం దొరికితే అల్లుకుపోగలను. కానీ ఆ ఆధారమే గగనకుసుమంగా వుంది.
6. ప్రతి మనిషికి జీవితంలో ఎక్కడో అక్కడ మొదలంటూ దొరకాలి.
7. ఆమె నా గుండెల్లోకి నేను మింగుతున్న చేదు నిజం.
8. నాకెప్పుడూ దేవాలయానికి వెళ్ళటం అలవాటులేదు. నాకు దైవం మీద విశ్వాసం లేక కాదు. ఆయనని చూడటానికి టికెట్ కొనటమూ వద్దు. నేనింత దూరంనుంచే చేతులు జోడిస్తాను.

9. మనవాళ్ళు ప్రతిదాన్నీ వ్యాపారంగా మార్చటంలో సిద్ధహస్తులు. దానికి మన భక్తికి మనం చెల్లించుకునే మూల్యమే ఉదాహరణ.
10. ఈ సంఘంలో ఈ కుళ్ళూ - మోసం చూస్తుంటే నీకును ఈ దేశానికి ఒక నియంతనై అందరినీ హంటర్‌తో బాదాలనిపిస్తోంది.
11. మనకి ఎటు చూసినా అక్రమం - దౌర్జన్యమే కన్పిస్తున్నాయి. ఈ ప్రపంచం మొత్తాన్ని నేనే కాదు ఎవరూ మార్చలేరు. నేను చేయదల్చిందల్లా నా వల్ల నా చుట్టూ వున్న వారికి అన్యాయం జరగకుండా జాగ్రత్తపడటం.
12. మీరు కమ్యూనిజం అంటారో, సోషలిజం అంటారో నాకు తెలియదు. సామాన్యమైన మనిషికి తిండీ, బట్టా ఇవ్వగలిగిన ఏ 'యిజం' అయినా నేను స్వాగతిస్తాను.
13. ఈ రాజకీయాలవల్ల మనిషికీ - వ్యక్తిత్వానికీ మధ్య సరిహద్దు చెరిగి పోయింది. కంచే చేనుమేసే దుస్థితి వచ్చింది. దారి చూపుతారని నమ్మి అధికారం చేతికిస్తే అందరినీ ముళ్ళ కంచెల్లోకి - అఘాతాల్లోకి పడదోస్తున్నారు. ఒకళ్ళు ఆలోచన లేకుండా చేసిన పనికి, పలికిన మాటకి, కొన్ని వందల మంది మనశ్శాంతి - రక్షణ లేకుండా బలి అయిపోతున్నారు.
14. ఈనాడు జరుగుతోంది రాజకీయాలు కాదు - రాక్షస కీయాలు.
15. నా కష్టానికి తగిన ప్రతిఫలం నాకు దక్కితే నే నెంతయినా శ్రమపడగలను.
16. ఈ జ్ఞాపకాలున్నాయే అవి మహాభారం, అవి గుర్తుకు వచ్చినప్పుడల్లా జీవనాడి కృంగిపోతూ వుంటుంది.

17. ఈ దేశంలో ఈ అవినీతి, స్వార్థం ఇలా మహా వృక్షంలా పెరిగి శాఖోపశాఖలుగా ఎందుకు విస్తరించిందో తెలుసా ? కళ్ళెర్ర చేయాల్సిన మేధావులు మౌనం వహిస్తున్నారు. మామూలు మనిషిని ఉత్తేజపరచవల్సిన వాళ్ళు శిలావిగ్రహాలుగా వుండిపోతున్నారు. రాముడు పోరాడకుండా బద్దకిస్తే రావణుడు నశించేవాడా ?

18. చదువుకున్నవాళ్ళు - లేనివాళ్ళు, తెలవిగలవాళ్ళు - తెలివి హీనులు, మంచివాళ్ళు - చెడ్డవాళ్ళు - అందరిలోనూ ఒకటే పిపాస, భూమినీ ఆకాశాన్ని మింగేయాలనే పిపాస, అందుకే త్రాసులో ముల్లు ఇటే ఒంగిపోతుంది.

19. నేను తక్కువ వాడిని, నేను అనాగరికుడిని, నేను పేదవాడిని యిలాటి భావాలు మనిషిలో వుంటే ఆత్మస్థైర్యాన్ని గొడ్డలిపెట్టుల్లా చీలుస్తాయి.

20. ఎంత సేపూ పాతవే నమ్ముకుని కూర్చుంటే, ఈ మానవాళికి ఇంత చరిత్ర వుండదు. ఈ లోకంలో ఇన్ని అద్భుతాలూ జరగవు.

21. ఈ మనుష్యులు అమాయకులో బుద్ధిహీనులో తెలియదు. వీళ్ళకి ఆపేక్షలా ఎక్కువే. ఆవేశాలూ ఎక్కువే. ఒక్క నిముషం మనమంతా ఒక్కటే అంటారు. ఇంకో నిముషం పోరా నువ్వెంత, నీ బ్రతుకెంత అంటారు.

22. స్నేహానికి - స్వేచ్ఛకి ఎప్పుడూ లంకె కుదరదు.

సంసార రథం

1. జీవితంలో పట్టుదల, ఆవేశం ఎంత తగ్గించుకుంటే మనిషికి అంత సుఖం. వాటిని అవివేకంతో పెంచుకున్నామా జీవితాన్ని పంజరంగా మారుస్తాయి.

2. సాటి మనిషిని క్షమించటంలో వున్న సుఖం ద్వేషించటంలో లేదు.

3. ఎక్కువ మంది పిల్లలు వుండకుండా ఆర్థికమైన బాధలకి బలికాకుండా, నేర్పుగా కాలం మెట్లు ఎక్కుతూ జీవితం అంటే విసుగు గాని, నిస్పృహగానీ రావు.

4. ఏ స్త్రీకి అయినా భర్త వ్యక్తిత్వంతో కూడిన సమర్థుడు అయితే అష్టయిశ్వర్యాలు ఆమె మనోమందిరం ముంగిట వున్నట్లే.

5. ఈ రోజుల్లో పిల్లలు చదువులు అంటే చాలు, సమాధుల్లోకి వెళ్ళిన స్వాముల్లా అవుతున్నారు.

6. యుక్తవయసు వచ్చినప్పుడు, మనసులో మాట ధైర్యంగా, నిర్మొహమాటంగా చెప్పుకోగలిగిన నేస్తం వుండాలి.

7. ఈ పెద్దవాళ్ళ ధోరణేమిటో బొత్తిగా అంతుపట్టదు. పిల్లలకి అన్ని విషయాల్లో స్వతంత్రం యిచ్చినట్టే యిస్తారు. మళ్ళీ ఎక్కడో ఒక చోట పిల్లల జీవితాలమీద పెత్తనం అంతా తమదేనని గుర్తుచేస్తారు.

8. బైట వృత్తిపరంగా నలుగురిలో తిరగే వ్యక్తికి గౌరవ మర్యాదలుండాలంటే ఆ వ్యక్తి నడవడికతోపాటు అతని కుటుంబ చరిత్ర కూడా చాలా ముఖ్యం.

9. ఈ సంఘానికేం తెలుస్తుంది తన బాధ ! తను పడిన ఒంటరితనం, మనసు కలవని భర్తతో కాపురంలో వ్యధ. ఉత్తమ చరిత్రరాలిగా వుండాలి అంటారు. కాళ్ళ క్రింద నిప్పులుపోసి, శాంతితో, చిరునవ్వుతో బ్రతకాలి అంటారు. ఆ అన్నవాళ్ళంతా ఆడపిల్లగా పుట్టి నేను పడే నరకం పడాలి.

పార్థు

1. ఈ ప్రపంచంలో వందలమంది చిన్న పిల్లలకి తీరని అన్యాయం జరుగుతోంది. వారి పసి శరీరాలని, మనసుల్ని రక్షించే న్యాయరక్షకులు ఎక్కడ ? నోటితో తమకి జరిగిన అన్యాయాలు పైకి చెప్పలేని ఆ నిర్భాగ్యులని రక్షించాల్సిన బాధ్యత మనందరిదీ కాదా !

2. స్వలాభాపేక్షతో తుప్పుపట్టిన కటకటాల్లాటి హృదయాలున్న తల్లి తండ్రులు యీ ప్రపంచంలో వున్నంత వరకూ పిల్లలకి యీ బాధలు తప్పవు.

3. ఈ ప్రపంచంలో స్త్రీ పురుష సంబంధం ఏమీ నేరం కాదు. ప్రకృతి సహజమైన ఆ పరస్పర ఆకర్షణ ఎంతో సహజం. కానీ మీ లాలసలో వుదయించిన ఆ పసి పిల్లలకి మాత్రం అన్యాయం చేయకండి.

4. ఈ ప్రపంచంలో ప్రతి అనాధ శిశువు ఆక్రందన, తన జన్మకి కారణం అయిన దొంగ మనుష్యుల గురించి హెచ్చరిస్తున్న అలారమే.

5. పెద్దల కోరికలు పిల్లల జీవితాలని వాడి ముళ్ళలా చీల్చి చిన్నాభిన్నం చేయకూడదు.

6. ఈ మూసిన యిళ్ళకి వున్న తలుపులచాటున ఎంతమంది పిల్లలు ఏ అకృత్యాలకి నిస్సహాయంగా బలిఅవుతున్నారో.

7. అనాథ శిశువు ఆక్రందనలో కంటి నుంచి జారే నీటి చుక్కకి శక్తి వుంటే, మహాప్రళయంగా మారి యీ లోకాన్ని ముంచెత్తగలదు.

8. అనాథ పిల్లలు భగవంతుడి చేతి దారం నుంచి తెగిపడిన గాలి పటాలు.

9. జీవితం ఊచలున్న పంజరం. అందులో యిష్టపడి వున్న వాళ్ళకి అది బంధిఖానా అన్పించదు. అది యిష్టంలేని వాళ్ళకి జైలు.

10. మనిషికి కోరికలుండటం సహజం. అవి తీరితే సీతాకోకచిలుకలు, తీరకపోతే మనసున పాకే గొంగళి పురుగులు.

11. కోరికలు తీర్చుకోవటానికి ఒక పరిష్కారం వుంది. అది వాటిని తీర్చుకోవటమే.

ప్రేమ సింహాసనం

1. ఆత్మహత్య పిరికివాళ్ళ లక్షణం. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఎదుర్కోవటం ధైర్యవంతుల లక్షణం.

2. నేను నీ అర్ధాంగిని. అర్ధాంగి అంటే శరీరంలో అర్ధభాగం కదా! కానీ నీ మనసులో సగభాగమైనా నాకు అర్ధంగావటం లేదేమరి.

3. అతనిలో తల్లిని ప్రేమించే కొడుకు వున్నాడు. స్నేహితులు యిష్టపడే మిత్రుడున్నాడు. బంధువులు కోరుకునే ఆత్మీయుడున్నాడు. ఇంతమందిలో కలిసిన అతను తమ ఒక్కరి స్వంతం ఎలా అవుతాడు.

4. స్త్రీ పురుషుల మధ్యగల ప్రేమ అనే నిండు జాబిల్లికి అప్పుడప్పుడు గ్రహణం పడుతుంది.

5. మామూలు జైలులో అధికారి ఒక్కడే. ఈ ప్రపంచం అనే మహాజైలులో అందరూ అధికారులే.

6. కొన్ని పరిస్థితుల్లో మనిషికి మౌనమే శరణ్యం. రాయిలాంటి కఠినమైన మౌనం, మంచుముద్దలాటి అతి శీతలమైన మౌనం, నేనీ మౌనం చూపించటానికి చాలా శక్తి కావాలి.

7. పసిపిల్లలందరికి ముఖాలూ ఒకేరకంగా అమాయకంగా వుంటాయి. వాళ్ళకి ఐశ్వర్యం - బీదతనం అనే రంగుల అద్దకాలు యింకా అంటని వయసు అది.

8. చాలామంది మామూలు మనుష్యులకి జీవించటమే తెలుసు. జీవితాన్ని గురించి ఆలోచనలు చేయటం - వూహించటం రాదు. ప్రొద్దు తిరుగుడు పువ్వుల్లా బ్రతికి మృత్యువుకి అభిముఖంగా తిరుగుతారు.

9. చీకటి జీవితంలో మెరిసే మెరుపే ప్రేమ.

10. ఈ ప్రపంచంలో డబ్బుకి అతిశయానికి - అహంకారానికి, చదువుకి దరిద్రానికి, అతీతమైన అవసరమైనది ఒకటి వుంది. అది మనిషికి సాటి మనిషితోడు. ఈ అవసరం ముందు విద్య, అధికారం, డబ్బు, హోదా, పట్టుదల అన్నీ తలవంచాల్సిందే.

11. జీవితంలో దారితప్పిన ఆడపిల్లలకి సరైన ఆడతోడు దొరకడం చాలా అదృష్టం.

సీతాపతి

1. మధ్యతరగతి కుటుంబాల్లో ఒక సుఖం వుంది. ఇంట్లో మనుష్యులంతా ఒకరిమీద ఒకరు ఆధారపడ్తారు. ఒకరిమీద ఒకరికి అభిమానం వుంటుంది. అందువల్ల లేమివల్ల కలిగే బాధ తగ్గుతుంది.

2. ఈ ప్రపంచంలో మగవాళ్ళందరిలోకి నికృష్టుడైన మగవాడు, తను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకోలేని వాడు. పెళ్ళి చేసుకున్న అమ్మాయిని ప్రేమించలేనివాడు.

3. ఈ లోకంలో కొంతమంది ఉన్నారు వాళ్ళకి డబ్బు తృణప్రాయం, అవసరాలకి మించి అవసరంలేదు.

4. ప్రేమించిన మనిషి తోడుతో వచ్చే సుఖం నిజమైన సరోవరం లాటిది. మనిషికి డబ్బుతో తెచ్చుకునే తోడు సుఖం ఎండమావి లాటిది. చాలా మందికి ఈ ఎండమావి కోసం పరుగెత్తటంతోనే జీవితం అయిపోతూ వుంటుంది.

5. అధికార వ్యామోహం, సంపదతో వచ్చే సుఖాలు ఒక్కసారి ఇనపగొలుసుల్లా మనిషిని బంధిస్తాయి.

6. జీవితాన్ని నిరాడంబరంగా, సుఖమయం చేసుకోగలిగిన వ్యక్తి చాలా ధీశాలి.

7. ఉన్నంతలో ఆనందంగా వుండటం అనేది చాలా సామాన్యమైన విషయమే. కానీ దానికి చాలా నేర్పుకావాలి.

8. ఈ ప్రపంచంలో డబ్బు లేకపోతే చచ్చిపోతారుగానీ, మగవాడి ప్రేమ లేకపోతే చచ్చిపోరని, ప్రతి స్త్రీ తెలుసుకోవాలి.

9. పెళ్ళివల్ల శరీరాలు దగ్గర కావచ్చునేమోగానీ, మనసులు దగ్గర కావు.

10. ఒక అతను డబ్బు తృణప్రాయంగా చూస్తాడు. భేషజాలు లేవు. మనిషెంత మామూలువాడో, మనసు అంత ప్రేమమయం. రెండో అతను డబ్బు పిపాసి, ప్రతి విషయానికీ కొలతబద్దలు వేస్తాడు. మాటలో చతురుడు, అందగాడిననే గర్వం. ఈ యిద్దరిలో మొదటి వ్యక్తిని చేసుకున్న ఆడపిల్ల జీవితం సుఖశాంతులతో వుంటుంది. రెండో అతనితో వివాహం రణరంగంలో కాలుపెట్టటమే.

11. జీవితం పట్ల అనురక్తిని, విరక్తినీ కలిగించేవి ఈ మనసు అనే 'మహామాయ' చేసే విన్యాసాలు.

12. ఎవరి యిష్టాన్ని అయినా పొందాలంటే, చిన్న సూత్రం వుంది. ఆ వ్యక్తికి యిష్టమైన పన్లు నువ్వు చేయాలి. అప్పుడు వాళ్ళ దృష్టీ నీవైపు మళ్ళుతుంది.

13. ఈ ప్రపంచంలో ఏమీలేని ఆడపిల్లలు ఎంతో మంది వున్నారు. కొంతమందికి ప్రేమగాచూసే తల్లి తండ్రి, కోరుకున్న భర్త, పిల్లలు అన్నీ వుంటాయి. భగవంతుడు ఎందుకలా పక్షపాతం చూపించాలి.

ఒకరికి అందం, ఒకరికి డబ్బు, ఒకరికి భర్త ప్రేమ యిలా ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటిచ్చి సంతృప్తి పరచవచ్చు కదా !

14. చాలామంది ఆడవాళ్ళు యిల్లు, పిల్లల కోసం పెళ్ళి చేసుకుంటారు. ఆడదానికి యివే ఎక్కువ సుస్థిరత అని నమ్ముతారు.

15. మనిషికీ మనిషికీ నమ్మకానికి మించిన అనుబంధం యింకేదీ వుండదు. వేదమంత్రాలు వల్లిస్తూ బ్రాహ్మణుడు వేసే ముడికంటే మనసులు వేసుకునే ముడే బలిష్టమైనది.

16. ప్రేమముందు పెళ్ళి అనేది సూర్యుని ముందు దివిటీ లాంటిది.

17. ఇప్పటి ఆడపిల్లల వ్యక్తిత్వం పాత - కొత్తల కలనేతగా వుంటుంది. తనని ప్రేమించని భర్తని వదిలేసి ఒంటరిగా వుండాలి అని ఎంతగానో ఆలోచన్లు చేస్తుంటారు. కానీ వారు పెరిగిన వాతావరణం, సాంప్రదాయం వారిని వెనక్కు లాగుతుంటాయి.

18. ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ యింకో వ్యక్తిలా వుండరు. బుద్ధిలోనో, రూపంలోనో, నమ్మకాల్లోనో ఏవో తేడాలుంటాయి.

19. యింకొకరి భర్త గుర్తించి ఆశపడే ఆడదానికి బాధే తప్ప ఇంకేమీ లేదు.

20. మనం వెళ్ళదల్చుకున్న మార్గం ఏమిటో మనం ఖచ్చితంగా నిర్ణయం చేసుకోవాలి. రెండు మార్గాల వెంట ఏకకాలంలో ఏ మనిషీ వెళలేదు.

21. మన దేశంలో రాముడు ఎప్పటివాడు అనే ఆలోచన ఎవ్వరికీ రాదు. ఎందుకంటే, అతను మన మధ్య సజీవంగా, మంచి

తనయుడిగా, మంచి సోదరుడిగా, మంచి భర్తగా, మంచి రాజుగా, మంచి స్వామిగా మనిషి ఎలా వుండాలో మనకి దోవ చూపించే దిక్సూచి.

22. అసలు నా బుర్రలోనే పెద్ద లోపం వుంది. నా కోసం నేను గాక, ఎంతసేపూ ఎదుటివారి దృష్టిలో నేను ఎలా వుంటానా అని తపన పడ్డాను.

23. ఈ ధనం వుందే దీన్ని సంపాయించటం కంటే, జాగ్రత్తగా కాపాడుకోవటమే చాలా కష్టం.

24. భగవంతుడు ఒక్కోసారి మన కలల్ని చూసి పై నుంచి నవ్వుకుంటూ వుంటాడేమో, ఓయి పిచ్చిమనిషీ, నువ్వు కలలు కంటున్నావు. అవి కేవలం కల్లలుగానే మిగిలిపోతాయి అని.

25. ఈ ప్రపంచంలో కొంత మంది మనుష్యుల జాతకాలు అంతే. అనుకున్న వేవీ జరగవు. ఆలోచనలకి, జరిగే జీవితాలకి పొంతనే వుండదు. జీవితం దోవ జీవితందే, మనసు దోవ మనసుదే.

26. ఇప్పటి ఆడపిల్లల జీవితాలు సగం మగావాడిలా, సంగం ఆడపిల్లలా వుంటున్నాయి.

27. శారీరకంగా స్వతంత్రం వున్నా లేకపోయినా, మానసికంగా, ప్రతి మనిషీ స్వతంత్రుడే.

28. జీవితం మనిషిని ఒక్కోసారి చాలా నిర్దయగా, నిరంకుశంగా పీడించి బాధపెడ్తుంది.

29. ఎవరైనా మనకి ఆనందం, సుఖం పంచి యిచ్చినప్పుడే విలువ. బాధపెట్టి వేధిస్తుంటే ఏం విలువ ?

30. కలలు ఎప్పుడూ మనిషి విలువైన కాలాన్ని హారతి కర్పూరంలా హరించి వేస్తుంటాయి.

31. జీవితం విలువ గుర్తించి వాస్తవంలో బ్రతికే వాళ్ళే తెలివిగలవాళ్ళు.

32. కొంతమంది మగవాళ్ళు స్త్రీలతో "నిన్ను ప్రేమిస్తున్నాను" అంటూ ఆర్భాటంచేసి ఆడంబర వాక్యాలు చెప్పరు. వారి మనసు స్త్రీ అర్థం చేసకోవాలి.

33. ప్రతి మనిషికీ జీవితంలో ఏదో ఒక టైమ్‌లో గొంగళి పురుగు దశ తప్పదేమో

34. ఎందుకోగానీ, మన సంఘం పేదరికాన్ని సహించదు. చిరాకు పడుతుంది. నువ్వు ఏదయినా చేయి కాని, పేదవాడిగా మాత్రం మిగిలిపోకు అనే సందేశము అది.

35. ప్రేమించిన తోడు జతగా వుంటే, కాలం పందెం గుఱ్ఱంలా పరుగుదీస్తుంది. అది కరువైతే, కుంటి గుఱ్ఱంతో కలిసి వెళ్ళినట్టు వుంటుంది.

36. ఇప్పటి వాళ్ళకి బాగా తెలిసిన విషయం ప్రేమ తిండిపెట్టదని.

37. కాలం మారింది. స్త్రీలూ మారుతున్నారు. కానీ మగవాడి మనసే మారటంలేదు. తరతరాల నుంచి ఇనప చట్రంలో బిగించి సీలలు కొట్టిన అతని మనసులో అహం పీడటం లేదు.

38. జీవితంలో మనిషికి మంచి స్నేహానికి మించిన అపురూపమైనదేదీ లేదు.

39. స్త్రీ పురుషులిద్దరూ ప్రేమ అనే సూత్రంతో బంధింపబడాలి. అది ఒకరిపట్ల ఒకరికి ఏర్పడాల్సిన అనిర్వచనీయమైన భావం.

40. ఒక మనిషిని జీవితంలో, మనం బలవంతంగా అట్టిపెట్టుకోవటం వల్ల ఘర్షణ, అశాంతి తప్ప యింకేదీ మిగలదు.

41. వ్యక్తి చూపే ప్రేమ ముందు, యీ సంఘం కళ్ళెర్రచేసే అధికారం చిత్తుగా ఓడిపోతుంది.

42. యవ్వనం తొలిదశలో మనిషికి ప్రేమ ఒక్కటే ప్రాధాన్యం అన్పిస్తుంది. తర్వాత తర్వాత అనుభవం, విషాదం, నిరాశ వీటన్నింటికంటే జీవితం ముఖ్యం అని అర్థం అవుతుంది,.

43. జీవితం అంటే స్వసుఖాపేక్ష కాదు, కర్తవ్య పాలన.

44. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మనం వాళ్ళకి సుఖం, శాంతి, ఆనందం యివ్వగలగాలి. అపవాదులు, అశాంతి, ఆవేదన యిస్తే మనం దురదృష్టవంతులం.

ఈ జీవితం నాది

1. ఏ మనిషికయినా కోరుకున్న ఆనందం లభిస్తే అది నిషాలా మత్తు కలిగిస్తుంది.

2. స్త్రీ ప్రప్రథమంగా మాతృమూర్తి, అందుకే స్త్రీలో అంత ప్రేమ అంత సహనం.

3. ఈ ప్రపంచంలో ఎవరైతే ఒంటరితనంలో భయపడకుండా, బాధపడకుండా వుంటారో, ఆ ఒంటరితనంలో ఆనందం, శాంతి అనుభవించటం నేర్చుకుంటారో వాళ్ళు చాలా అదృష్టవంతులు అని నా నమ్మకం.

4. తల్లి బిడ్డచేత నడక నేర్పేటప్పుడు చేయిపట్టుకుని ఎలా అడుగులు వేయించి క్రమంగా వదిలేస్తుందో పెద్దఅయిన తర్వాత కూడా అంతే. నిర్ణయాలు చేసే విషయంలో మొదట సలహా యివ్వాలి. తర్వాత తర్వాత నిర్ణయాలు వారే చేసే అవకాశం యివ్వాలి.

5. మనిషి డబ్బు సంపాయించగలడు. పేరు ప్రఖ్యాతులు సంపాయించగలడు. కానీ నా అనే వ్యక్తుల్ని మాత్రం సంపాయించుకోలేడు.

6. ఈ మనసు వుందే, నమ్మకానికి ఊడిగం చేసే వెట్టిబానిస.
7. తల్లితండ్రులు పిల్లలు తప్పు చేయకుండా వుండేట్టు ప్రపంచం గురించిన కష్టసుఖాలు అవగాహన అయేట్టు నేర్పాలి. ఒకవేళ పిల్లలు వయసు తొందరపాటుతోనో, అమాయకత్వంతోనో తప్పు చేస్తే తెలిసి వారు వదిలివెళ్ళారని ఆవేశపడకుండా, వాళ్ళు తిరిగి వచ్చే ద్వారాలు మనో మందిరం తెరిచి వుంచాలి, ఇది తల్లితండ్రుల బాధ్యత.
8. నేను నా వైవాహిక జీవితం గురించిన ఆలోచన్లు తెల్లకాగితంలా వుంచేస్తాను. అక్కడ ఏది ప్రాప్తం వుంటే అది స్వీకరిస్తాను.
9. ఈ ప్రపంచంలో రెండురకాల మనస్తత్వాలు గల మనుష్యులున్నారు. వారిలో ఒకరికి బాంక్‌లో పుష్కలంగా డబ్బు వుంటే చాలు, ఈ ప్రపంచంలో యింకెవ్వరూ అవసరంలేదు. వారు డబ్బుని నమ్ముతారు. డబ్బుని ప్రేమిస్తారు. డబ్బుని ఆరాధిస్తారు. డబ్బే వారికి తోడు – నీడ సర్వస్వం. యింకొకరకం వున్నారు. వారు అలా కాదు. వాళ్ళకి సాటి మనిషి తోడు కావాలి. ఆ తోడు లేకపోతే వెన్నెముక లేనట్టు కృంగిపోతారు. ఈ ప్రపంచంలో ఏ ఐశ్వర్యాలు వారిని ఆనందపరచలేవు, మనోబలం యివ్వలేవు.
10. మనం బ్రతికిన నాలుగు రోజులూ నలుగురితో కలిసి ఒకే చెట్టుకున్న వేలాది ఆకుల్లో మనమూ ఒకరుగా బ్రతకాలి. ఆకు చెట్టు నుంచి విడిపోయి బ్రతకటం ఎంత కష్టమో, ఈ సంఘం నుంచి దూరం అయి బ్రతకటం కూడా అంతే కష్టం.
11. ఒక అదర్శం కోసం, ఒక కర్తవ్య నిష్ట కోసం, మనిషి తన నుంచి విడిపోతే సంఘం అతని వ్యక్తిత్వాన్ని మన్నిస్తుంది. అతన్ని శిక్షించకుండా అభినంది స్తుంది. కానీ మనిషి స్వసుఖం కోసం, ఒక వ్యామోహం కోసం తన నుంచి దూరం అయితే క్షమించదు.

12. జీవితంలో ప్రతి అడుగూ తూచి వేయగలిగిన మనిషే జీవన సౌధంలో పై మెట్టుకి వెళ్ళగలుగుతాడు.
13. వారిద్దరి మధ్యా ఎక్కువగా మాటలుండవు. వారిదొక మౌనభాష. అతని చూపులతోనే ఆమెకి అతని మనోగతం అర్థం అవుతుంది. అతనికి ఆమె గురించి అంతకంటే ఎక్కువ అవగాహన వుంది. వారి మధ్య నిశ్శబ్దం వెన్నెల్లో నిశ్చల సరోవరం.
14. క్షమ, ప్రేమ ఇవి స్త్రీ వ్యక్తిత్వానికి దైవత్వం అపాదించినాయి. ఈ గుణాలే ఆమె చరిత్రకి వన్నెతెచ్చాయి.
15. నా అందం ఒలికి మట్టిపాలు అయిన తర్వాత గాని నా వయసు విలువ నా కర్థంగాలేదు.
16. అందరూ ఎల్లవేళలా మంచి మార్గాన వెళ్ళలేరు. వెళ్ళలేకపోవటానికి ఎన్నో కారణాలుంటాయి. కొంతమందికి తెలివితేటలు లేకపోవచ్చు. మరి కొంతమందికి ఆర్థిక పరిస్థితులు కారణం కానచ్చు. మరికొంతమందికి అదృష్టం ఆటపట్టించవచ్చు. ఏదయినా కానీ, దారి తప్పిన ప్రతి మనిషికీ ఎప్పుడూ తన జీవిత చుక్కానిని మంచిమార్గం వైపు తిప్పుకునే హక్కు వుంటుంది.
17. మనిషిలో జీవితం ఆశ చావకూడదు. ఎందుకంటే మనిషి ఏ ప్రయత్నం చేయాలన్నా ఆశే బలం.
18. ఈ ప్రపంచంలో కోటి మందిలో ఏ ఒక్కరికో తప్ప ఎవ్వరికీ జీవితంలో అనుకున్నది అనుకున్నట్టుగా అవదు ఏదో ఒక

అవకతవక వస్తూనే వుంటుంది. దానివెంట అశాంతి, దానితో విచక్షణా జ్ఞానం నశించటం, దానివెంటే జీవితం పట్ల అప నమ్మకం, దాని వెంటే మనిషి పతన లోయలోకి రాలిపోవటం.

19. స్త్రీ తన జీవితం స్వయం శక్తితో, తెలివితేటలతో, వ్యక్తిత్వం వివేకంతో ఎప్పుడయితే నిర్మించగలుగుతుందో, అదే నిజమైన స్వతంత్రం.

20. స్త్రీ తన జీవితానికి మూలాధారం పురుషుడే అని భావించిన అన్ని రోజులూ ఆమె జీవితం నౌకరి గిరీయే.

21. ప్రతి మనిషి ఈ జీవితం నాది అనుకోవాలి. ఈ జీవితం ఎవరో నాకు దయతలిచి పెట్టిన భిక్షకాదు. ఇది నా స్వయం కృషితో నిర్మించుకుంటాను. ఇందులో ఎదురయ్యే కష్ట నిష్టూరాలకి నేనే బాధ్యురాలిని. అజ్ఞానంతో, అమాయకత్వంతో బోర్ల పడతాను. ఫర్వాలేదు. నాకు నేనే లేచి ఒంటికి, బట్టలకి అంటిన మట్టి దులుపుకుంటాను. ఈసారి పడకుండా వుండటానికి జాగ్రత్త పడతాను. నేను ఒకరికి ఆనందం యిస్తాను. అది అంది పుచ్చుకునే హక్కు కూడా నాకుంది.

22. భర్త, పెళ్ళి, పిల్లలు, యిల్లు, వీటన్నింటితో కలిపి పరిపూర్ణం అయ్యే ఈ జీవిత పూర్ణకుంభం జాగ్రత్తగా కాపాడుకోవటానికి నేను పురుషుడికంటే ఎక్కువగా శ్రమిస్తాను. ఎందుకంటే యిందులో నాకు దొరికే ఆనందం, శాంతి అపారం. నా శ్రమని నా ఉనికిని నా భర్త గుర్తించటమే కాదు, నన్ను అతను గౌరవించేలా చూడటం నా ప్రథమ కర్తవ్యం.

23. నీకు నువ్వు ముందు మనోబలం ఏర్పరుచుకోవాలి, నాకేదో అయిందని ముఖం చాటేసుకుని తిరిగే మనస్తత్వం కట్టిపెట్టు. నీకు నువ్వే ధైర్యం తెచ్చుకుని మామూలు మనిషిలా ప్రవర్తిస్తే మిగతావాళ్ళు కూడా నీ గతం మర్చిపోతారు.

24. తప్పుచేస్తే నష్టం యింకెవరికీ కాదు, స్వయంగా చేసినవారికే. అది దుశ్శాపంలా మనిషిని వెంటాడి పీక్కుతిని మనిషి అనందాన్ని మనశ్శాంతిని హరిస్తుంది.

25. ప్రతి వ్యక్తి సుఖ - శాంతులతో గడపటానికి పెద్దవాళ్ళు బాగా ఆలోచించే, కష్ట నిష్టూరాలు తూకంవేసి, 'సంఘు కట్టుబాట్లు' అనే రైలు పట్టాలు వేసారు. దానివెంట వెళితే గమ్యం సునాయాసం. కొత్త గమ్యం వెతుక్కుందాం అనేవాళ్ళు చాలా శ్రమపడాలి. మనోధైర్యం కావాలి.

స్నేహమయి

1. ప్రశాంతంగా వున్న సూర్యోదయ సమయంలో, మనసు దైవ ప్రార్థనని మననం చేసుకోవటంలో ఎంతో ఏకాగ్రత వస్తుంది. ఆ దినంలో రాబోయే ఆటుపోట్ల సంఘర్షణకి తట్టుకోగలిగిన చిత్త నైర్మల్యం కలుగుతుంది.

2. జీవితపు ఘర్షణతో వుక్కిరి బిక్కిరి అవుతూ ఏం చెయ్యాలో, ఆ సమస్యలు ఎలా తీర్చాలో తెలియక సతమతమౌతూ, అంధకారంలో వెతుకులాడు తుండగా పిల్లలు పుడితే ఆ జీవితం వేయిరెట్లు నరకం అవుతుంది.

3. ఈ రోజుల్లో కుటుంబాల్లో పైకిచూస్తే ఎంతో సంస్కారం లోలోపల చూస్తే కుటిల ఆలోచనలు.

4. మనిషి జీవితంలో ఎంతో సరదా అయినది విద్యార్థి జీవితం. మనిషి తర్వాత యింకెన్ని అయినా సంపాయించవచ్చు. ఈ సువర్ణ ఘట్టం మాత్రం పొందలేడు.

5. వయసులో వున్న పిల్లలకి స్వేచ్ఛ ఒక మహాగ్ని లాటిది. దాని దగ్గరయితే దహించుకోవటమే తప్ప, తమని తాము రక్షించుకోవటం వారికి తెలియదు.

6. తల్లితండ్రులు పిల్లల్ని ఎంత గారాబంగా చూడాలో అంత క్రమశిక్షణ కూడా నేర్పాలి.

7. జీవితంలో నా అశక్తత ఏమిటో నా కర్థం అయింది. నా తెలివి తక్కువతనం, నా అసమర్థతే, నా అశక్తత.

8. ఉగాది పచ్చడిలో చేదుకూడా ఒక రుచే అనుకున్న మనిషి సునాయాసంగా తినగలుగుతాడు. అలాగే జీవితంలో కష్టాలు కూడా ఒక భాగామే అనుకునే ఆత్మస్థయిర్యం వుంటే ఆ వ్యక్తి మహోన్నతుడు అవుతాడు.

9. జీవితం అంటేనే కోర్కెల దాహం. ఆ దాహం ఎప్పుడూ ఏదో రకంగా తీరుతూ వుండాలి.

10. సగానికి తెగినట్టుగా కూలిన వృక్షం కూడా చిగుళ్ళు తొడుగుతుంది. ఓర్పు పడితే పగుళ్ళు చూపిన జీవన ఫలకం మధ్య నుంచి కూడా ఆశలు అనే పచ్చిక బైలుదేరుతుంది.

11. మనిషి భవిష్యత్తుకి పునాది వేసుకునే సమయంలో స్నేహితులు బంధువులూ ఎవరూ గుర్తురాని, తీరిక చిక్కని ఏకాగ్రతలో మునిగిపోవటం సహజం. కానీ స్థిరపడిన తర్వాత అందరినీ చూడాలనిపిస్తుంది.

12. నిన్ను బంధువులు, అయినవాళ్ళు వెలివేసారా ! ఏం ఫర్వాలేదు. ఈ ప్రపంచంలో వారికంటే మించిన తోడు పుస్తకాలున్నాయి. పెరటితోట పెంపకాలున్నాయి.

13. చేసుకున్నది ఎలాటి పెళ్ళి అయినా, భార్యాభర్తలు ఖచ్చితంగా స్నేహితులుగా వుండాలి. వారు ఇద్దరూ స్నేహితులు అయితే

దాంపత్యం నూటికి నూరుపాళ్ళూ విజయవంతం అవుతుంది. ఎందుకో తెలుసా ? స్నేహంలో అభిమానం మొలకెత్తుతుంది. అభిమానం అనేది వుంటే ఆదరణ వస్తుంది. ఆదరణ అనురాగానికి పునాది అవుతుంది. ఇలా కట్టుకుంటూ వచ్చిన వారి అనురాగ మందిరం ఆ భార్యాభర్తలకు స్వర్గతుల్యం అవుతుంది. బహుశా మన సాంప్రదాయపు పెళ్ళి పరమార్థం ఇదే అయి వుంటుంది.

14. ఆమె ప్రేమలో స్వార్థం లేదు. సాటి మనుష్యులేకాదు మొక్కలు, కుక్కలు, చెట్లు, పిట్టలు, పువ్వులు అన్నీ ఆమెకి ప్రియమైనవే, అందుకే ఆమె అమృతమయి.

పెళ్ళి పిల్లలు - జీవితం

1. జీవితంలో ఎవరైతే అందం, ఆకర్షణ ముఖ్యం అని వాటికి విలువ యిస్తారో, వాళ్ళకి ఎప్పుడో ఒకసారి తమ గమ్యం ఎండమావుల వెంట పరుగు అని అర్థం అయి తీరుతుంది. ఈ పరుగులో కొంత మంది డబ్బు, కొంతమంది వయస్సు, మరికొంతమంది యిల్లు పిల్లల్ని పోగొట్టుకుంటారు.

2. మనిషికి చాలా అసంతృప్తులనుంచి పెళ్ళి - పిల్లలు సేదదీర్చటం జరుగుతుంది.

3. అబద్ధం చెప్పటానికి ప్రతిమనిషికీ స్వతంత్రం వుంది. కానీ అబద్ధాలు చెప్పే వాళ్ళని ఒక్క క్షణం కూడా భరించని హక్కు ఎదుటివారికి కూడా వుంది.

4. నా చిన్నప్పుడు ఒక అసాధారణ వ్యక్తిగా మారాలని కలలు కన్నాను. సాధించాను. కానీ నాకిప్పుడు మామూలు మనిషిగా బ్రతకాలని వుంది. అది నాకు యిక సాధ్యం కావటంలేదు.

5. నేను ఒంటరిగా వున్నానని నా పిల్లలు బాధపడ్తున్నారు. కానీ నా ఒంటరితనం నన్ను బాధించటం లేదు. ఈ ప్రపంచంలో ప్రతి మనిషి ఒంటరివాడేనన్న సత్యం నేను అర్థంచేసుకున్నాను.

6. ఎవరికైనా పెళ్ళి అవగానే వారి సంసారం వారికి వుండాలి. ఎవరికి వారు స్వంత తల్లితండ్రులయినా సరే అతిధులమే అని గుర్తుంచుకోవాలి.

7. ఓ వ్యక్తి ఎదుటివారితో సంబంధ బాంధవ్యాలు బాగుండాలీ అంటే నియమాలు పాటించాలి.

8. ఈ ప్రపంచంలో అందరూ అద్భుతాలు చేయలేరు. ఆ అద్భుతాలు చేయగలిగిన వాళ్ళకి తోడు, నీడగా వుండటం కూడా ఒక అదృష్టమే.

9. ఒంటరిగా వుంటున్నాను అని డీలాపడే వ్యక్తి నిరాశావాది. ఒంటరి సమయం దొరికితే కొన్ని మంచిపన్లతో ఆ టైమ్ సద్వినియోగం చేసే వ్యక్తి ఆశావాది.

10. ఈ ప్రపంచంలో మేడల్లో నివసించే వారే కాదు, పూరి గుడిసెల్లో ఎండకి ఎండి వానకి తడిసేవారూ బ్రతుకుతున్నారు. సమర్థులు, తెలివిగల వాళ్ళు ఫలాన రీతిగా బ్రతకాలని నిర్ణయించుకుని ఆ నిర్ణయానికి తగిన రీతిగా జీవితాలు మలుచుకుంటారు. కాని కొంతమంది కాదు, చాలా మంది భగవంతుడు ప్రసాదించిన ప్రసాదంలా తమకి దొరికిన జీవితం అనుభవిస్తారు. వాళ్ళ యిష్టాలతో పనిలేదు, బ్రతకటమే వారి పని.

11. మంచివాళ్ళ మనసులకి మనం దగ్గర అయితే మంచి గంధం పరిమళంలాటి వ్యక్తిత్వం మనల్ని ఆహ్లాదపరుస్తుంది.

12. ఇదివరకు వాళ్ళు ఎదుటవాళ్ళకి అపకారం చేసేవాళ్ళు. ఇప్పటివాళ్ళు వాళ్ళకి వాళ్ళే అపకారం చేసుకుంటున్నారు. ఈ

తాగుడు, జూదం లాటరీలు, డ్రగ్స్ ఇవన్నీ ఏమిటి.

13. తొందరపడి ప్రవర్తించే వారు తర్వాత గంటల తరబడి పశ్చాత్తాప పడతారు.

14. ఎవరైనా పిల్లల్లో స్థిరత్వం, క్రమశిక్షణ, తోటివారితో ప్రవర్తించే తీరు, సరళత్వం, సంస్కారం చూస్తూ వారి తల్లి తన అందమైన పూలతోటగా అన్పిస్తుంది.

15. ఇబ్బంది అనుకుంటే ఈ జీవితంలో ఒక్కక్షణం కూడా భరించలేం.

16. రోగాలెప్పుడూ వున్న వాళ్ళ దగ్గరికే ఎక్కువగా చేరతాయి. లేని వాళ్ళ దగ్గరికి వస్తే వారు తమని మేపలేరని వాటికి తెలుసునేమో.

17. ఆర్థికమైన సుస్థిరత సంపాయించుకోకుండా స్త్రీగాని, పురుషుడు గాని వివాహంలోకి దిగకూడదు.

18. ఈ స్వాభిమానం, ఆత్మగౌరవం అనేవి మహాచెడ్డవి. వీటివల్ల మనిషికి చెప్పరాని పాట్లు కలుగుతాయి.

19. ఈ ప్రపంచంలో మనం కష్టపడకుండా మనల్ని సంతోషపెట్టేవి కోర్కెల గురించిన ఆలోచనలు ఒక్కటే.

20. ఒక అన్యాయాన్ని ఎదుర్కోటానికి యింకో అన్యాయం చేయటం సబబా ! ఒక చెడుని తప్పించటానికి మరో అధర్మాన్ని ఆశ్రయించటం మంచిపనా, శాంతిని స్థాపించటానికి అందరినీ హింసకి గురిచేయటం న్యాయమా.

21. భగవంతుడు మనిషికి ఎంత డబ్బు యిస్తాడో అంత చిక్కుల్లో కూడా పడేసాడు.

22. ఈ ప్రపంచంలో కొంతమంది స్త్రీలు వున్నారు. వారంటే గౌరవాభిమానాలు ఏర్పడుతాయి. కారణం వారి రూపాలు, కట్టుబాట్లు ఎలా వున్నా, వారి కళ్ళలో మాతృత్వమునకు కారణం తొణికిసలాడుతూ వుంటుంది. వారిని చూస్తే మనిషికి సర్వస్వం యిస్తున్న యీ సృష్టి నాకు గుర్తువస్తుంది.

ఆహుతి

1. జీవితం అంటే యింతే, ఆనందాన్ని దుఃఖం – దుఃఖాన్ని ఆనందం ఒకదాన్ని ఒకటి కబళించాలని అహర్నిశలూ ప్రయత్నిస్తూ వుంటాయి.

2. కుటుంబంలో ఏ ఒక్కరు బాధ్యతలేకుండా ప్రవర్తించినా ఆ సంసార నౌక అల్లకల్లోలంలో చిక్కుకుంటుంది.

3. పంచదార చిటికెడు తింటే మధురం. దబ్బాడు తినమంటే వెగటు. జీవితంలో సుఖం కూడా అంతే.

4. మనిషి బ్రతకటానికి ఉన్నతమైన విద్య లేకపోయినా, అదృష్టం వుంటే అవకాశం వచ్చి చేయిపట్టి నడిపించుకుని వెళ్తుంది.

5. ఈ రోజుల్లో చదువులు ఇటు సరైన వుద్యోగాలు యిప్పించనీయవు అటు నిరభిమానంగా శారీరక కష్టమూ చేసుకోనీయవు.

6. నా జీవితం నీకు పంచి యిస్తున్నప్పుడు, నీ జీవితం నీ ఒక్కడివే దాచుకుంటాను అంటే ఎవరు వూరుకుంటారు ?

7. మనిషికి దారిద్ర్యంకన్నా ఘోరమైన శాపం యింకోటి లేదేమో.

8. క్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని దాటే శక్తి మనిషి తనంతటతానే అలవర్చుకోవాలి. నమ్మకం, పట్టుదల ఈ రెండూ ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా నమ్మే మనిషికి అపజయం భయపడుతుంది.

9. మృత్యువు అనేది మనిషికి తప్పనిసరి అన్నమాట నిజమే. అందుకని జీవితం వదిలేయకూడదు. రైలు చిట్టచివరి స్టేషన్‌లో ఆగిపోతుంది కదా అని, దానిని నమ్మకంతో ఎక్కటం మానం కదా !

10. నూరేళ్ళ పంటలాంటి నిండు జీవితాన్ని కష్టసుఖాల్లో భాగం పంచుకుంటూ అవసరం అయినప్పుడు తల్లిలా ఆజ్ఞాపించి, అశాంతి కలిగినప్పుడు స్నేహితురాలిలా సేదదీరుస్తూ ఆనందంగా వున్నప్పుడు ప్రేయసిగా మురిపిస్తూ, అనుక్షణం చిరునవ్వుతో, సహనంతో, భవిష్యత్తుమీద, భర్తమీద నమ్మకంతో సుగుణవతి, సౌందర్యవతి అయిన స్త్రీ భార్యగా లభించటం కంటే మగాడికి అదృష్టం ఇంకేం వుంటుంది.

11. జీవితం అన్న తర్వాత ఎటువైపు నుంచీ, ఎలాటి ఆనందం పొందలేక పోవటం చాలా దయనీయమైన స్థితి.

12. నిరాశ యొక్క ప్రతిబింబం ఆగ్రహం, విషాదంల కలనేతగా వుంటుంది.

నైట్ క్వీన్

1. నా బరువు బాధ్యతలు నేను మోయాల్సిన పెద్దమూటల్లా నా కంటి కెదురుగా వున్నాయి. నేను ప్రయాణించాల్సిన రోడ్డు కూడా ఎత్తు పల్లాల గతుకులమయం అయినా నేను భయపడటం లేదు. నాకు మంచి జీవితం, సుఖశాంతులు కావాలి. అవే లక్ష్యం. అందుకే నేను మోయాల్సిన భారాన్ని, యీ గతుకుల బాటని చూసి నేను భయపడను.

2. మగవాళ్ళలో రెండు రకాలున్నారు. స్త్రీలకి లొంగిపోయేవాళ్ళు, స్త్రీలని లొంగదీసుకోవాలని తపనపడే వాళ్ళు.

3. ఈ ప్రపంచంలో నీ అంతరాత్మకి మించిన ప్రియనేస్తం నీకు యింకెవ్వరూ లేరు. నిజమైన స్నేహితుడు, నువ్వు చేసే పొరపాట్లని నిక్కచ్చిగా చెబుతాడు. నువ్వు ఆవేశపడకుండా ఆలోచించటం నేర్చుకుంటే, జీవితంలో చాలా పొరపాట్లు జరగకుండా తప్పించుకోగలవు.

4. జీవితాన్ని ప్రేమించే వాళ్ళని మృత్యువు ఒణికిస్తుంది. జీవితాన్ని లక్ష్యపెట్టని వాళ్ళముందు, మృత్యువు ఆటలు సాగవు.

5. ఏ పురాణ గ్రంథం చదివినా ఏముంది సారాంశం. చెడ్డవాళ్ళు మంచి వాళ్ళని దోపిడీ చేయటం, హింసించటం ! మంచివాళ్ళు కష్టాలుపడి పడి, చివరకి ఎదురుదిగి వారికి బుద్ధిచెబుతారు. వారి సమర్థతని మనం మెచ్చుకోబోతే 'ఆ భగవంతుడే సాయం వచ్చాడు!' అంటారు.

6. మనిషి అన్నవాడు ఎక్కడ తనకి గౌరవాభిమానాలుండవో అక్కడికి వెళ్ళకూడదు.

7. మనిషిని ఉత్తేజపరచటానికి గాలివార్తలు అంత టానిక్ యింకేదీ వుండదు.

చీకటిలో చిరుదీపం

1. మనిషికి సాయం చేయాలి అని ఆరాటపడటం కూడా ఒక వ్యసనమే.

2. అందరం నాలుగురోజులు వుండి వెళ్ళిపోయే వాళ్ళమే. కానీ నాలుగు యుగాలు బ్రతుకుతాం అన్నట్టు కోర్కెలు పెంచుకుని, సామాను పోగేసుకుంటాం.

3. మృత్యువుని చూసి మనిషి వైరాగ్యం తెచ్చుకోడు. అలా తెచ్చుకుని వుంటే అది మానవుడు మరణించగానే, అతనికి తోడుగా వున్న వ్యక్తి మరణించటం జరిగేది.

4. చూస్తున్నది సినిమా అని అది కల్పన అని తెలుసు. అయినా అందులో లీనమై మనల్ని మనం మర్చిపోతాం. జీవితం కూడా అంతే.

5. ఏ మనిషినైనా ఒక వ్యసనం నుంచి తప్పించటం అంటే ఒక పెద్ద కొండని ఎత్తినట్టే.

6. పెళ్ళి అనేది చిన్నప్పుడే అయితే, అది అలవాటుగా మారిపోతుంది. ఆ గుదిబండ మోయటమే ఆనందం అన్పిస్తుంది.

7. నేను చాలా ఉత్సాహంగా పదిమందికి పెళ్ళి సంబంధాలు చూసి, దగ్గరుండి పెళ్ళి చేయించాను, వారి కాపురాలు చూసింతర్వాత నాకు పెళ్ళి అంటే రోతపుట్టి బ్యాచిలర్‌గా మిగిలిపోయాను.

డోరు నంబరు - 9

1. నేను అదృష్టచక్రాన్ని, కదలటం నా నైజం. నా కదలికలో అడుగుభాగం పక్కకి, పక్కభాగం పైకి, పై భాగం క్రిందికి రావటం చాలా సహజం. నా యీ కదలికతోపాటు, మనుష్యుల్లారా మీరుకూడా కదులుతూ నా వెంట వస్తారు. ఉన్న వాళ్ళు లేనివాళ్ళు, లేనివాళ్ళు ఉన్నవాళ్ళు అవటం, నాతోపాటు కలిగే స్థానభ్రంశం అని గుర్తుంచుకోండి.

2. ఓయి మనిషీ ! నువ్వెంత వెర్రివాడివి. నూరేళ్ళ జీవితం కావాలని ఆరాటపడుతూ, ఇప్పుడు నీకున్న ఆరోగ్యం, ఆనందం, సుఖపడకుండా, క్షోభిస్తున్నావు కదా !

3. ఎవ్వరూ వృద్ధాప్యం కోరుకోరు. అందరూ, యవ్వనమే కావాలని అంటారు. కానీ భగవంతుడు మన శరీర నిర్మాణంలో యవ్వనానికి చాలా కొద్దిటైమే కేటాయించాడు కదా !

4. కోర్కెలు చోరకాంతలులాటివి. దగ్గరకి చేర్చామా - ఇక మనకి నిలువుదోపిడే మరి.

5. ఈ సృష్టి రహస్యాలు తెలుసుకోవాలనే తపనతో ప్రకృతిలోకి వెళ్ళాను. రకరకాల జీవులని చూసాను. ఆలోచించగా,

ఆలోచించగా, నేను ఒక ఆలోచన తెలిసిన మృగాన్నే తప్ప, అంతకంటే మించిన ఆధిక్యత, అర్హత నాకేం లేదని అర్థం చేసుకున్నాను.

6. ఆయన యుద్ధంలో చాలా సాహసంగా పోరాడాడని శ్రీ శౌర్య చక్రం యిస్తూ, ధారాళంగా స్తుతిస్తున్నారు. ఇంతలో ఎలుక ఆయన కాళ్ళక్రింద నుంచి పరుగెత్తింది. ఆయన గెంతులేసి, అధ్యక్షుల్ని పట్టుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నారు అంతే కదా ! ఒక్కొక్కరు ఒక్కొక్క విద్యలోనే ధైర్యవంతులు మరి.

7. తుఫాను, వరద వికటాట్టహాసం చేస్తూ వచ్చి పరవళ్ళు తొక్కి వూళ్ళకి వూళ్ళు నాశనం చేసింది. అది అలిసి విశ్రాంతి తీసుకుంటుంటే, రాతి కన్నంలో నుంచి కప్ప ఒకటి బైటకి వచ్చి తొంగిచూసింది. 'ఎంత బలవంతుడైనా, యీ సృష్టిని నాశనం చేయలేరు' అంది దెప్పి పొడిచినట్టుగా.

8. మనిషి మానవత్వం చూపిస్తే బలహీనత అని వెక్కిరించే సమాజంలోకి వచ్చిపడ్డాం.

9. 'ప్రేమ'ని రెండు చేతులూ చాచి నా మనసులోకి ఆనందంగా ఆహ్వానించాను. ప్రేమ వెనకే 'బాధ' దెయ్యంలా నా మనసులో జొరబడింది. దానితో యుద్ధం చేయటంలో నిమగ్నమైన నేను, ప్రేమ క్షీణించి, మరణించటం తెలుసుకోలేకపోయాను.

అర్ధస్థిత

1. బీటలు వారిన మనసు క్షేత్రంలో, ఎక్కడనుంచో అమృతపు చినుకులు రాలుతున్నాయి. ఆమెలో ఇన్నాళ్ళూ ముసురుకున్న ఆత్మ దారిద్ర్యం, వ్యధ ఎండుటాకుల్లా రాలిపోతున్నాయి. ఒక సుమధురమైన గాలి ఒక కొత్త పథం వైపు పయనం ఆమెకి అర్థం అయిపోతోంది. తను దివ్యక్షణాల సాక్షాత్కారం పొందుతోంది. ఆమె హృదయం పోగొట్టుకున్న కొడుకుని ఎన్నో ఏళ్ళ తర్వాత తిరిగి చూస్తున్న ఆనందపు అమృతపు భాండం ఆమె ఒక మాతృమూర్తి.

2. ఒక్కోసారి తల్లికి తన సంతానం తప్ప యీ ప్రపంచంలో ఇంకేం అవసరంలేదు అన్పిస్తుంది. ఆ ఆనందం ఆమెలో శక్తిని నిద్రలేపుతుంది. మనసులోని సంకోచపు గొలుసుల్ని తెగ్గొట్టేసి స్వచ్ఛమైన, నిర్మలమైన, ఆనందపు అమృతాన్ని దోసిలితో ఆమెకి తాగిస్తుంది ఆ మాతృ ప్రేమ.

3. మనిషి మనసులో తీరనికోరిక, ఎక్కడో అట్టడుగున మారుమూల దాగివున్న పొగలా, ఒక్కోసారి వలయరూపంగా సుళ్ళు తిరుగుతూ, అంతర్యపు తలుపుల మధ్య నుంచి వచ్చిన సెగలా నిట్టూర్పుగా బైటకి వస్తుంది.

4. కొంతమంది శరీర సౌష్టవాలు చూస్తే దేవుడు వారికిచ్చిన కానుకగా అన్పిస్తుంది.

5. అందరం ఆ దేవుడు సృష్టించిన మనుష్యులమే అయితే - కొంతమందిలో ఎందుకంత స్వచ్ఛత, మరికొంతమందిలో యెందుకంత మలినత్వం ?

6. ఈ ప్రపంచంలో ఇద్దరు వ్యక్తులమధ్య ప్రేమ ఎప్పుడు, ఎందుకు ప్రారంభం అవుతుందో చెప్పే కొలమానం మనిషి సృష్టించలేకపోతున్నాడు.

7. సమస్యలు వచ్చినప్పుడు ఆవేశపడకూడదు. డీలా పడద్దు. ఒక్క నిముషం మనసు నిబ్బరం చేసుకుని, అవి మీకు వచ్చిన సమస్యలుగా కాక వేరే వ్యక్తులకి వచ్చినవిగా చూడండి. పరిష్కారం మీకు తప్పక దొరుకుతుంది.

8. క్రమశిక్షణముందు బ్రతిమలాటలు, క్షమార్పణలు, కన్నీళ్ళు దాని వాడితనం తగ్గించలేవు.

9. మనిషిలో బాల్యంని కౌమారం తరిమితే, యవ్వనాగమనం తన సామ్రాజ్యం స్థాపించాలని ప్రయత్నాలు చేస్తూంటుంది. నడివయసు అనే కర్కోటకుడు వచ్చి దాన్ని తరిమేస్తాడు. వెనువెంటనే వృద్ధాప్యం వచ్చి నడివయసుని కుర్చీ ఖాళీ చేయిస్తుంది. ఇదీ మనషి శరీర చరిత్ర.

10. మనిషి మనసుని ప్రశాంతంగా ఉంచుకుంటే ఈ ప్రకృతిలో క్షణం క్షణం కలిగే మార్పులు ఆనందంగా గమనించవచ్చు.

11. అతను వెన్నెల రేయిని గురించి, విరిసే పూలసౌరభాలని గురించి, నదిలో విరిసిన ఇంద్రధనస్సు గురించి పరవశంగా పాట పాడుతున్నాడు. ఆమె తన జీవితాన్ని నాశనం చేసిన పెనుతుఫానుల్ని, భూకంపాల్ని గుర్తుతెచ్చుకుని హృదయవిదారకంగా రోధిస్తోంది.

12. ఈ ప్రపంచంలో పసికందులంతా దేవుడి చిరునవ్వులు.

13. తెలివితేటలుంటే వ్యాపారం ఎంతయినా విస్తరించవచ్చు. కాని దాని పునాది మానవత్వం మీద వుండితీరాలి.

14. భార్యాభర్తలు మధ్య ఆనందం చెరి సగం. అది ఒకరికి ఒకరు ఇచ్చుకునే దానం కాదు.

16. ఇదివరకు రోజుల్లో పిల్లలు తల్లితండ్రులకి భయపడేవారు. ఇప్పుడు తల్లితండ్రులే పిల్లలకి భయపడుతున్నారు.

17. అతనిది నూతన యవ్వనం, పసితనం కలనేతగా కలిసిపోయివున్న ముఖం.

18. కళాకారుడు, తను చూసిన ప్రపచంలో నుండి మరో ప్రపంచం సృష్టించటానికి భావ విద్యుత్తరంగాల ప్రకంపనలతో పునీతుడవుతాడు.

19. ప్రేమ పరుస్తున్న కాంతి ఆమె మనో ద్వారాలని తెరిచివేస్తూ యోగనిద్రలో వున్న ఆమె మనసుని లేపుతుంది.

20. అతను ఎప్పుడూ ఆమెని సౌందర్యపరమైన వ్యాఖ్యలు చేయడు. అతనికి ఆమెని చూసిన ఆనందం అనుభవించటమే తప్ప వ్యక్తం చేయటం రాదు.

21. అతను ఆమె ఆత్మాభిమానంని అవమానపరిచాడు. ఆమె ఆంతర్యంలో నుంచి కోపాగ్ని శిఖలు ఆడతాచుల్లా లేస్తున్నాయి

22. నా మనసు ఒక తపోవనం. ఏకాగ్రతకి, ప్రశాంతతకి నిశ్శబ్దానికి మారుపేరు. అప్పుడు మొదలవుతుంది నా మనసులో భావప్రకటన జలపాతం. దాని సవ్వడిలో 'నేను' అనే నా ఉనికిని మర్చిపోతాను

23. నేను చూసిన అద్భుత సౌందర్య చిత్రం. చిరిగిన బట్టలతో వున్న ఒక పేదయువతి కొడుక్కి స్తన్యం యిస్తోంది. ఆమె అరమోడ్పు కళ్ళలో అనిర్వచనీయమైన ఆనందం. తల్లి నుంచి జీవనధార అయిన క్షీరం నోటితో అందుకోవటంలో బిడ్డలో తృప్తి. ఆమె ముఖం ఒక అపురూపమైన ఆనంద తటాకం.

24. నేను అతని ప్రేమలో గులాబీపూల సౌకుమార్యం, పరిమళం కోరాను. అతను నా చేతిలో కత్తి వుంచి నన్ను భయభ్రాంతులకి గురిచేశాడు.

25. ఎవరైనా యింకో వ్యక్తితో 'నువ్వే నా జీవన సర్వస్వం' అంటే నవ్వు వస్తుంది. మన జీవితం అంతా మన దగ్గరకి వచ్చిపోయేవారి ప్రకరణలు మాత్రమే.

26. ఎవరినయినా గాఢంగా ప్రేమించే ముందు, మొదట నీలో క్షమించే శక్తి ఉందా లేదా ఆలోచించుకో.

జై జవాన్

1. దేశ రక్షణే మన రక్షణ అని తెలియని చాలామంది మూర్ఖాగ్రేసర చక్రవర్తుల మధ్య మనం బ్రతుకుతున్నాం. అధిక సైనికబలంతో అత్యధిక మారణాయుధాలతో శత్రువు మనపై విరుచుకుపడ్డాడు. మన జవాన్లు ఆకుంఠిత ధైర్యసాహసాలతో పోరాడుతూనే వున్నారు. కానీ కేవలం సైనిక బలం మాత్రమే చాలదు. దేశంలో మనలోనే అంతర్గత శత్రువులున్నారు. వీరు చీకటి వ్యాపారులు. అవసరం చూసి అందరినీ దోచుకుందామనే స్వార్థపరులు. మన దేశ రహస్యాలు ఇతరులకి చేరవేసే నీచులు. వీరిని ఎదుర్కోవటానికి మనం శ్రమించాలి. యీ శత్రువులతో మనం అంతా వీరజవాన్లులా యుద్ధం చేయాలి.

2. సత్యాగ్రహంలో సత్యమే మారిపోయింది.
తండ్రిమీద కొడుకు సత్యాగ్రహం,
మొగుడిమీద పెళ్ళాం సత్యాగ్రహం,
లెక్చరర్ల మీద విద్యార్థుల సత్యాగ్రహం.

3. పండు కోసుకోమని బాకు వాడికిచ్చాను,
వాడు గొంతు కోసుకున్నాడు.

నేను లబలబలాడ్తుంటే నా మిత్రుడు 'నయం, వాడు నీ పీక కోయలేదు' అంటూ ఊరడించాడు.

4. మన దేశ పతాకం కోసం ప్రాణాలు అర్పించాడు వీర సైనికుడు. ఒక స్వార్థపరుడు ఆ పతాకం పీకి, జెండా కర్రని తీసుకువెళ్ళి మంటలో వేసి చలి కాచుకున్నాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో మన పెద్దలు చేసిన త్యాగాలను స్వార్థపరులు యిలా ఉపయోగించుకుంటున్నారు.

5. చాకుతో పండుకోయటం సహజమైన పని, తన పీక కోసుకోవటం ఆత్మాహుతి, ఎదుటవారి పీక కోయటం దానవత్వం.

6. దేవుడు చెడ్డవాళ్ళని చాలా ఆలస్యంగా, మంచివాళ్ళని చాలా త్వరగా శిక్షిస్తాడు.

7. దేశంలో కొంతమంది యుద్ధం ఎప్పుడు వస్తుందా అని చూస్తారు. యుద్ధంవస్తే వారి అదృష్టాలు పండుతాయి అని వారి నమ్మకం.

8. దేశద్రోహిం శత్రువుకి దేశ రహస్యాలన్నీ చేరవేసి శత్రువుని గెలిపించాడు. తనికి పెద్ద బహుమతి వస్తుందని ఆనందపడ్డాడు. శత్రువు నీలాటి ద్రోహి దేశానికి ముప్పు అంటూ అతన్ని ఉరితీసాడు.

9. అనైక్యతవల్ల మనం ఎన్ని బాధలకి గురి అయ్యామో ఎంత నష్టపోయామో మన దేశచరిత్ర ఎంత చాటిచెబుతున్నా మనకి బుద్ధిరాదు. మన తెలివిహీనతకి సోమరిపోతుతనానికి ఆ దేవుడు మనకి వేసే శిక్ష 'బానిసత్వం'.

10. ఎవర్ని అడిగినా, మా పిల్లలు మా ప్రాణం. అంటారు. దేశాన్ని ప్రాణంగా చూసుకుంటేనే, మనం పిల్లలు క్షేమంగా వుంటారు.

11. మనమంతా ఒకటి మన లక్ష్యం ఐకమత్యం. మన దిక్సూచి మన దేశ భద్రత అని మనమందరం నమ్మిననాడు, ఏ శత్రువూ మనవైపు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించదు.

ఆరాధన

1. మనిషి ఏదయినా పొరపాటు చేసినప్పుడు ఏనాటికైనా అది పొరపాటు అని తెలుసుకోవటం పశ్చాత్తాప పడటం ఈ రెండూ అవసరమే. కాదనటం లేదు. కానీ తెలివి తక్కువతనం వల్లనో, మూర్ఖత్వం వల్లనో ఒకసారి చెయ్యి జార్చుకుంటే జీవితాంతం ఎవరికి వారే తమని చిత్రహింస చేసుకుంటూ కూర్చోవటం న్యాయం కాదు.

2. పిల్లల పట్ల తల్లితండ్రులు పొరపాటు చేస్తే, అది సరిదిద్దుకోవటమే గాదు, వారికి నచ్చచెప్పాల్సిన బాధ్యత కూడా వుంది.

3. అమ్మంటే తప్పులు క్షమించేదే కాదు అవసరం అయితే సంతానాన్ని శిక్షించే వ్యక్తి కూడా అయివుండాలి.

4. గతాన్ని గబ్బిలంలా పట్టుకుని వేళ్ళాడుతూ కూర్చుంటే కలిగే ప్రయోజనం లేదని తెలుసుకోవాలి.

5. జీవితంలో మంచి చెడులు చూసేందుకు ఒక వ్యక్తి చాలా అవసరం అదే 'పెళ్ళి'గా చేసారు పెద్దలు.

6. నిశ్శబ్దంగా, మౌనంగా, జీవితంలో అంతర్వాహినిలా కలిసిపోయే జీవన భాగస్వామి దొరికిన వ్యక్తి కంటే అదృష్టవంతులెవ్వరూ లేరు.

7. ఈ ప్రపంచంలో మనిషిలో చెడ్డతనానికి మించిన అవకరం యింకేదీ లేదు.

8. మనుష్యుల హృదయాల్లో మంచి వాళ్ళకంటే చెడ్డవాళ్ళే త్వరగా ముద్రవేస్తారు.

9. ఆశ్రయ విహీన అయిన ఆడదానికి డబ్బు వున్నా తిప్పలే లేకపోయినా తిప్పలే.

10. ఈ వయసు వుందే అది మహా చెడ్డది. మయసులో వుండటం, ఆపైన ఉద్రేకం చేతిలో చుక్కాని యిస్తే ఆ జీవననౌక ఏ దిక్కుకి వెస్తుందో ఆ దేవుడికే తెలియాలి.

11. పెళ్ళి చేసుకునేటప్పుడు స్థితిగతులు, సాంప్రదాయాలు మొదలైన వాటిల్లో సామ్యం చాలా అవసరమే. కాదనటంలేదు. వాటిని అధిగమించటం అంటే ఏటికి ఎదురీదటమే. ఆ ఎదురీతకి మనిషిలో బలమైన విశ్వాసం, దృఢచిత్తం కావాలి.

12. బలహీనులు, అవివేకంతో తమ జీవితం విషాదమయం చేసుకోవటమే గాకుండా, తమ చుట్టూ వున్న వాళ్ళ బతుకులు కూడా వేదనామయం చేస్తారు.

13. లోకులు కాకుల్లాటి వాళ్ళు, అప్పుడప్పుడూ మనం చిన్నకర్ర తీసుకుని బెదిరించి తరిమికొట్టకపోతే వాళ్ళ రోదన భరించలేం.

14. ఈ ప్రపంచం చాలా చెడ్డది. అమాయకంగా, మంచితనంగా వుండే వాళ్ళని కన్నవారైనా - కట్టుకున్న వారైనా అంతా అన్యాయం చేయటానికే చూస్తారు.

15. ఏం ప్రపంచం యిది ? ఒట్టి స్వార్థపరులది. బలవంతులు బలహీనులని అణగదొక్కటంలోనే యీ లోకంలో సంతోషం బ్రతుకుతోంది. నోరులేని వాళ్ళు అంటూ చాలామంది వున్నారు కాబట్టి నోరుగల కొద్దిమందే పెత్తనం చెలాయించి రాజ్యం ఏలగలుగుతున్నారు, ఎదిరించటానికి గాని, వ్యతిరేంచటానికి గాని ఎలాటి శక్తీలేని పిరికివాళ్ళ ఆశల సమాధుల మీదనే శక్తి మంతులు ఆనందసౌధాలు లేస్తున్నాయి. బలం వుంటేనే బ్రతుకు, శక్తి సామర్థ్యంగల నేర్పరులకి క్రీడాస్థలం అయిపోయిన యీ ప్రపంచంలో అల్పులకి స్థానం ఎక్కడ ! వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మలుగానో, బానిసలుగానో అవటం మినహాయించి.

16. పెళ్ళికి ముందు భర్తని ప్రేమించటం ఎలాగా అని ఆరాటపడిన నేను మధ్యవయసు వచ్చే సరికి ఎవరినీ ప్రేమించకుండా బ్రతకటం ఎలాగో నేర్చుకున్నాను.

17. లక్షమందిలో ఒక్క విజ్ఞానవంతుడు పుట్టినా, సమాజ నడకని నిర్దేశించగలడు. గొర్రెలు వందలున్నా కాపరి ఒక్కడే కదా.

18. ఈ రోజుల్లో మన ప్రజలంతా దేశభక్తిని మర్చిపోయి, మూఢ భక్తిలో మునిగిపోయారు.

19. నేను ఒక బాబాని చాలా ఆరాధించాను. అద్వితీయ శక్తులున్న ఆయన అపర భగవంతుడే అని నమ్మాను. నా కోట్లరూపాయల

ఆస్థి ఆయన పాదాల చెంత పెట్టి నా భక్తి ఋజువుచేసుకున్నాను. ఆయనకి నవరత్నాలు పొదిగిన ఖడ్గం ఒకటి బహుమతి యివ్వబోతుంటే ఆయన భయపడి అవతలకి పరుగెత్తాడు. నేను ఆయన అద్వితీయ శక్తుల గురించి ఆలోచనలో పడ్డాను.

20. కొంతమంది రక్షణ నిధి అంటూ చందాలు పోగుచేసి వారికి కావాల్సిన ఇళ్ళు - బ్యాంక్ బాలెన్స్‌లు ఏర్పరుచుకుని వారిని గురించిన రక్షణ చేసుకుంటారు.

21. ఎదురుగా వచ్చే శత్రువుతో పోరాడగలం. వెనక నుంచి వచ్చి దొంగదెబ్బ తీసే శత్రువుతో పోరాడలేం.

22. మా అమ్మమ్మ నాకు రామాయణం - భారతం గురించి చెప్పింది. కాన్వెంట్ చదువులు చదువుత్ను నేను చాలా ఆశ్చర్యపోయాను. అన్ని వేల సంవత్సరాల క్రిందటకీ - ఇప్పటికీ యీ మనుష్యుల బుద్ధులు రవ్వంతకూడా మారలేదేమిటి ? అవే కిడ్నాపులు అవే యుద్ధోన్మాదాలు, అవే మంచి వాళ్ళకి చెడ్డ వాళ్ళకి మధ్య సంఘర్షణలు.

23. అమెరికా నుంచి వచ్చిన మా పిన్నికూతురు, వాళ్ళు షాపులోకి అడుగు పెడుతుంటే తలుపులు ఎలా తెరుచుకుంటాయో కారు గేరేజ్ డోర్‌ని మీటనొక్కి వీధి చివర నుంచే ఎలా తెరవవచ్చునో చెప్పింది. "మా దేవుళ్ళ దగ్గర వాళ్ళు నేర్చుకున్నారన్నమాట" అంది మా నాయనమ్మ.

24. దేవుడు మనిషిని సృష్టించాడు, మనిషి డబ్బుని సృష్టించాడు. ఆ డబ్బు ఇప్పుడు తాతని చూడాలని తహతహలాడ్తోంది.

25. మా మామయ్య ఎండలువస్తే చెడ్డ ఎండలు అంటాడు. వానలువస్తే చెడ్డ వానలు అంటాడు చలికాలంవస్తే చెడ్డ చలి అంటాడు. మా అత్తయ్య "ఆయన పుట్టినప్పుడే దేవుడు చెడ్డ కళ్ళని ప్రసాదించాడులే" అంటుంది.

సుకుమారి

1. ఈ రోజుల్లో చదువు డబ్బు సంపాదనకే తప్ప వ్యక్తి వికాసానికి ఏం తోడ్పడటంలేదు.

2. అందరూ డబ్బుని చాలా జాగ్రత్తగా ఖర్చుపెట్టిన ప్రతి రూపాయికీ విలువ పొందాలని తహతహలాడ్తారు. నేను జీవితంలో ప్రతి క్షణం విలువ పొందాలని ఆరాటపడ్తాను.

3. ఏ మనిషికైనా, తన జీవితంపట్ల క్షుణ్ణమైన అవగాహన వుండాలి. ఇది సరయిన గురువుతోనే లభిస్తుంది.

4. ఏ మనిషి అయినా, 20 సంవత్సరాల వరకూ మంచి ప్రవర్తనతో చక్కగా చదువుకుని కుటుంబానికి పేరు తేవాలి. 20 నుండి 60 సంవత్సరాల వరకూ తనకోసం తను బ్రతకాలి. ఆ తర్వాత బ్రతికినంత కాలం జీవిత సమయాన్ని సంఘానికి అంకితం చేసేయాలి.

5. ప్రియనేస్తాల్లారా !

ప్రస్తుతం నేను పొందుతున్న ఈ ఆనందం వెనక ఒక కన్నీటి వరద వుంది. మా పెద్దవాళ్ళ చాదస్తంవల్ల కొంత, నా అమాయకత్వం వల్ల కొంత, నేను ఆ కష్టాల వరదలో మునిగిపోయి

కొట్టుకుపోయాను. ఆత్మహత్యే యిక నాకు గతి అనుకున్నాను. కానీ చావుకి నేనిష్టపడలేదు. నేనెందుకు చచ్చిపోవాలి అని ప్రశ్నించుకున్నాను. రేపటి మీద నమ్మకం పెట్టుకున్నాను. బ్రతికితీరాలి అని పోరాడాను. గెలుపు నాదే అయింది. మీరు కష్టాలకి లొంగకండి. రాజీపడకండి, పోరాడండి. ఆనందకిరణాలు మీ మనో ప్రాంగణంలో తొంగి చూస్తాయి.

6. ప్రతి వాళ్ళ జీవితంలో ఏదోరకమైన కష్టాలుంటాయి. కష్టాలు కలకాలం ఉండవని అందరూ అర్థం చేసుకోవాలి.

7. నీకు కష్టాలు వచ్చినప్పుడు, నీ కంటే ఎక్కువ కష్టాలుపడి యెదురీదినవారిని గురించి ఆలోచించుకో.

8. ప్రియనేస్తాల్లారా !

ఒక్కసారి యీ ప్రపంచాన్ని పరిశీలించి చూడండి. నిరంతరం మారే యీ ఋతువులు, రాత్రి వెనక పగలు, వాన వెనక ఎండ, బాల్యం తర్వాత యవ్వనం, యవ్వనం తర్వాత వృద్ధాప్యం ఏదీ నిలకడ లేకుండా మారిపోతాయి. ఈ సృష్టిలో మార్పు చెందకుండా వున్నదేదీ నాకు కన్పించటంలేదు. నాకు తెలుసు మీరు నేర్చుకుంటున్న చదువులు, చూస్తున్న బైట ప్రపంచం కొత్త ఆలోచనల్ని, స్వాతంత్ర్యపు ధీరత్వాన్ని నేర్పుతున్నాయి, కుటుంబ వ్యవస్థ, సాంప్రదాయపు విలువలూ రంగులు నూర్తున్నాయి. అటు కొత్తని అందుకుంటూ, ఇటు పాతతో. మంచిని దక్కించుకుని వినూత్న ప్రపంచానికి సృష్టికర్తలు అవండి.

9. వృద్ధులైనప్పుడు గాని, అనారోగ్యంగా వున్నప్పుడు కానీ జీవితం వ్యర్థం అయినా బాధ వుండదు. కానీ ఆరోగ్యంగా, అందంగా,

తెలివిగా వున్న ఆడపిల్లల జీవితాలు వ్యర్థం అవుతుంటే చాలా వ్యధ కలుగుతుంది.

10. వెలుగుని వెంటాడే నీడలా, ఆడపిల్ల వ్యక్తిత్వానికి సవాళ్ళు వుంటాయి.

11. ఈనాటి ఆడపిల్ల అటు పాతదనం వదల్లేక, ఇటు కొత్తదనం కావాలని కోరుకుంటూ రెండు పడవలమీద కాళ్లు పెట్టి బ్యాలెన్స్ చేయటానికి ప్రయాసపడ్తోంది.

12. స్వేచ్ఛాకాంక్షతో కొత్తదారి వెతికిన వారికి కొత్త సమస్యలు, పాతవి పట్టుకుని వేళ్ళాడిన వారికి జీవితం ఒక యినప వూచల బందిఖానా.

13. మన జీవితాల్లో మన తెలివితక్కువ వల్లనో, పొరపాటువల్లనో ప్రమాదాలు తిమింగలాల్లా మనల్ని మింగి వేయటానికి మీదకి వస్తాయి. మనదగ్గర వాటిని ఎదుర్కొనే ఆయుధాలుండవు. మనం ఆ ట్రయినింగ్ పొంది వుండం. కానీ ప్రతి ఆడపిల్లలో నిద్రాణమైన 'ఒక ఆదిశక్తి' వుంటుందని మర్చిపోకండి.

14. నిన్నటి తరానికి సీతలు - సావిత్రులు - రుక్మిణులు ఆదర్శం. ఈనాటి తరానికి దుర్గలు - కాళికలు ఆదర్శం.

15. నేను చేసిన తప్పేమిటి ? అని నన్ను నేను వేసుకున్న ప్రశ్నలే నా ఆత్మహత్యా తాడుని విప్పేసింది. ఈ జీవితం నాది, పూర్తిగా నాది అన్న అవగాహనే నా కన్నీళ్ళని తుడిచేసింది.

16. ప్రతి సగటు ఆడపిల్ల హృదయం పెళ్ళి అయ్యేంతవరకూ ప్రేమ తుషారంతో తడిసిన అరవిచ్చిన గులాబి.

17. "నా కసలు యీ బాధలు ఎందుకురావాలి ?" ఈ ప్రపంచంలో బాధలుపడే ప్రతివ్యక్తీ అనుకునే మాటయిది.

18. "కొంతమంది ఎందుకు అందంగా వుంటారు ? కొంతమంది ఎందకు సుఖంగా వుంటారు ? కొంతమంది ఎందుకు బాధలుపడ్తారు." ఈ ప్రశ్నలకి ఆ పరమేశ్వరుడే జవాబు చెప్పాలి.

19. ఉన్నంతలో మన జీవితాన్ని మనం సుఖమయం చేసుకోవాలి. ఆ ప్రయత్నం గురించి మర్చిపోయి, మనకి యింకా ఏవో అదృష్టాలు రాలేదని ఏడుస్తూ కూర్చుంటే, మన చేతిలో వున్న జీవితకాలం వేళ్ళ మధ్య నీరులా కారిపోతుంది.

20. అనవసర భ్రమలకి లోబడి జీవితం చేజార్చుకుంటారా ! జాగ్రత్తగా మనసులుకుని జీవితం బాగుచేసుకుంటారా ?

21. "జీవితంలో తప్పులు చేసినా ఒప్పులు చేసినా బాధ్యత నాదే" అనుకుంటుంది. తెలివిగల ఆడపిల్ల.

22. ఈ ప్రపంచంలో నీకెవ్వరూ లేరా ?

ఎవ్వరిమీదా అధికారం లేదా ?

అయితే నీలోనే ఏదో పెద్ద లోపం వుంది.

23. పరీక్షకి వెళ్ళినట్టే జీవితాన్ని కూడా బాగా సుశిక్షణతో అర్థం చేసుకుంటేనే విజయం పొందగలిగేది.

24. కొంతమంది వ్యక్తిత్వం ఎంతమందో బాటసారులకి నీడనిచ్చే చెట్టులా వుంటుంది.

25. ప్రతి స్త్రీ తన ఇంటిని బాధ్యతగా తీర్చిదిద్దినట్టే సంఘంలో కూడా తన బాధ్యతని నిర్వర్తించాలి.

26. సంఘం గుమ్మం ముందు మనం వున్నాం అని బేలగా అనుకోవద్దు. మన గుమ్మం అనతలే సంఘం వుండాలి అనుకోండి.

27. ఈ ప్రపంచంలో వంటయింట్లో అంటగిన్నెలు, బ్యాంక్‌లో ఎకౌంట్స్, లైబ్రరీలలో పుస్తకాలు, ఎదుటివారితో పోట్లాటలేకాదు, సంగీతం, డాన్స్ పచ్చటి ప్రకృతి, జలపాతాలు వెన్నెలరాత్రుళ్ళు, ఆకాశంలో ఇంద్రధనస్సులు రాత్రివేళ డిమ్‌లైట్లో డిన్నర్లు, మంద్ర స్థాయిలో సంభాషణలు, ఫోన్లలో పలకరింపులు వున్నాయని తెలుసుకోవాలి.

28. అందంగావున్న ఆడపిల్ల భార్యగా కావాలి. మొదటి యువకుడు, అందంలో ఆధిక్యతకంటే తెలివితేటల్లో ఆధిక్యతగల ఆడపిల్ల కావాలి రెండో యువకుడు.

"నాకు ఆ రెండింటిలో ఆధిక్యత అమ్మాయి కావాలి" మూడో యువకుడు

"అయితే ఒక రోబో (యాంత్రిక సుందరి)ని కొనుక్కో అమ్మాయిలందరూ వారికిచ్చిన సమాధానం" "మానవత్వం మాటెత్తని మొగుళ్ళు మాకు వద్దు" వారి ఆగ్రహం.

29. "అనుక్షణం నా జీవితం ఒక రసమయ కావ్యంలా వుండాలి". పెళ్ళికి ముందు ఆమె సుమధుర స్వప్నం.

"క్షణక్షణం ఒంటిమీద తన్నులు, దుర్భాషలు" పెళ్ళి తర్వాత ఆమెకి ఎదురైన యదార్థం.

30. "నీ ప్రేమతో నన్ను బంధించేసావు" అంది ఆమె పరవశంగా. వారం తర్వాత అతను ఆమెని వురితీసి చంపాడు.

31. మనలో చాలా మందికి పెళ్ళి ఒక జీవన గమ్యం. కొంతమందికి అది మజిలీ. మరి కొంతమందికి అది ఒక ఆశ్రయం. ఇంకా కొంతమందికి ఒక ముసుగు. కొంత మందికి ఒక ఆసరా. చాలా మందికి అది ఒక యాక్సిడెంట్. కానీ బహుకొద్దిమంది అదృష్టవంతులకి మాత్రం అది "ఒక ప్రేమపూరిత సంపూర్ణ జీవితం."

32. కొంతమందిని జీవితం వదలదు బాగా బుద్ధిచెప్పాలని కాబోలు చావటానికి కూడా అవకాశం లేకుండా చేసి, బ్రతుకుని హింసపెడ్తుంది.

33. అన్నింట్లోకి డబ్బు ఖర్చుచేయకుండా మనిషి పొందే ఆనందం ఒకరిగురించి కల్పిత కథలు చెప్పుకోవటం.

34. ఆడపిల్లలో ప్రేమకి ఆశపడే మనసే ఆమెకి ఒక పెద్ద ప్రమాదం.

35. మనం యిష్టం వున్నా లేకపోయినా మార్పులు తమ ఇనపపాదాలతో మనమీద నుంచి నడిచి వెళ్ళిపోతుంటాయి.

36. మనం యిప్పుడు ఒక 'పరిణామ దశ'లో వున్నాం. మన సంస్కృతులు కొత్త దారులు అన్వేషిస్తున్నాయి.

విలువలు తారుమారు అవుతున్నాయి. మన వ్యక్తిత్వాలు ఈ రంగుల అద్దకాల్లో మార్పుచెందక తప్పదు.

37. ఈ ప్రపంచంలో నాలాటి ఆడపిల్లలు వేలమంది, లక్షల మంది నాలాగానే కాందిశీకుల్లా మూగగా ఈ జీవితపు ఎడారిలో నడకని సాగిస్తున్నారు. వారి నిట్టూర్పుల సెగలకి యీ భూమి వేడెక్కిపోతోంది.

38. ఈ లోకంలో ప్రేమ పేరుతో - పెళ్ళి పేరుతో లక్షలమంది ఆడపిల్లలకి వారి శ్రమ - వయసు నిలువుదోపిడీకి గురిఅవుతున్నాయి. వారి అభిమానం - ఆత్మానందం తెలివితేటలు సర్వం కాజేయబడుతున్నాయి.

ఎక్కడో ఒక తిరుగుబాటు కేక విన్పిస్తుంది. కానీ ఎవ్వరూ ఆ కేకని పట్టించుకోరు. పట్టించుకుంటే ఆగి చూడాలని, ఆగిచూస్తే అడ్డు కోవాలని, అడ్డుకుంటే ఆలోచించాలని, దానికి ప్రత్యామ్నాయం వెతకాలని వెతికితే అది తమ మరణశాసనం అవుతుందనీ వారి భయం.

39. ఎవరి జీవితం గురించి వారే ఆలోచించుకోవాలి. ఎవ్వరూ తోడుగా నిలవరు.

40. ప్రేమించటం నా అపరాధం అయితే నన్ను క్షమించమని మిమ్మల్ని నేను అర్థించను, నేను యాచకురాలిని కాదని తెలుసుకోండి.

41. నాది అనే జీవితంకోసం నేను ఎంతో ఆరాటపడ్డాను. అది నాకు లభించలేదు.

నేను అడగనివి, కోరుకోనివి ఎన్నెన్నో దొరుకుతున్నాయి. దాహంతో చచ్చిపోతున్న మనిషికి బంగారు ఆభరణాల పెట్టె యిచ్చినట్టు.

42. నా జీవితం అంతా నా కోసం నేనేం చేసుకోలేకపోయాను. మనసుకి ఆనంద దీపం ప్రసాదించని పన్లు.
శాంతి తీరం చేర్చలేని ప్రయాణాలు.
'ఈ జీవితం నాది' అనిపించలేని అసందర్భపు మజిలీలు.

43. ఆడపిల్ల తన భర్తని, పిల్లల్ని ఇంటిని ఎంత ప్రేమిస్తుందో చాలా మంది అర్థం చేసుకోరు. అది ఆమె బలహీనత అని చిన్న చూపు

చూస్తారు. నిజానికి ఆమె శక్తి స్వరూపిణి అయి వుండి కూడా శాంతమంతురాలు అయిపోతుంది.

44. సంసారంపట్ల ప్రేమ కారణంగానే చదువుకున్న స్త్రీలు, డబ్బు సంపాయించే స్త్రీలు కూడా బాధల్ని మింగుతూ సంసారంకి ప్రాధాన్యతయిస్తూ నిలుపుకోవాలని తాపత్రయపడ్తారు.

45. స్త్రీ ప్రేమని బలహీనతగా భావించి ఆమెని మానసికంగా దోచుకోవాలని చూస్తారు అందరూ.

46. స్త్రీ యిల్లుని వదిలేసే రోజులు వస్తే యీ ప్రపంచంలో మానసిక వ్యాధుల పీడితుల కోసం హాస్పిటల్స్, పిల్లలకోసం అనాధశరణాలయాలు పెరిగిపోక తప్పదు.

47. స్త్రీ తన 'సంసారాన్ని' ఎలా బాధ్యతతో కూడిన ఆనందంగా భావిస్తుందో ఆ 'సంసారం' కూడా ఆమెతో అంతే బాధ్యతతో ప్రవర్తించాలి.

48. నాకు నా యీ జీవితం అంటే చాలా యిష్టం.
ఆఫ్టరాల్ మనకి వున్నది - తెలిసింది ఒకే ఒక జీవితం. మళ్ళీ పుడ్తానో లేదో నాకు తెలియదు. నాకు లభించిన యీ 'బ్రతికే అవకాశాన్ని' ఎవ్వరో బాధలుపెట్టి నాశనం చేస్తుంటే నేను చూస్తూ వూరుకోను. నా యుక్తులన్నీ ఆయుధాలుగా తిప్పుతూ వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తాను.

జాహ్నవి

1. రోగి డాక్టర్‌ని ఇలలో భగవంతుడే అని భావిస్తాడు.

2. ఇదివరకు రోజుల్లో వైద్యులు రోగులని తమ చేతి స్పర్శతో, మృదువైన మాటలతో సేదదీర్చి సగం రోగం తగ్గించేవారు.
ఇప్పటిరోజుల్లో డాక్టర్లు రోగులని కసురుతూ రోగం ఎక్కువ చేసేలా తోడ్పడుతున్నారు.

3. ఇదివరకు రోజుల్లో వూరికి వైద్యుడు ఒక్కడే. ఆయనకి అన్ని రోగాలూ తెలుసు. ఇప్పుడు బజారుకి పదిమంది డాక్టర్లు. వారికి వీధికొక క్లినిక్. వారికి వారి విభాగం తప్ప వేరేదీ తెలియదు.

4. తల్లితండ్రులు పిల్లల్ని మెడిసన్ సీట్ రాగానే వాళ్ళు సంపాయించే 'ధనసౌధాలు' అంచనా వేస్తున్నారు.

5. మా డాక్టరు మిత్రుడి సుణుగుడు యిది "ఇండియాలో రోడ్డు కూలీకి వున్న నిశ్చింతకూడా మా డాక్టర్లకి లేదు".

6. రోజులు మారిపోయాయి.
ఇదివరకు వైద్యుడు రోగి ఎంత డబ్బు యిస్తే అంతే పుచ్చుకునేవాడు.

ఇప్పటి వైద్యుడు ఈ రోగివల్ల నేను, నా స్పెషలైజ్ మిత్రులు ఎంత డబ్బు లాగగలమా అని ఆలోచన. నేనిచ్చిన డబ్బుకి నువ్వు నాకెంత వైద్యం చేస్తున్నావు అని రోగి డేగకన్నుతో కాపలా.

7. ఈ రోజుల్లో వైద్యుడు రోగ నిర్ధారణకి రోగి ఫామిలీ ట్రీ పరీక్షచేస్తే రోగి యీ డాక్టరుగారి హస్తవాసి ఎలాంటిది అని రహస్య సమాచారం సేకరిస్తాడు.

8. ఇదివరకు రోజుల్లో రోగులు డాక్టరుగారికి భయపడేవారు. ఈ రోజుల్లో డాక్టర్లే రోగులకి వారు తమని ఎక్కడ ఏ విషయంలో 'సూ' చేస్తారోసని భయపడ్తున్నారు.

9. డాక్టర్లు మమ్మల్ని సరిగ్గా చూడటంలేదని రోగుల రొద. ఈ రోగుల రోగాలకి వైద్యం చేస్తాంగాని, మేం వారి సేవకులం కాదు అని డాక్టర్ల రుసరుసలు.

10. ఇదివరకు రోగికి శరీరం ఒక్కటే.

ఇప్పటి రోగికి, కాలేయం, కళ్ళు, మూత్రపిండాలు, హార్ట్, బ్రెయిన్ చెవులు, కాళ్ళు, కీళ్ళు, నరాలు, కండరాలు అంటూ అనేక శాఖల నిర్మాణం.

11. ధనవంతులు ఈ రోజుల్లో తమ రోగాలకి వైద్యం కోసం ప్రపంచంలో ఏ మూలకి వెళ్ళమన్నా వెళతారు. కానీ వారి దక్షత ఆయుర్దాయం దొరికేచోటు వెతకలేక్షపోతున్నారు.

12. తల్లి వున్న ఏ బిడ్డ అయినా ఒంటరితనంతో కృంగిపోతోందీ అంటే ఆ తల్లి క్షమించరాని నేరం చేస్తోందన్న మాటే.

13. పిల్లలు ఎక్కువగా తల్లితండ్రులతోనో, లేక తోడబుట్టినవారితోనో, తమ యీడు వారయిన స్నేహితులతోనో కాలం గడపాలి. వారి లేత వయసుకి - మనసుకి, సంబంధం లేని వారి మధ్య గడపకూడదు.

14. భర్తని యింటికి ఆలస్యంగా వచ్చాడని తప్పుపట్టే భార్య, భార్యని బానిసగా భావించే భర్త, వీళ్ళ మూలంగానే సంసారాలు 'యమకూపాలు'గా మారుతున్నాయి.

15. ప్రతి వాళ్ళకీ జీవితంలో ఒక 'రుచి' అనేది కావాలి. అది వారివారి వ్యక్తిత్వాలని బట్టి వుంటుంది.

నా మిత్రురాలు మాత్రం 'నా జీవితంలో రుచి-పచీ' ఏదీలేదు అంటూ వాపోతూంటుంది. కొంతమంది పులుసులో తెడ్డులా బ్రతుకుతారు మరి.

16. ఏ పువ్వూ, కాయ జన్మయిచ్చిన చెట్టులా వుండవు. అది యీ సృష్టి రహస్యం. పిల్లలు కూడా అంతే. మా పిల్లలు మాలా వుండాలి అని కొందరు తల్లితండ్రులు అమాయకంగా అనుకుంటారు. సృష్టి ధ్యేయం మనిషిని మనిషికి కార్బన్ కాపీలా తయారుచేయటం కాదు. మనిషి జీవితం విభిన్నంగా, విస్తృతంగా వర్థిల్లాలనేది యీ సృష్టి నిర్దేశిస్తోంది.

17. మనిషి ఉత్సాహంగా వుండాలంటే తనకి నచ్చిన వారి మధ్య సమయం గడపాలి.

18. వెస్ట్‌లో వివాహం వ్యక్తుల మధ్యకే పరిమితం - ప్రాధాన్యత. ఈస్ట్‌లో పెళ్ళి కుటుంబాలతో అనుబంధం.

19. మన సంఘంలో జీవితం అనేది వ్యక్తి స్వంతంకాదు. దానిమీద కుటుంబం అధికారం వుంటుంది.

20. వైవాహిక జీవితంలో తోడుగా కావాల్సింది శారీరక సౌందర్యం కాదు. మనసుని అర్థం చేసుకునే తోడు.

21. నువ్వు ఒక వ్యక్తిని ప్రేమిస్తే నీ దృష్టిలో ఆ వ్యక్తి అందం వేరు. లోకం దృష్టిలో ఆ వ్యక్తి అందచందాలు వేరు అని చెప్పినా నువ్వు వినవు.

22. ఈ జీవన సాగరం సక్రమంగా దాటాలంటే మనిషికి అపారమైన ఓర్పు ఎంతో అవసరం.

ఈ ప్రపంచం అనవసరంగా రెచ్చగొడ్తుంది. పిచ్చివాళ్ళని చేస్తుంది. మామూలు మనిషి ప్రపంచంతో యుద్ధంచేస్తూ హైరానాపడ్తాడు. అదే తెలివిగల మనిషి అయితే సింపుల్‌గా యీ ప్రపంచాన్ని నిర్లక్ష్యంగా, ఒక్క తిరస్కారమైన చూపు చూసి, తన పని తాను చేసుకుంటాడు.

23. ఒంటరిగా వున్న నేను దెబ్బతిన్న ఒక వీధి కుక్కపిల్లని చేరదీసి వైద్యం చేయించి సాకాను. అది పెద్దదయింది. దాన్ని చూసినప్పుడల్లా నేను చాలా గొప్పపని చేసానని గర్వపడేవాడిని. ఒకసారి దొంగలువస్తే అది మొరిగి, వారిని కరిచి నానాభీభత్సంచేసి, ఇరుగుపొరుగు లేచి వచ్చేంత గోలచేసింది. అప్పుడు నా గర్వం అణిగింది.

24. ఆధునిక యుగం మనిషికి ఎన్నో సౌఖ్యాలు అందించింది. ఫలితంగా అతని మనశ్శాంతిని కాజేసి వెళ్ళింది.

25. ఇప్పటి మనిషికి ఆడంబరం, అతిశయం, అహం ఎక్కువ. అవే అతన్ని అథఃపాతాళానికి తొక్కేస్తున్నాయి.

26. జీవితం అంతా పణంపెట్టి డబ్బు సంపాయించిన మనిషికి దాన్ని అనుభవించే తీరుబడి లేదు.

ప్రతివాళ్ళకీ సుఖపడటంలేదనే ఆరాటం.

అసలు సుఖం అంటే ఏమిటి ?

27. ఆత్మహత్యల్లో రెండు రకాలున్నాయి.
ఒకటి ఎదుటివారిని బెదిరించటానికి,
రెండోది ఆత్మహత్య తప్ప యింకో అవకాశంలేదు.

28. ఆమె చిరునవ్వు, శ్మశానంతో తీరని దుఃఖంతో కూర్చుండిపోయిన మనిషిని తీసుకువెళ్ళటానికి వచ్చిన ఆత్మీయురాలిలా వుంది.

29. జీవితంలో ఏ బాధకీ కృంగిపోవద్దు.

జీవనగమ్యంలో ఏ వీధిమలుపు దగ్గర ఏం వేచివుందో మనకి తెలియదు.

30. ఎండలు - వానలు - రాత్రి - చీకటి ఇది సృష్టి రహస్యం.

కష్టాలు - సుఖాలు ఇవి మనిషి జీవన రహస్యాలు.

31. ఒంటరితనం చాలా భయంకరమైనది. అందుకే ఎప్పుడూ నలుగురి మధ్య సందడిగా బ్రతుకు. చేతనయినంత నలుగురికీ సేవచేయాలని తాపత్రయపడు.

32. సేవచేస్తానన్నా, డబ్బు ఖర్చుపెడ్తానన్నా నీ దగ్గరకి చాలామంది వస్తారు. ఇవే నీవు కోరితే నీ దగ్గర ఒక్కరు కూడా వుండరు.

33. ఓర్మి వహిస్తే గొంగళిపురుగులాటి దశ నుంచి సీతాకోక చిలుక స్థితికి మనిషి ఎదగగలడు.

34. ఎక్కువగా నీతులు వల్లెవేసే వాళ్ళంటే నాకు భయం.

సెక్రటరీ

1. అప్పుడప్పుడూ దేవుడు వున్నాడు సుమా అని నమ్మం కలిగేలా జీవితంలో కొన్ని సంఘటనలు జరుగుతాయి.
దేవుడు అనేవాడు లేనే లేడు అనిపించే సంఘటనలూ యెదురవుతాయి.

2. మన ప్రార్థన ఒకదానికోసం.
మనకి దక్కే ఫలితం ఇంకోటి.

3. భిన్న భిన్న ప్రవృత్తులు, విభిన్న వ్యక్తిత్వాలు. అయినా ఒక ఆశయసాధనకోసం వారంతా ఒకే దిశవైపు చూస్తారు.

4. చాలామంది వారి భావాలు వారు దాచుకోలేరు, అది బలహీనతా లేక అహంకారమా ఏదైనా కావచ్చు.

5. దూరంగా మిణుకుమిణుక్కుమనే లైట్లని చూసి, నక్షత్రాలని తాగుబోతులే కాదు మూర్ఖులు కూడా అనుకుంటారు.

6. కొంతమంది వాళ్ళు అబద్ధాలు చెబితే వారి స్వభావం అని సరిపెట్టుకోవచ్చు.
కానీ ఎదుటివాళ్ళని చెప్పమంటారు. అక్కడే తంటా వస్తుంది.

7. చదువు - సంస్కారం ముసుగువేసుకున్న క్రూరులు, రాక్షసులు ఈ ప్రపంచంలో చాలా మంది వున్నారు.

8. ఈ రోజుల్లో ఆడపిల్ల ఉద్యోగానికి వెళ్ళటం అంటే కొన్ని సందర్భాల్లో తోడేళ్ళ మధ్యకి పాదం పెట్టినట్టే వుంటుంది.

9. మనిషికి భోగభాగ్యాలు లేకపోతే ఫర్వాలేదు.
కనీసం వేళకి తినటానికి ఇంత తిండి, తలదాచుకోవటానికి గూడు వుండి తీరాలి.

10. ఉద్యోగాలు చేసే చాలామంది ఆడపిల్లలు తమకి బయటప్రపంచంలో ఎదురయ్యే చేదు అనుభవాలని యింట్లో వారికి చెప్పరు.

11. ఈ రోజుల్లో యువతీ యువకులు చదువుకుని పరీక్షలు రాయటానికి సగం శక్తి, ఉద్యోగాలు నిలుపు కోవటానికి మిగతాశక్తి ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

12. కొంతమందికి డబ్బు శోభనిస్తే, మరికొంతమందికి వారి వ్యక్తిత్వం శోభనిస్తుంది.

13. మనిషిలో వ్యాపార సరళి - వ్యక్తిత్వ సరళి జోడుగుఱ్ఱాలు. ఇవి సాధారణంగా చెరో దిక్కుకి పరుగెడ్తాయి. రెండింటినీ ఒకే దిక్కుకి పరుగెత్తించగల వ్యక్తి ఉత్తమ వ్యాపారవేత్త అవుతాడు.

14. ఈ రోజుల్లో ఉద్యోగాలు ఆడపిల్లలని సగం యంత్రాలుగా మారుస్తున్నాయి.

15. ఇంట్లో నిరంకుశుడు అయిన భర్తతో వేగలేక ఆడపిల్ల ఉద్యోగంలో చేరి ఆర్థిక స్వేచ్ఛ లభించిందని ఆనందపడింది. కానీ, అక్కడ అధికారి రూపంలో ఒక యువకుడు యెదురయాడు.

16. ఇల్లుకంటే గుడి పదిలం అన్నారు పెద్దలు.
పెళ్ళికంటే ఉద్యోగమే నా జీవితానికి పదిలం అంటోంది యీనాటి యువతి.

17. స్త్రీ ఉద్యోగం చేయటం నేర్పటంతో యింటి గాడిదచాకిరీ మూట సగం పురుషుడి నెత్తిమీద పడింది.

18. ఇదివరకు అమ్మాయి ఇల్లు చక్కదిద్దుకోగలదా అని పెళ్ళి చూపుల్లో అడిగేవారు.
ఇప్పుడు ఉద్యోగం స్థిరంగా చేయగలదా లేదా అని ఆరా తీస్తున్నారు.

19. రాజశేఖరంలాంటి వ్యక్తి జయంతి జీవితంలోకి రావటం చాలా అదృష్టం. కానీ ఈ అదృష్టం ఎంతమంది ఆడపిల్లలకి లభిస్తుంది ?

20. సగటు ఆడపిల్ల హీరో భర్తగా రావాలని కోరుకోదు, వచ్చిన భర్తనే హీరోగా చూసుకుంటుంది.

21. మనం ఎంతవరకూ అర్హులమో అంతవరకే భగవంతుడు మనకి ప్రసాదిస్తాడు. ఆపైన దొరకాలని అనుకోవడం దురాశ.

22. ఈ రోజుల్లో చదువు - ఉద్యోగం వున్న ఆడపిల్లలో పోట్లగిత్తని చూస్తున్నాం అంటూ వాపోతున్నారు మగవాళ్లు.

23. బ్రతుకంటే ఏ ఆకర్షణ లేకపోయినా యింటిలో అడుగడుక్కీ సంసారంలో పరీక్షలు ఎదురవుతున్నా ఆమె చిరునవ్వుతో వాటిని జయిస్తోంది. ఎందుకంటే నా జీవనప్రవాహంలో ఇల్లు నాకు ఆసరా అంటుంది.

24. మనసు ఒక్కోసారి కోతిలా మారుతుంది. ఎంత పట్టుకుని ఆపినా ఆగకుండా కోర్కెల కొమ్మలవెంట పడి గెంతుతూ వుంటుంది.

25. ప్రతి మనిషికీ బాల్యం సంతోషంగా గడిచినా గడవకపోయినా యవ్వనంలో కొన్ని అనుభూతులు చిరస్మరణీయంగా మనసులో ముద్రవేయాలి. అవి గుర్తువస్తే వెన్నెల్లో కూర్చున్నట్టు సెలయేరు సంగీతం వింటున్నట్టు అన్పించాలి. జీవిత చరమాంకంలో యీ అనుభూతులు చాలు అని తృప్తిచెందేలా వుండాలి.

26. ఇదివరకటి ఆడపిల్లకి ఇల్లే సర్వప్రపంచం.
ఇప్పుడు ఉద్యోగం చేసే ఆడపిల్లకి యిల్లు ఒక తలదాచుకునే గూడు.

27. చెడుతో స్నేహం చేస్తే ఆ మసి నీకు అంటక తప్పదు.

28. చాలా మంది స్త్రీలు ఎంతో అదృష్టవంతులు. బైటప్రపంచంలో సమస్యలు - యుద్ధాలు - ఉన్మాదాలు, రాజ్యాలు పతనం వారికి పట్టవు. ఉష్ట్రపక్షుల్లా సంసారం అనే ఇసకలో తల దూర్చేసి బ్రతుకుతారు.

29. మా అమ్మ సంపాదించింది. ఇంట్లో బానిసలా బ్రతికింది. సానుభూతిగా అనుకుంటుంది. ఈ రోజుల్లో ఉద్యోగం చేసే ఆడపిల్ల నా కూతురేం సుఖపడులోంది. మగాడు చేయాల్సిన చాకిరీ నెత్తినేసుకుని గొడ్డుచాకిరీ చేస్తోంది అని తల్లి జాలిపడ్తుంది.

30. హద్దుమీరిన చనువు అసహ్యాన్ని కలిగిస్తుంది.

31. నిన్నటితరం స్త్రీ గుళ్ళూ గోపురాలు అంటూ భర్తవెంట తీర్థయాత్రలకి వెళితే, ఈనాటి ఆడపిల్ల "హాలీడే" అంటూ సంసారాన్ని వెంటేసుకుని తిప్పుతోంది.

32. బైటికి వెళ్ళి ఉద్యోగంచేసే ఆడపిల్లకంటే ఇంట్లో వుండి, భర్తచేత ఆ చాకిరీ చేయించి, తన అధికార చక్రం తిప్పే స్త్రీయే చతురురాలు.

33. ఈ రోజుల్లో అన్నీ వున్నా ఈ మనుష్యులు అన్నింటికీ లిమిట్ అంటారు. సంతానానికి - తిండికి - డబ్బు ఖర్చుకి - చివరకు ఆత్మీయతానురాగాలకి కూడా లిమిట్. ఇదే వారి మంత్రం.

34. ఈ రోజుల్లో ఆడపిల్ల అన్ని సమస్యలనీ కరాఖండిగా పరిష్కరించుకోగలదు. ఒక్క ప్రేమ విషయంలోనే ఆమె బలహీనురాలు.

35. ఏ మనిషి అయినా బంగారు పిచ్చుకగా అన్పిస్తే ఆ మనిషి చుట్టూ విషవలయాలు వుంటాయని అర్థం చేసుకోవాలి.

36. ఈ ప్రపంచంలో నిరాశావాదులు ప్రేమని నమ్మరు.
అదంతా 'కల, భ్రమ' ఒట్టి ఊహ అని కొట్టేస్తారు.

37. కాలం అనేది ఒకటి వుందని, దాని చేతుల్లో మనం కీలుబొమ్మలం అని, మనల్ని నవ్వించేది, ఏడిపించేదీ అదేనని మనలో చాలామంది మర్చిపోతాం.

38. డబ్బు మూగది, చెవిటిది, అది నిన్ను అర్థంచేసుకోదు, నీ మాట వినదు, నువ్వే అర్థం చేసుకోవాలి.

39. డబ్బుని గూర్చిన అవగాహనని పెద్దలు చిన్నప్పటినుంచీ పిల్లలకి నేర్పాలి. ఎందుకంటే డబ్బు అనేది వారికి జీవితం వెంట వుండే తోడు.

40. డబ్బుని నువ్వు గౌరవిస్తే - ఈ ప్రపంచం అంతా నిన్ను గౌరవిస్తుంది.

41. చాలామందికి డబ్బుని గురించిన అవగాహన వుండదు. డబ్బు విలువ వున్నప్పటికంటే అది పోయినప్పుడే ఎక్కువ తెలుస్తుంది.

42. డబ్బుతో ఈ రోజుల్లో పొందని సుఖం లేదు ఇన్ని వరాలు ఇచ్చే ఆ శక్తిని మనం గౌరవించాలి కానీ అశ్రద్ధ చేయకూడదు.

43. డబ్బు కొంతమందికి వరం. మరికొంతమందికి శాపం.

44. త్యాగాలతో మొదలయిన వివాహాలు ఆనందంకంటే అహంకారాన్నే కలగచేస్తాయి.

45. పెళ్ళికాగానే ధనం కలిసివస్తే ఆ యిల్లాలికి భర్త - అత్తమామలే కాదు సంఘం కూడా గౌరవిస్తుంది. అందుకే గుమ్మంలో వధువు అడుగుపెట్టగానే "మా యింటి మహాలక్ష్మి" అంటూ ముందే పట్టం కడ్తారు.

46. "నాకు ధైర్యం ఇవ్వు, ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనే శక్తి నివ్వు" అని నా మనసుని నేను కొన్ని సమయాల్లో అర్థిస్తూంటాను.

47. అందం - అంద వికారం అన్న ప్రశ్నకాదు, ఒంటరిగా బ్రతికే ఆడపిల్లల జీవితాలు ఎప్పుడూ అభద్రతకి గురి అవుతూనే వుంటాయి.

48. పై చదువులు చదివాను, డబ్బు సంపాయించాను, పెద్ద యిల్లు కట్టుకున్నాను. పెళ్ళి చేసుకుంటే యిదంతా ఒక మగవాడికి పంచాలని పెళ్ళి చేసుకోలేదు. కానీ వూరిలో మగవాళ్ళంతా నా యింటిలోకి తొంగి చూడటం మొదలుపెట్టి నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు.

49. భయం - దిగులు - ఇవి కాకుల్లాటివి. ధైర్యం అనే కర్రతో అదిలించాలి.

50. కాస్త ఆర్థికస్థితి కల్పిస్తే చాలా మంది ఆడపిల్లలు చాలా సుఖంగా బ్రతికేస్తారు.

51. ఈ రోజుల్లో ఆడపిల్ల కట్టుకున్న భర్తకంటే చేసుకునే ఉద్యోగాన్నే ఎక్కువ నమ్ముకుంటోంది.

విజేత

1. కన్నతల్లి ప్రేమ పుష్పక విమానం లాంటిది. అందులో ఎంతమంది ఎక్కినా మరొకరికి చోటు వుంటుంది. పెంచిన ప్రేమ అలా కాదు. అది ఒరలాటిది ఒక ఒరలో రెండు కత్తులు ఎప్పుడూ యిమడవు.

2. ఈ భూమ్మీద అప్పుడే పడిన బిడ్డకి, గొప్ప బీద తారతమ్యం కాని, నీతి – అవినీతి కాని తెలియదు.

3. జీవితంలో భయంకరమైన అనుభవాలు రాకూడదు. ఒకవేళ వచ్చినా వాటి ప్రసక్తి అక్కడితో అంతం అవాలి. మళ్ళీ మళ్ళీ తలుచుకునే స్థితివస్తే మనిషి మానసికంగా అంతులేని వ్యధని అనుభవిస్తాడు.

4. బుద్బుదప్రాయం అయిన యీ జీవితం కోసం ఎందుకింత వెతుకులాట. దేనికోసం యిన్ని రాగద్వేషాలు ? ఉన్నన్నాళ్ళూ మనం సుఖంగా వుండి, మన చుట్టూ వున్న వాళ్ళని సుఖపెడదామని అనుకున్నా యీ మనుష్యులు కుదరనివ్వరు.

5. శరీరాన్ని జయించిన వాడికంటే మనసుని జయించిన మగవాడే విజేత.

6. నూటికి 99 మంది పురుషులకి స్త్రీ శరీరమే తప్ప మనసు అవసరం లేదు.

7. ఎదుటివ్యక్తిని శాసించటానికి ఆత్మీయతని మించిన అర్హతయింకేదీ వుండదు.

8. ఈ ప్రపంచంలో మనిషి దగ్గర గుర్రానికి వున్న విలువ గాడిదకి లేదు. గాడిద నా చేత యింత చాకిరీ చేయిస్తున్నారు, నన్ను ముద్దు చేయటం లేదని ఎంత ఓండ్రపెట్టినా తన్నులే తప్ప యింకేం మిగలదు.

9. మనిషికెప్పుడూ తన నమ్మకం మీద గుడ్డి విశ్వాసం పనికిరాదు.

10. భగవంతుడు ఒక్కోసారి మనం వూహించిన దానికి పూర్తి వ్యతిరేకంగా జరిపిస్తాడు. ఆయన ఆలోచనలు ఆదేశాలూ అనుసరించటమే తప్ప, ప్రశ్నించకూడనివి.

11. అప్పుచేయటం సులువు. తీర్చటం చాలా కష్టం.

12. డబ్బుని దైవంగా కొలిచే మనిషి చుట్టుపక్కలకి దరిద్రం రాలేదు.

13. అనారోగ్యంతో తీసుకునే మనుష్యుల్ని, పశుపక్షాదులని దయతో చూడని మనిషి రాక్షసుడే.

14. ఎదుటివారి యిల్లు కాలిపోతుంటే బిందెడునీళ్ళు పోయాలని ఆరాటపడని మనిషి సంఘానికి చాలా చేటు.

15. భక్తికన్నా కరుణ, దానం కన్నా ప్రేమ చాలా గొప్పవి.

16. ఈ సంసార జైలులో మనుష్యులంతా ఖైదీలులా జీవితశిక్ష అనుభవిస్తున్నట్లుగా వుంటారు.

17. బంధుత్వాలు మంచివే. కానీ స్వార్థంతో కూడిన బంధువుల్ని రాబందులుగా భావించి దూరంగా వుండాలి.

18. ధనానికి ఆడంబరం వాచాలత్వం ఎక్కువ. దరిద్రానికి మూగతనం, ఒంటరితనం ఎక్కువ.

19. మనిషి మనసు మహా చిత్రమైనది. ఒంటిరిగావున్నా ఒక్కోసారి హాయిగా అద్భుతంగా వుంటుంది. ఒక్కోసారి పదిమందిలో వున్నా ఏకాకిగా ఎడారిలో ఒంటరిగా దిక్కులు చూస్తున్నట్టుగా మూగగా వుంటుంది.

20. నీకు అన్యాయం చేసిన వ్యక్తిమీద పగపెంచుకుని ప్రతీకారం తీర్చుకుందా మని, నీ జీవిత కాలం వృధా చేసుకుంటావా ? అదొక దురదృష్టం లేక ఒక యాక్సిడెంట్ అని, విదిలించేసి నూతన జీవితం నిర్మించుకుంటావా?

కలల కౌగిలి

1. అతన్ని చూస్తే సన్నగా, పొట్టిగా, పిడికెడు మనిషిలా వున్నాడు. కానీ కంఠం వింటే భూమి నుంచి ఆకాశం నిండేంత మనిషిగా అన్పిస్తున్నాడు.

2. భగవంతుడు ఒక్కో మనిషికి ఒక్కో ప్రతిభ యిస్తాడు.

3. అనుమాన చిత్తుడికి ప్రపంచంలో ప్రతిదీ వక్రంగా కన్పిస్తుంది.

4. పెళ్ళి అంటే శారీరక వాంఛలు సాంప్రదాయ పద్ధతిలో తీర్చుకోవటమేగా అని నా నాస్తికమిత్రుడు అంటాడు.

5. మన దేశంలో శాంతిభద్రతలు సుస్థిరంగా లేకపోతే, ప్రజలకి ఎన్ని అరాచకాలు యిబ్బందులపాలు పడాల్సివస్తుందో ఒక వీడియో తీసి చూపించాలి ఈ అంశం పాఠ్యపుస్తకంలో ముఖ్యభాగంగా చేర్చాలి.

6. మనుష్యులు అందరూ ఎలాటి వాళ్ళో నీ తల్లితండ్రులు, ఉపాధ్యాయులు నీకు సుశిక్షత యివ్వకపోతే నీకు జీవనగమనంలో అన్నీ గోతులే.

7. అతను పొడుగ్గా, కొంగలా వుంటాడు. ఇంకో అతను తేలులా చాలా పొట్టిగా వుంటాడు. జీవనగమనంలో అతనిది దూరదృష్టి ఇతనిది దగ్గర దృష్టి. ఇద్దరికీ అందుకే విడదీయరాని స్నేహం.

8. చాలా వరకూ మనం గాఢంగా ప్రేమిస్తున్నాం అనే ప్రేమ మనకి వీలుగా వుండాలని ఆశపడేది.

9. ప్రేమ గురించి అందరూ చాలా చాలా మాట్లాడేస్తారు. నిజమైన ప్రేమకి అనుభూతే తప్ప భాష లేదని చాలా మందికి తెలియదు.

10. ప్రేమలో ఐక్యతే తప్ప శూన్యం లేదు.
వుందని నువ్వు అనుకుంటే నీ ఆలోచనలో ఎక్కడో అవిటితనం వుంది.

11. ప్రేమ సేదదీరుస్తుంది. ధైర్యం యిస్తుంది. తోడుగా నిలుస్తుంది.

12. ప్రేమని భాషలోకి అనువదిస్తే, దాని పవిత్రత తగ్గుతుంది అని నువ్వు అంటావు. భాష అనే ఉదకం పోస్తేగానీ దానికి పవిత్రత రాదంటాను నేను.

13. వ్యక్తీకరించలేని ప్రేమ అడవిగాచిన వెన్నెల.

14. నాకు నచ్చిన వాడిని చేసుకోవడం ఒక పద్ధతి.
అమ్మావాళ్ళు చూసిన ఎవడినో ఒకడిని చేసుకుని రాజీపడటం రెండో పద్ధతి, నాకు రెండూ బాగానే వున్నాయి. కానీ నమ్మకం కలగక డైలమాలో పడ్డాను.

15. అవతలివారు మన మనసు అయినా తెలుసుకోవాలి లేక మనమైనా మనసువిప్పి మాట్లాడాలి. ఈ రెండూనా జరగపోతే కలిసి జీవనగమ్యంవైపు అడుగులు వేయటం కుదరదు.

16. అపరిచితులతో పరిచయం పెంచుకోకూడదు. ఇది నిన్నటి స్త్రీ మాట.

అందరితో కలిసి మెలిసి వుండాలి. ఎవ్వరినీ మనకి దగ్గరగా రానీయకూడదు. ఇది ఈ నాటి యువత నమ్మకం.

17. గోరంతదీపం కొండంత వెలుగిస్తుంది.
కాస్తంత ప్రేమ జీవితానికే ఆలంబన యిస్తుంది.

18. ఇంటిపనులు చూసుకోవటం, ఇంట్లో వాళ్ళ అవసరాలు గమనించటం ఒకరిపట్ల ఒకరు అభిమానంగా మసలటం, జీవితానికి కావాల్సినవి నింపాదిగా సమకూర్చుకోవటం, ఇంతకంటే మృదుమధురమైన జీవన సంగీతం మనిషికింకేం వుంటుంది.

19. గొడవలు లేని యిల్లు - అప్పులు లేని జీవితం.

ఇంతకంటే మనిషికి స్వర్గం యింకేదీ లేదు.

20. నువ్వు ఒక పరమ మూర్ఖుడివి
నువ్వు మాట్లాడే భాష డబ్బు.
నువ్వు చూసే ప్రేమ డబ్బు.
నువ్వు పీల్చే వూపిరి డబ్బు.
నువ్వు ఈ సంఘానికి చెదపురుగువి.

21. ప్రేమ ఈ 'డబ్బు' అనే చిత్తుకాగితాల కంటే ఎంతో విలువైనది.

22. నా నుంచి నా ప్రేమను దోచుకోగలవు నువ్వు.
నా నుంచి నా మృత్యువుని కాజేయలేవు.

23. పిల్లలకి చిన్నప్పటి నుంచీ డబ్బు విలువ - సాటి మనిషి విలువ తల్లితండ్రులు నేర్పాలి. వారికి టైమ్ లేకపోతే, అలాటివి నేర్పే శిక్షణాలయాలకి పంపాలి.

24. మా పిల్లల్ని చాలా పెద్ద చదువులు చదివించాం అంటారు తల్లి తండ్రులు గర్వంగా.

"మీ పిల్లలకి ఎంత పెద్దమనసు నేర్పావు" అని అడగాలి మనం.

25. ఒక్కొక్కరి జీవితం అంతే

అడగడుక్కీ కష్టాల అఘాతాలుంటాయి. జాగరూకతతో వాటిని దాటగలగాలి కానీ వాటిల్లో పడిపోతానేమోనని భయపడకూడదు. నిరాశ చెందవద్దు.

26. చచ్చిపోయినవారి గతం చెప్పి బ్రతికి వున్న వారిని శిక్షించటం న్యాయం కాదు.

27. ఈ ప్రపంచంలో న్యాయం అన్యాయం ఋజువులకి పల్చటి తెర అడ్డం.

28. కొంతమంది అభాగ్యులకి చిన్న జీవితంలోనే దురదృష్టం కాటేస్తుంది.
ఇది అర్థం చేసుకుంటే వారిమీద రవ్వంత కూడా కోపం రాదు

29. జీవితంలో ఒక్క పాములపుట్ట ఎదురయితే ధైర్యంతో అందులో పాముని ఎదుర్కోవచ్చు. కానీ చుట్టూ పాముల పుట్టలే అయితే నిబ్బరించుకోవటం కష్టం.

30. మనిషికి కన్న బిడ్డలతో వైరం కంటే ఘోరమైన దురదృష్టం యింకోటి లేదు.

31. తల్లితండ్రులూ పిల్లలూ పాలు - నీరులా కలిసిపోయేవారు ఇదివరకు. ఇప్పుడు ఉప్పు - నిప్పులా తయారయారు.

32. తలితండ్రులు పిల్లల కోసం తాము ఎన్నో సుఖాలని వదిలేసామంటారు.
పిల్లలు 'మేము కోరలేదు' అది మీ నిర్ణయం అని తిరస్కరిస్తారు.

33. ఒకరికోసం సుఖాల్ని ఒదులుకో. కానీ ఆ సంగతి నువ్వెప్పుడూ గుర్తించు కోవద్దు.

34. ఈ రోజుల్లో కొంతమంది పిల్లలు మా తల్లితండ్రులకంటే ఆ పశువులు - పక్షులు నయం. పిల్లలు పెద్దవగానే వదిలేస్తాయి. వీరు మమ్మల్ని జలగల్లా వదలటం లేదు అంటారు.

35. నాకు నా తల్లితండ్రులమీద ఎంత ప్రేమ వుందో, నా భార్యాపిల్లల మీదా అంతే వుంది. కానీ ఈ యిరువురూ శత్రువుల్లా నన్ను గెలిచుకోవాలని యుద్ధం చేస్తున్నారు. నేనేమన్నా ఒక ఎకరం పొలాన్నా ? ఒక దేశం భూభాగాన్నా.

36. కొంతమంది తల్లితండ్రులు పిల్లలు ఈ రోజుల్లో గ్లాసు - నీరులాగా వుంటున్నారు. అవి కలుస్తాయి. కానీ అనుబంధం లేదు. వీరూ అంతే.

37. నా కెవరైనా జీవితం గురించి క్షుణ్ణంగా మంచి చెడులు నేర్పి వుంటే, నేనీనాడు జైలు కటకటాలు లెఖ్ఖపెడుతూ కూర్చుండే వాడిని కాదు.

38. ఈ మానవుడెంత స్వార్థపరుడు. నోరులేని ఆవు నుంచి పాలు పిండుకుంటాడు. కదలలేని చెట్టు నుంచి కాయలు కోసుకుంటాడు.

39. అప్పుడప్పుడు యీ మనిషి చేసే దురాగతాలు సహించలేక యీ ప్రకృతి గర్జిస్తుందా అన్నట్టు యీ భూకంపాలు, పెనుతుఫానులు.

40. బురదనీరులో నుంచి వచ్చిన కలువపూవులాగానే, దుర్మార్గుడి కడుపున సన్మార్గుడు పుట్టవచ్చు.

41. మనిషి వేయి సంవత్సరాలు ఆయుష్షు వున్నా అతనికి జీవించాలనే ఆశ చావదు.

అతని ప్రలోభాలు - కోర్కెలు అలాంటివి.

42. దుర్మార్గులవల్ల యీ ప్రపంచం నివాసయోగ్యం కాకుండా పోతోంది.

ఋతువులు నవ్వాయి

1. ఈ రోజుల్లో యీ కాపురాలు చేస్తున్న యీ ఆడపిల్లల్లో ఎంత మంది ఆనందంగా సుఖశాంతులతో వుండగలుగుతున్నారు.

2. ఈతరం ఆడపిల్లల్లో చదువు వుంది. ఆలోచనాశక్తి వుంది. కావాల్సిందల్లా మనోబలం ఒక్కటే.

3. ఈ ప్రపంచానికి మనిషి బైటకి ప్రదర్శించే వేషభాషలే కావాలి వారి ఆంతర్యం అవసరం లేదు.

4. కొంతమంది యువతుల వదనాలు చూస్తే జీవితంతో పోరాడి అలిసిపోయి, ఆవేదనా శిధిలాలుగా వుంటాయి.

5. మనిషి జీవించినంత కాలమూ కాకపోయినా కనీసం కొంత కాలం అయినా నిశ్చింతగా గడపగలగాలి.

6. చెట్టు మనుష్యులకి నీడ యిస్తున్నాను కదా అని సంబరపడింది. తలెత్తి చెట్టుని తదేకంగా చూసిన ఆ మూక గొడ్డళ్ళు తీసి తలో కొమ్మా నరికి పట్టుకుపోయారు. "ఇంత అన్యాయమా ప్రభూ" అంటూ దేవుడిని ఏడుస్తూ ప్రశ్నించింది చెట్టు.

7. ప్రతి మనిషికీ జీవితంలో ఎక్కడో ఏదో విషాదం వుండి వుంటుంది.

8. కొంతమందికి డబ్బు సంపాయించటంలో ఆనందం.
మరి కొంతమందికి ఖర్చుపెట్టటంలో సంతోషం.
ఇంకా కొంతమందికి దాన్ని కూడబెట్టి దాచటంలో పరమానందం.

9. వచ్చిన సమస్యని నిబ్బరంగా ఎదుర్కోవాలంటే మనిషికి ఎంతో ఆత్మ సంయమనం అవసరం.
దేనికీ తొందరపడకూడదు. మాట జారకూడదు.
మనసులో మాట ఎదుటివారికి తెలియనీయకూడదు.

10. కష్టాలని మొండిగా ఎదుర్కోవటం, ఈ లోకం నవ్వుతున్నా, లక్ష్యపెట్టక పోవటం, అది కూడా ఒక రకమైన ధీరత్వ లక్షణమే.

11. శత్రువులమీద ఉరుములేని పిడుగుల్లా విరుచుకుపడ్తారు కొంతమంది. కొంతమంది వర్షం కురవని ఉరుముల్లా గర్జించి వదిలేస్తారు.

12. ఈ ప్రపంచంలో కష్టపడి సంపాయించిన వారికే డబ్బు విలువ అర్థం అవుతుంది. అది లేని వాళ్ళు దానకర్ణుల్లా కబుర్లు చెబుతారు.

13. అర్థమైనవాళ్ళకి ప్రేమ వియోగం కంటే డబ్బు వియోగమే చలా నరకం.

14. వజ్రం తనకి తాను రాయినే అనుకుంటుంది.
చూసేవాళ్ళకే దాని విలువ తెలుస్తుంది.
కళాకారుడి ప్రతిభ కూడా అంతే.

15. ఏ మనిషీ ఈ లోకానికి పూర్తిగా అర్థంగాడు.
పైకి కన్పించే అతని ప్రవర్తనకి, అతని అసలు వ్యకిత్వానికి అంత గట్టిగోడ అడ్డు వుంటుంది.

16. హాయిగా నవ్వించగల మనిషి తోడువుంటే నిశ్శబ్దం ఆ చుట్టుప్రక్కలకి రాలేదు.

17. హాయిగా కూర్చుని పుస్తకం చదువుతూనో, సంగీతం వింటూనో కాలం గడపగలిగిన స్థిమితంగల మనిషికంటే అదృష్టవంతుడు యింకెవ్వరూలేరు.

18. ఇన్నాళ్ళూ నేను భయం అనే పంజరంలో ఒక పిరికిదానిలా కూర్చున్నాను. బైటకివస్తే ఈ అనంతసృష్టిలో నాకు చోటు ఎక్కడా అని సంశయం రానేలేదు. ఇప్పుడు అర్థమైంది. నా గూడు నేను నిర్మించుకోవటానికి భగవంతుడు పక్షికి రెక్కలు యిచ్చినట్టే నాకు రెండు కాళ్ళు, రెండు చేతులు యిచ్చాడని.

19. ఇన్నాళ్ళూ నాకోసం నా జీవితం అనుకోకుండా నా కుటుంబంకోసం బ్రతికాను, భార్య పోయింది. పిల్లలు దూరంగా వెళ్ళిపోయారు. నీ కోసం నువ్వేం చేసుకున్నావు అనే ప్రశ్న భూతంలా నా ఎదురుగా వచ్చి నిలబడింది.

20. మనిషిని గురించిన జ్ఞానం మనసులో వుండాలి. అది లేనపుడు నువ్వు జ్ఞాపకంగా "బహుమతి" యిచ్చినా దండగే.

21. ఆడవారి గురించి అపవాదులు మొదలయితే అవి పుడ్తూనే రెక్కలు చాచి, గాలికంటే వేగంగా పరుగులుదీస్తాయి.

22. సృష్టి జరిగి ఇన్నికోట్ల సంవత్సరాలయింది.
ఈ స్త్రీ పురుషుడు ఇంకా ఒకరిని ఒకరు అర్థం చేసుకోలేక పోతున్నారెందుకు? అంత అర్థంగాని సమస్య వీరిలో ఏముంది?

23. వివాహం జరుగుతుంటే వేద ఘోష.
జంట విడిపోతే జనం ఘోష.

24. ఈ ప్రపంచంలో నా అనేవారెవ్వరూ లేరు. కాని వాళ్ళకంటే దయనీయులు యింకెవ్వరూ లేరు.

25. వ్యక్తీకరించలేని ప్రేమ అడవిగాచిన వెన్నెల.

26. ఈ కాలంలో మనిషి పనిచేసే యంత్రం అయిపోయాడు. ఈ మానవయంత్రానికి అన్నం ఏం తింటున్నాడో గుర్తుండదు, కంటి నిండా కమ్మటి నిద్రరాదు, భార్యాబిడ్డలతో కులాసాగా కాలంగడిపే తీరుబడి వుండదు. ఎప్పుడూ పనీ పనీ అంటూ డబ్బుచేతిలో కీలు బొమ్మగా తిరుగుతున్నాడు.

27. ఈ రోజుల్లో డబ్బు చేతి రిమోట్ కంట్రోల్‌లో మనుష్యుల జీవితాలున్నాయి.

28. మరుక్షణంలో తనకి ఏం ప్రాప్తంవుందో తెలియని మనిషి స్వర్గానికి నిచ్చెనలు వేసుకుంటున్నాడు.

29. ధనదాహం, అధికార దాహం మానవుడిని దానవుడిగా మారుస్తున్నాయి.

30. రక్తపింజరిలా మనిషి యుద్ధోన్మాది. ఈ మనిషిని మార్చాలని లక్షల సంవత్సరాల నుంచి, మంచి మనుష్యులు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ప్రయోగ పరిధిలోనే వున్నాయి.

31. ఈ ధరిత్రి అంతా శాంతి పవనాలు వీచేంతవరకూ మనిషి మనసులో అందోళన అంతరించదు.

మనోభిరామం

1. ఒంటరితనంతో కృంగిపోతున్నావా ?
నీకోసం యీ ప్రపంచంలో పుస్తకాలనే ప్రియనేస్తాలు వున్నాయి.

2. అతను చిన్నప్పుడు చీకటి పడితే బైటకి వెళ్ళటానికి భయపడేవాడు. ఇప్పుడు పదిమంది గూండాలు తన్నటానికి వచ్చినా చెక్కు చెదరడు. జీవితం అలా మార్చేసింది అతన్ని.

3. బోలెడంత భవిష్యత్తు వుందనే ఆశతో, టైమ్ లేనివాడిలా ఓవర్ వర్క్ చేస్తున్నాడు మనిషి.

4. మనిషి కష్టపడాల్సిందే, కాదనను. కానీ దానికి లిమిట్ వుండాలి.

5. పుట్టిన ప్రతీ మనిషీ తనకి రక్షణ యిస్తున్న ఈ సంఘానికి కాస్తో కూస్తో ఉపయోగపడాలి.

6. కుటుంబ బాధ్యత, సంఘ బాధ్యత, దేశ బాధ్యత నిర్వర్తించని మనిషి నీడ కూడా నేను భరించలేను.

7. జీవితంలో లా డిగ్రీ తీసుకున్న కొత్తల్లో డబ్బు కంటే న్యాయం కోసం పోరాడాను. వయసు పెరిగినకొద్దీ న్యాయం కోసం పోరాడాలి అంటే డబ్బు సాంపాదన ముఖ్యం అని తెలుసుకున్నాను.

8. నేను అతన్ని న్యాయంకోసం పోరాడగల ధీరుడుగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. చివరికి అన్యాయాల అంతస్థుల మీద నిలబడిన జడ్జీ భార్యగా మిగిలాను.

9. అతను పెళ్ళికాకముందు తల్లితండ్రుల కష్టం మీద దర్జా వెలగబెట్టేవాడు. పెళ్ళి అయింతర్వాత మామగారి కట్న కానుకలతో బాగా ఎంజాయ్ చేశాడు. తర్వాత భార్య ఉద్యోగస్థురాలు అవటంతో జీవితం వెలిగింది.

10. కొంతమంది ఎదుటివాళ్ళని సెంటిమెంట్స్‌కి కట్టిపడేసి తమ అవసరాలకి ఉపయోగించుకుంటారు.

11. భర్తకి వేరే స్త్రీ మీద మమకారం లేదని ఋజువు అయేసరికి ఆమె చాలా ఆనందపడింది, కానీ నీ భర్త బాబాల సాంగత్యంలో పడ్డాదని సైకియాట్రిస్ట్ చెప్పగానే ఆమె యింకా పెద్ద ఆపదలో పడ్డానని గుర్తించింది.

12. ఆమె భర్తకి ఆనందం యివ్వటమే తన జీవనధ్యేయం అనుకుంది. అతను కూడా అది తన జన్మహక్కు అనుకున్నాడు.

13. ఆమె భర్త కనుసన్నల్లో బ్రతికే ఉత్తమ యిల్లాలిని అనుకుంటుంది.

అతను ఆమెకీ, తన పెంపుడు కుక్కకీ తేడాలేదని విసుక్కుంటూ వుంటాడు.

14. కొంతమంది "ప్రేమా" అంటూ చెప్పలేని నరకం పెడ్తారు.

15. స్నేహం, ప్రేమ తొందరగా ఏర్పరచుకుంటే, అంతే తొందరగా విడిపించు కోవాల్సి వస్తుంది.

16. అతను ఆమె కళ్ళముందు కమ్మటికలలు పరిచాడు.

వివాహం అయిన తర్వాత ఆమెకి తెలిసింది, అవి పునాది లేని సౌధాలు అని.

17. ఆమె మనసుని తోలుబొమ్మని నచ్చినట్టు ఆడించే అధికారం దొరికినందుకు అతనికి ఆనందంగానూ, మరెంతో అహంగానూ వుంది.

18. కొంతమంది దురాగతాలు మానవత్వానికి వేస్తున్న సంకెళ్ళుగా వుంటాయి.

19. మనిషికి కుటుంబం అనేది ఎంత అవసరమో అంత యిబ్బంది కూడా.

మనకి తెలియకుండానే ఒకరి జీవితాల్లోకి ఒకరు అల్లుకుపోతాం. ఈ కుటుంబం అనే గడబిడ మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. "నేను" అనే ఉనికిని నాశనం చేస్తుంది.

20. దాంపత్య జీవితంలో పోట్లాటలు, అలగటాలు, బ్రతిమలాటలు, రాజీలు వుంటేనే ఆనందం.

21. ఈ ప్రపంచంలో నాకు అన్నింటికంటే అందమైనది, అపురూపమైనది నా ఆకలి తీర్చే "అన్నమే", దాని తర్వాతనే మిగతా అన్నీ.

22. కొంతమందికి జీవితం గురించి కలలూ - ఆశలూ ఉండవు.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తారు. వారి జీవితాలకి ఏది ఎంత అవసరమో తెలుసుకుని దానివరకే కష్టపడతారు.

23. నా గురువులు నాకు ఇచ్చిన సుశిక్షణ నాలో జడత్వం కదిలించింది నాకు కావాల్సినదాని హద్దులు నేర్పుతూ, దానిని పొందటానికి నిజాయితీ మార్గంలో నేనెంత శ్రమించాలో కూడా నేర్పింది. నా గురువులు లాటి వాళ్ళు ఈ ప్రపంచంలో అందరికీ వుంటే యీ ప్రపంచమే వేరుగా వుంటుంది.

24. ప్రేమ పేరుతో కొంతమంది మగవాళ్ళు చెప్పేమాటలు సాలెపురుగు అల్లే దారాలు లాటివి. ఒకసారి స్త్రీ అందులో చిక్కినతర్వాత వారి మాటలు వేరుగా వుంటాయి.

25. పెళ్ళి అయినవాడితో ప్రేమ వ్యవహారం చిల్లుల పడవలో కాలుపెట్టినట్టే.

26. పెళ్ళి అయినవాడి కాపురంలో చిచ్చుపెట్టి ఆనందం పొందాల్సిన ఖర్మ నాకేమిటి ? నా మనసుకి నచ్చినవాడు, నా జీవితంలో అతనెలా ఏకైక వ్యక్తో, అతనికీ నేనూ అలాగే వుండగలిగినవాడు దొరికితేనే పెళ్ళి చేసుకుంటాను లేకపోతే ఒంటిరిగా మిగిలి బ్రతకగలను.

27. ఈ ప్రపంచంలో స్త్రీ ప్రేమ పురుషునిపట్ల ఏకోన్ముఖం కాకూడదు. ఆమె ప్రేమించటానికి ఆమెని ఆదరించటానికి చదువు, ఉద్యోగం, సంఘసేవ, దేశసేవ ఇంకెన్నో ఆమెకోసం ఎదురు చూస్తున్నాయి.

28. భర్త సంసారం నా జీవితంలో ఒక కోణం మాత్రమే అని నమ్మే స్త్రీ చాలా తెలివిగలది. ఆమెకి జీవితంలో ఎప్పుడూ నిరాశ, ఒంటరితనం దగ్గరకి రావు.

29. ప్రేమలో పడ్డ యువతి మనసు ఆనందాశ్వం ఎక్కి స్వారీ చేస్తుంది. ఆమె వేగాన్ని, పరుగునీ ఎవ్వరూ అడ్డుకోలేరు.

30. మనిషికీ మనిషికీ మధ్య డబ్బు దూరి యెన్నెన్ని అఘాయిత్యాలు చేస్తోందో.

31. డబ్బుని ప్రేమించిన మనిషి దుష్ట సర్పాన్ని జేబులోకి చేర్చుకుంటున్నానని తెలుసుకోవాలి.

32. ఈ రోజుల్లో డబ్బు సంపాదన నా వూపిరి అని చాలా మంది అనుకుంటారు ఎంత సంపాయించి ఏం లాభం ? ఆ సంపాదన అనే దుర్వ్యసనంతో నీ వూపిరితిత్తులు పాడయిపోతూన్నయని నువ్వు తెలుసుకోనప్పుడు.

33. మనిషి జీవితం డబ్బు - ప్రేమ - కీర్తి ఈ మూడు కుర్చీల దగ్గర మ్యూజికల్ చైయిర్స్ ఆడుతుంది.

34. డబ్బు సంపాయిస్తే నేను సుఖపడతానని అనుకున్నాను. కానీ నా చుట్టుప్రక్కల వున్న అందరూ సుఖపడ్డారు. నేను మాత్రం అనారోగ్యం బిగికౌగిలిలో బందీని అయ్యాను.

35. మృత్యువు అనేది శుద్ధ అబద్ధం. అది మనిషి మనసు అల్లిన అభూత కల్పన. ఈ సృష్టిలో వున్న నిరంతర చైతన్యంలో నేనొక చైతన్యాన్ని. నాకు మరణంలేదు. నేను పంచభూతాల నుంచి ఒక ఆకృతిని పొందాను. ఆ ఆకృతి నశిస్తోంది. నేను పంచభూతాల్లో కలిసిపోయి మళ్ళీ ఏదో ఒక ఆకృతి పొందుతాను. ఆకృతి తెచ్చుకున్న కుండ పగిలితేనేం, మట్టిలో కలిసిపోతా ఇంకో స్వరూపంగా వస్తుంది.

నిశాంత

1. ఈ ప్రపంచంలో మనిషి మస్తిష్కానికి మించిన సూపర్ కంప్యూటర్ ఇంకేదీ లేదేమో. మనిషి ఆలోచనల్ని, శరీరాన్ని అది కంట్రోల్ చేసే విధం చూస్తే నాకు అత్యంత అద్భుతంగా వుంటుంది.

2. ఈ యుగంలో మనిషి తన "మేధస్సు"ని ఆయుధంగా చేసుకుని ఈ ప్రకృతిని, సాటిమనిషిని లొంగదీసుకుని జయంచినప్పుడే తన ఆనందానికి పరాకాష్ట అని నమ్ముతున్నాడు.

3. మనిషి ప్రకృతిని జయించి ఆ మహాచైతన్యంతో సహజీవనం గావించాలి. మేధస్సుతో ఎంత ప్రగతి సాధిస్తేమాత్రం ఏం ప్రయోజనం ? మనసుని చీకటి గుహగా మార్చేసుకుంటున్నప్పుడు ఇది అతని విజయం కాదు, పతనం.

4. పవిత్రమైన గంగానదిని మనం మలినపరుచుకున్నట్టే మనిషి అందంగా, స్వేచ్ఛగా, తేటగా, అద్భుతంగా వుండాల్సిన మనసుని క్రోధ, మద మాత్సర్యాలతో కలుషితం చేసేసుకుంటున్నాడు.

5. భగవంతుడి నుంచి "మనసు" అనే అద్భుత వరం పొందిన మనిషి ఆ మనసుతో ప్రకృతిలో వున్న అందాలన్నీ ఆస్వాదించటం పోయి,

మూర్ఖుడై అతి తెలివిగా ఆలోచించి ఈ ప్రకృతినే ధ్వంసం చేయాలని చూస్తున్నాడు. ఇది మానవాళికే విషాదం.

6. ఈ ప్రపంచంలో మన జీవనయాత్రలో మనకి తోడుగా దొరికేవారి మీదనే మన సుఖశాంతులు, ఆనంద దుఃఖాలు ఆధారపడి వుంటాయి.

7. ఈ ప్రపంచంలో ఏ మనిషీ తన జీవితం పట్ల యిష్టాయిష్టాలతో పుట్టడు. జీవితం అంటే ఏమిటో తెలియకుండా పుడతాడు. తెలిసిన కొద్దీ ఆరాటం ఎక్కువ అవుతుంది.

8. జీవన యానంలో కొందరికి సువాసనాభరితమైన, అందమైన పూదోటలు, వెన్నెల రాత్రులు దక్కితే మరికొందరికి ముళ్ళ కంపలు, చీకటి గుహలు ఎదురవుతాయి.

9. జీవితం పట్ల విసుగు లేకుండా జీవితాన్ని అర్థం చేసుకోవాలని తోటి వారికి తోచినంత సాయం చేయాలని అనుకునే మంచి మనిషి తోడు దొరికితే ఆ వ్యక్తి జీవితం ఇక ప్రశాంత నిలయమే.

10. ప్రియమైన వ్యక్తి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం అశాంతిగా వున్నప్పుడు చదివితే హాయి కలుగుతుంది. దుఃఖంగా వున్నప్పుడు చదివితే ఓదార్పు వస్తుంది. ఒంటరిగా అన్పించినప్పుడు చదువుకుంటే 'స్నేహపు ఒడి'లో సేదదీరినట్టు వుంటుంది. సంతోషంగా వున్నప్పుడు చదివితే అది రెట్టింపు అవుతుంది.

12. సెంటిమెంట్ పెట్టుకుంటే మనిషికి స్వేచ్ఛ వుండదు. అది ఒక బందిఖానా.

13. ఈ లోకంలో మనిషికీ మనిషికీ వున్న సంబంధం కేవలం 'అవసరం' మాత్రమే, దీనికి 'ప్రేమ' 'సెంటిమెంట్' అంటూ రకరకాల రంగులు పులిమి మాయచేసి ఒకరిని ఒకరు మభ్యపెట్టుకుంటారు.

14. ఈ రోజుల్లో మనిషి సాటి మనిషి కంటే మెషీన్‌తోనే ఎక్కువ సహవాసం చేసి, ప్రతిదానికీ దానిమీద ఆధారపడ్తున్నాడు.

15. మనిషికీ - మెషీన్‌కి నీతో వున్న సబంధంలో తేడా వుంది. మనిషి ఎప్పుడైనా నిన్ను ద్వేషించవచ్చు. వెళ్ళిపోతానని పోట్లాడవచ్చు. మెషీన్ ఆ రెండూ చేయదు.

16. ఈ అనంతకాలంలో మనిషి జీవిత సమయం ఎంత ? మొద్దుతనంతో, మూర్ఖత్వంతో, మనుష్యులు యీ కాస్త అపురూపమైన టైమ్‌ని సిల్లీసెంటిమెంట్స్‌తో కలపోసి వేస్ట్‌బిన్‌లో పారేసుకుంటున్నారు. ఎన్నెన్నో లక్షల కోట్ల అద్భుతాలు ఈ ప్రకృతి తన పైటకొంగులో మూటగట్టుకుని దాచుకుని వుంది. మనం ఆ మూటని విప్పి ఆ అద్భుతాలు అందుకోవటానికి చూడాలి. ప్రతి యిల్లూ ఒక ప్రయోగశాలగా మారాలి. ఈ అన్నాలు తినటాలు, సంతర్పణలు, పెళ్ళిళ్ళ వేడుకలు, చావుల ఆర్భాటాలు, యుద్ధోన్మాదాలు అన్నీ టైమ్‌వేస్ట్ అని గ్రహింపు జ్ఞానం వచ్చే సూపర్‌మాన్ కోసం నేను ఎదురుచూస్తున్నాను.

17. ఈ మనుష్యుల్లో నిబిడీకృతం అయివున్న శక్తి ఆనకట్టలేని నదీనీరులా కాలసాగరంలో కలిసిపోతుందేనని నేను చింతపడ్తున్నాను. మనిషి తన సుఖశాంతులకి యివ్వాల్సిన ప్రాధాన్యత మరిచి యుద్ధోన్మాదంతో విర్రవీగుతున్నాడు.

18. ఈ యావత్ ప్రపంచంలో మనుష్యులందరూ ఐకమత్యంగా, ఏకోన్ముఖంగా, కలిసి ఎంతగా చేసినా తరగని పని వుంది. అది ఈ భూమిని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవటం. ఈ ప్రకృతి రహస్యాలే ఛేదించటం. ఈ గ్రహం మీద నిలబడి మనం యీ ఖగోళం యావత్తు అధ్యయనం చేయాలి. మనం వుండే యీ భూగోళం యావత్తూ ఈ అంతరిక్ష రహస్యాలు ఛేదించే ఒక చిన్న ప్రయోగశాలగా మారాలి. మూర్ఖులైన మనుష్యులారా, మీలో చైతన్యం తెచ్చుకోండి. మనం జీవిస్తున్న యీ జీవితం ప్రారంభంలోనే వుంది. ఇంకా ఎన్నో వియాలు తెలుసుకుని అద్భుతశక్తిగల మానవులుగా మనం అంతా ఎదగాలి.

19. మనిషికి యుద్ధం ఎంత ఉన్మాదమో - ప్రేమ కూడా అంతే.

20. మనం యింకా రాతియుగం నాటి అజ్ఞానంలోనే బ్రతుకుతున్నాం. లేకపోతే అన్నం ఒండుకోవటానికి, తినటానికి నిత్య జీవితపనులకి యింత శ్రమ ఏమిటి? ఆకలి తీరటానికి - శరీరం బలం ఉండటానికి ఏ ఏడాదికో ఒక పిల్ వేసుకుంటే చాలు అనేట్టుండాలి. నిత్య జీవిత శ్రమ తప్పించేందుకు మెషీన్లు వుండాలి.

21. ఈ మూర్ఖుడైన మగవాడు ఎప్పటికీ మారేట్టులేడు. లేకపోతే, తన తోడు - నీడ అయిన స్త్రీ పట్ల యింత వివక్షత సాశవికత ఏమిటి?

22. స్త్రీలో నిద్రాణమైన శక్తి నిద్రలేస్తే ఈ పురుషుడు ఆమె కాలి క్రింద పిపీలకం అవుతాడు.

23. నూటికి 99 మంది తాము ఎందుకు పుట్టామో, వారి జీవితం ఏమిటో ఆలోచించరు. ఈ జీవితాన్ని ఎవరో వేసుకోవటానికి యిచ్చిన చొక్కాలా నాది కానట్టు బ్రతికేసి చచ్చిపోతారు.

24. యంత్రం మనిషికి మనిషిలా తోడు అవకపోతే వచ్చిన ప్రమాదం ఏంలేదు. అది మనిషిలా బాధపెట్టదు, విసిగించదు, ఆశాభంగం కలిగించదు. ప్రేమిస్తున్నానంటూ ఆకాశానికెత్తి ఒక్కసారి పాతాళలోకానకి విసిరేసే వెధవబుద్ధి లేదు. దాని మౌన సహచర్యంలో నేను ప్రశాంతంగా నా పన్లు నేను చేసుకుంటాను.

25. ఒక మనిషి సంతోషపడినా, బాధపడినా, కోపగించుకున్నా, అసహ్యించు కున్నా, అలకవహించినా, ఏడ్చినా, తిట్టినా, ప్రతిదానికి వెనక ఒక కారణం వుండి తీరుతుంది.

26. హిమాలయ పర్వతాలు ఎత్తులు నన్నెందుకో అమితంగా ఆకర్షిస్తాయి. ట్రెక్కింగ్‌కి వెళ్ళేటప్పుడు, మంచుకొండలమధ్య గుడారం వేసుకుని నిశ్శబ్దంగా, ఒంటరిగా, భయానకంగా, మనిషి యీ ప్రకృతి ఒడిలో ఎంత పిపీలకమో చూపించే యీ హిమాలయాలు, నాలో ఆత్మచైతన్యం తట్టి లేపే గురువుగా అన్పిస్తాయి నాకు.

27. ఈ రోజుల్లో మనుష్యుల ఆంతర్యాలు, అసలు స్వరూపం తెలియనీయకుండా, ఈర్ష్య ద్వేషాలు - మోసాలు, అనే క్రీ నీడలు తారట్లాడుతూన్నాయి.

28. ఈ ప్రపంచంలో ప్రతి పువ్వూ ఎలా స్వచ్ఛంగా కళకళలాడుతూ వుంటుందో, ప్రతి ఆడపిల్లా సుఖశాంతులతో, ఆత్మానందతో అలా వుండాలని కోరుకుంటున్నాను నేను.

29. శుచి శుభ్రత మనిషి నైజాన్ని బట్టి వుంటాయి.

30. మనష్యుల్లో వ్యాధి పీడితులని చూడగానే తెలుసుకోవచ్చు. కోర్కె పీడితులని వెంటనే తెలుసుకోలేం.

31. మనిషి ఆలుబిడ్డలకంటే, అప్పులాళ్ళకంటే ఎక్కువగా పట్టి పీడించేది కోర్కెల వ్యసనం.

32. మనిషిలో కోర్కె అనే రాక్షసి, తృప్తి అనేది ఎండమాని అని బోధిస్తుంది.

33. కోర్కెలపిచ్చి పిచ్చిపట్టిన మనిషి వెర్రివాడిలా, పరుగుదీస్తుంటాడు. ఆ పరుగులో తన చుట్టూ వున్న ప్రకృతి అందాలని, శోభలని గమనించలేడు.

34. మనిషి ఇదివరకు కంటే ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందానని విర్రవీగుతున్నాడు. అయినా అతని ఆరాటం శాంతించలేదు. అతని కోర్కెలు లంపటంలా పెరిగి, తామరతంపరగా వ్యాపించి అతన్ని కదలనీయకుండా చేస్తున్నాయి.

35. ఈ రోజుల్లో మనిషి తన ఆత్మానందం ఏమిటో తనే తెలుసుకోలేక పోతున్నాడు. పెద్ద చదువులు కావాలంటాడు. ఉద్యోగం అంటాడు, హోదా అంటాడు, గొప్ప గొప్ప బట్టలు ధరిస్తాడు. వెండి పళ్ళాలలో భోజనం చేస్తాడు. ఐశ్వర్యం పెంచుతాడు. వాటితో బలిసిన కుక్కల్ని పెంచుతాడు. ఈ బాహ్యాడంబరం అంతా కేవలం ఒక పగటివేషగాడి వేషధారణ తప్ప ఏముంది.

36. మనిషి తనని తాను తెలుసుకోవటానికి ప్రయత్నం మానేసి, ఈ ప్రకృతిని ఛేదిస్తానని, స్వంతం చేసుకుంటానని, గుప్పెట్లో ఇరికించుకుంటానని విర్రవీగుతున్నాడు.

37. ఈ శతాబ్దంలో మనిషికి పట్టిన మహాజాడ్యం యుద్ధోన్మాదం. ఎదుటి మనిషిని పీడించటం వల్ల తనకి ఆనందం దొరుకుతుందని అనుకుంటూన్నాడు. వెర్రి మానవుడు. ఈ యుద్ధకాంక్ష అనే విషబీజం అతనిలో పుట్టి అంతఅయి, ఇంతఅయి అన్నట్టు సర్వమానవాళినే కబళించటానికి వస్తోంది.

38. మనిషి శరీరం అలవాట్ల పుట్ట. దానికి ఏ అలవాటుచేస్తే దానినే ప్రేమిస్తుంది.

39. మార్పుని అంగీకరించవలసి వచ్చినప్పుడల్లా మనిషి అమ్మో ఎలా అంటూ ఖంగారుపడ్తాడు. మార్పు వచ్చి మీదపడగానే మెల్లగా దానితో సహజీవనం చేస్తాడు.

40. జీవితంలో చదువు - స్వయం శక్తి కంటే ప్రేమ గొప్పది కాదు.

41. ఆమె 'ముఖం' ఆమె హృదయ మందిరంలో వెలిగే ఆత్మజ్యోతిలా వుంటుంది.

42. మనలో మనకి తెలియకుండా, మనం స్టోర్ చేసుకున్న విషయాలే మన ఆంతర్యపు తెరమీద కన్పిస్తూ వుంటాయి.

దాని స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ కంట్రోల్ మనచేతితో వున్నంత వరకూ ఫర్వాలేదు. ఆ కంట్రోల్ పోయిందంటే మనం యిక పిచ్చానుప్రతిపాలే.

43. ఎవరియిష్టం వచ్చినట్టు వారు తను ఆనందం అనుభవించటానికి వీల్లేదు. ఈ సంఘం ఒక హద్దు పెట్టింది.

44. ఈ సిటీలో యీ గందరగోళం, యీ శబ్దం, ఈ హడావుడి పరుగు, మనిషి ఆయుర్దాయం హరింప చేసే ఈ నీరు కలుషితమైన గాలి నాకు యీ నగరం ఒక మృత్యుకూపంలా అన్పిస్తోంది.

45. మనిషి ఆరుబయలు, పచ్చటి ప్రకృతి, స్వచ్ఛమైనగాలి, నిశ్చలంగా వున్న పంట కాలవలో కన్పించే ఆకాశం, ఇరుపక్కలా చెట్లు ఈ మౌనానందం అతని ఆత్మానందం అని మర్చిపోతున్నాడు.

46. చెత్తపనులు, ప్రమాదభరితమైన పనులూ, మిషన్స్ చేత చేయించాలి. సృజనాత్మకమైనవి, శాస్త్రీయమైనవి మనిషి తను స్వయంగా చేయాలి.

47. ఈ ప్రపంచం అంతా కంప్యూటర్స్ ద్వారా కంట్రోల్ చేసే మర మనుష్యలకి అప్పచెప్పేస్తే మనం బైట గ్రహాలకివెళ్ళి వాటి గురించి అధ్యయనం చేయవచ్చు. ఈ విశాల విశ్వం అంతా మన చేతిలోకి రావాలి. ఇది ఈనాటి శాస్త్రవేత్త స్వప్నం.

48. ప్రజల అవసరాలు వదిలేసి, దేశం అంతా మురికి వాడలా, బీదజనవాడలా తయారుచేస్తున్నారు ఈనాటి నాయకులు.

49. మనకి సేవచేస్తాం అంటూ మనకి దణ్ణాలు పెట్టి ఓట్లు దండుకున్న నాయకులు మననెత్తిన ఎక్కి తొక్కుతున్నారు.

50. ఈ దేశ నాయకులని మనమే ఎన్నుకున్నాం.

కానీ ఈ మహానుభావులు మనల్ని ఎటు దీసుకుపోతున్నారో మనం ఒక కంట కనిపెట్టి వుండకపోతే మన గతి అధోగతే.

51. మనవాళ్ళకి ఇహలోకంలో జీవితానందం అవసరం లేదు. పరాయి లోకంలో యెక్కడో వున్న స్వర్గం అంటూ డబ్బు తెగ ఖర్చు చేసేస్తారు.

52. ప్రకృతి సౌందర్యాన్ని ప్రేమించటం, పిల్లలకి చిన్నప్పటి నుంచే

పెద్దలు అలవాటు చేయాలి.

53. ఎవరి వృత్తులు - సమస్యలు - ఆందోళనలు వారికి వున్నా, ఒక్కసారి అలా ప్రకృతిలోకి వెళ్ళి సేదదీరి రావాలి.

అది ఒక టానిక్‌లాగా పనిచేస్తుంది.

54. అతను ప్రకృతి ఒడిలో పసిపాపలా ఒదిగిపోవాలని తపన పడ్తున్నాడు. ఇంకో అతను ఆ ప్రకృతిని జయించాలని ఆరాటపడ్తున్నాడు.

55. మన జీవితంలో ప్రతి క్షణం, ప్రతి నిముషం, మనం చేసే పనుల వెనక ఒక గొప్ప కాలక్యులేషన్ వుంది. మనం పుట్టిన క్షణం నుంచీ, మరణించే వరకూ అంతా లెఖ్ఖల మయమే. మన బీజదశలో మనకి అంకురార్పణ జరగటానికే ఒక లెఖ్ఖ. ఫలానా సమయంలో ఇన్ని రోజులకి ఫలదీకరణ. శిశువు పెరగటానికి లెఖ్ఖ! వయసుకి లెఖ్ఖ. వృద్ధాప్యానికి లెక్క. జుట్టు, పళ్ళు రావటానికి లెక్క. అవి వుండటానికి లెక్క. ఈ లెక్కలు ఒక్క మనిషి శరీరానికేనా కాదు, మనిషితో మనిషి సంబంధానికి లెక్క. ప్రతిదీ కాలిక్యులేషన్. మన తలితండ్రులతో - మనం వారితో - మనం సంఘంతో - సంఘం మనతో ప్రతి చిన్న విషయమూ కనిపించని లెక్కలే.

56. ఈనాటి మనిషి చదువులో - తెలివితేటల్లో ఆందరికంటే ఉన్నతంగా, ఒంటరిగా, ఆధునిక విజ్ఞానం అండతో, భవిష్యత్‌వైపు పరుగులు తీస్తూ ఉవ్వెత్తు కెరటంలా వున్నాడు.

57. ఈ ప్రపంచంలో మనిషికి నిశ్శబ్దంలో రెండు రకాలున్నాయి.

ఒకటి ఒంటరితనం వల్ల వచ్చే నిశ్శబ్దం. ఇది బాధాపూరితమైనది. రెండోది ఏకాంతం. ఇది ముగ్ధమనోహరమైనది. మనిషిని అత్యున్నత ఆనంద శిఖరాలకి చేరుస్తుంది.

ఒంటరితనంలో నాకెవ్వరూ లేరనే నిస్పృహతో కూడిన నిట్టూర్పు వుంది.

ఏకాంతంలో నాకెవ్వరూ అవసరంలేదు అనే ఆత్మ ధీశక్తి వుంది.

58. మనిషిలో వున్న "ఇంకో మనిషి" వున్నాడే ఇతనికి ఏ ధన రాశులూ, ఏ కీర్తి కిరీటాలూ, ఏ అద్భుత విజయాలూ ఆనందం కలిగించలేవు. బయట ప్రపంచం సాధించటంలో మనిషి బిజీ అయిపోయినకొద్దీ "లోపలి మనిషి" ఆలనాపాలనా లేక చిక్కిశల్యం అయి రోగిష్టిగా మారిపోతున్నాడు.

59. ఈ దేశంలో కొంతమందికి ఒక జబ్బు వుంది.

అది వాళ్ళు ఎంతసేపూ సెల్ఫ్‌పిటీతో ఏడుస్తూ వుంటారు.

వాళ్ళు ఏడిస్తే ఫర్వాలేదు. ఏడుపు రానివారికి కూడా తమ బాధలు చెప్పి ఏడిపించాలని చూస్తారు. అప్పుడు గాని వాళ్ళకి శాంతివుండదు.

60. ఈ ప్రపంచంలో తల్లితండ్రులని - పిల్లల్ని - భార్యాభర్తల్ని - యజమాని నౌకర్లనీ ఎంతో మందిని చూస్తున్నాను. ఒకరితో ఒకరికి లాభం వుంటేనే యీ సంబంధాలు - ఆనందాలు. లేకపోతే నీటిమీద బుడగలే.

61. ఏ మనిషి అయినా బాధపడటం నా కిష్టం వుండదు. ప్రతి వారూ సుఖంగా వుండాలని నేను కోరుకుంటాను. ఆఫ్టరాల్ చిన్న జీవితం

ఇది. మనిషి కళ్ళలో కన్నీళ్ళకంటే, ఆనందభాష్పాలు ఎక్కువగా రావటం నాకిష్టం.

62. చిట్టితల్లీ ! నిన్ను నేనే వధ్యశిలకి తీసుకువెళ్తున్నానమ్మా. నన్ను క్షమిస్తావా?

కలల్లో తేలిపోయిన నేను నీకు పూపిరి పోస్తున్నానని అనుకోలేదు. నా కలలు బూడిద చేశాడతను. ప్రేమ నువ్వు నా కడుపులో పెరుగుతుంటే, నీ పెరుగుదల పీక నొక్కాలని నా పరిస్థితులు ఒత్తిడి చేస్తున్నాయి. నిన్ను నేను వధ్యశిలకి అర్పించబోతున్నాను. కానీ నశిస్తున్నది నువ్వుకాదు, నా ఆత్మ.

63. మానవ నిర్మితమైన సంస్థలలో కుటుంబం చాలా ఉత్తమమైనది. మనిషికెంతో అవసరం అయింది. ఎప్పటికీ పాతబడనిది.

64. అన్ని సమాజాల్లోనూ, సమాజ పరిణామంలో కుటుంబ వ్యవస్థే పునాది అవుతుంది సమాజానికి. ఉన్నత పౌరుడినిగా వ్యక్తిని తీర్చిదిద్దటంలో కుటుంబ ప్రాధాన్యత ఎంతో వుంది.

65. మనం బజార్లో కోనే వస్తువు నాణ్యత లేక యెన్నో రోగాలు వస్తున్నాయి.

మన రాజకీయాల్లో వ్యక్తి నాణ్యత లేక అభద్రతా భావాలు వస్తున్నాయి.

66. మా మతమే గొప్పది అనే వాళ్ళతోనే అన్ని చిక్కులూ మొదలవుతున్నాయి.

67. ఇంటికీ ఇంటికీ మధ్య గోడవద్దు. దేశానికీ దేశానికీ సరిహద్దులే వద్దు. అప్పుడే కదా మనమంతా వసుధైక కుటుంబం.

68. మనిషి జిహ్వాకి అనేక రుచులు. మనిషి ప్రార్థనకి అనేక మతాలు.

ఈ చిన్న సత్యం అర్థం చేసుకుంటే మనిషికీ మనిషికీ మధ్య ద్వేషం వుండదు.

69. సాంఘిక సేవ కూడా ఈ రోజుల్లో పెద్ద వ్యాపారం అయిపోయింది. చిన్న బిడ్డలు కూడా యీ వ్యాపారంలో బలి పశువులు అవుతున్నారు.

70. అందరూ అందంగా వుండాలని అనుకుంటారు.

అసలు అందానికి నిర్వచనం ఏమిటో !

గిరిజా కళ్యాణం

1. పంజరంలో వుండటానికి అలవాటుపడిన పక్షి అదే బాగుంటుంది అనుకుంటుంది. పెళ్ళి అనే బందిఖానాలో ఇరుక్కున్న ఆడపిల్ల అదే స్వర్గంగా భావిస్తుంది.

2. ఆకాశంలో తిరిగే పిట్ట పంజరంలో పిట్ట దగ్గరకి వచ్చి "బైటికిరా, వస్తే అనంత ఆకాశం. ఆరుబయట స్వేచ్ఛ అనుభవించవచ్చు" అంటూ బాధించింది.

   పంజరంలో పిట్ట "హద్దుమీరిన స్వేచ్ఛ నాకు వద్దు. ఈ నాలుగు గోడల మధ్య ఎంత రక్షణ వుందో నీకేం తెలియదు. నువ్వే ఇక్కడికిరా" అంటూ ఎదురు ఉపన్యాసం ఇచ్చింది.

3. అతను అమ్మాయిల జీవితాలతో ఆడుకుని వదిలేస్తున్నాడు. పగబట్టిన అమ్మాయిలు అతన్ని తిట్టలేదు, కొట్టలేదు. అతను పెళ్ళికి పనికిరాడని చాపక్రింద నీరులా ప్రచారం చేశారు.

4. పెళ్ళి అనేది కూడా ఒక యుద్ధరంగమే, ఇక్కడా ఎత్తుకు పై ఎత్తులు, వ్యూహరచనలూ వున్నాయి. పైకి నవ్వులు - లోలోపల సెగలు వుంటాయి.

5. రెండు కొప్పులు కలిస్తే పోట్లాట అనేది పాతబడిన సామెత. నాలుగు కొప్పులు కలిస్తే ఒక సమిష్టి శ్రామిక కేంద్రం అని ఆడవాళ్ళు యీ రోజున ఋజువు చేస్తూ అంతర్జాతీయ ఖ్యాతిని తెస్తున్నారు.

6. స్త్రీ మూర్ఖురాలు అయితే ఇంటికి బానిస అవుతుంది. తెలివిగలది అయితే ఆ ఇంటికి యజమానురాలు అవుతుంది.

7. స్త్రీ పెళ్ళిని దిక్సూచిగా చేసుకుని ఆనంద తీరాలకి పయనించాలి.

8. పెళ్ళి మంత్రాలకి చింతకాయలు రాలకపోయినా వికటిస్తే విడాకులు రాలుతాయి.

9. అందరూ నా పుట్టినరోజున హాపీబర్త్‌డే అంటూ ఆనందంగా పాట పాడుతున్నారు. నేను మాత్రం నా జీవిత బ్యాంక్‌లో నా ఆయుష్షులో 40 సంవత్సరాలు ఖర్చయిపోయినాయి అని కుమిలిపోతున్నాను.

10. రాత్రివేళ వెళ్తున్న ఆ రైలు చీకటి సముద్రంలో వెళుతూ వెలుగు తీరం వెతుకుతున్న కాందిశీకురాల్లా వుంది.

11. ధైర్యం, సాహసం, నిరాడంబరత్వం, సౌశీల్యం, సహృదయత ఇవి ఏ ఆడపిల్లలో వుంటాయో ఆమె మెట్టిన ఇల్లు నందనవనం అవుతుంది.

12. మనకి భోజనం పెట్టటంలోనే అవతల మనిషికి మనమీద యెంత శ్రద్ధాసక్తులు వున్నాయో తెలిసిపోతుంది. ఇష్టంవుంటే కొసరి కొసరి వడ్డిస్తారు. కొంతమంది కంచంలో ముష్టాడికి పడేసినట్టు అన్నం వేస్తారు.

13. కొంతమంది డబ్బు లేకపోయినా బ్రతకగలరు, స్నేహితులు లేకపోతే బ్రతకలేమంటారు.

14. డబ్బు + స్నేహం అప్పుడప్పుడూ పాలు నీళ్ళలా కలిసిపోతాయి.

15. ఒక ఆడపిల్ల పెళ్ళిపట్ల ఎంత ఆశతో వస్తుందో అంత నిరాశకి నిరాదరణకి గురి అవుతుంది.

16. మామూలు ఆడపిల్ల పెళ్ళి విఫలం అయితే నా ఖర్మ అని ఏడుస్తూ కూర్చుంటుంది. అదే తెలివిగల ఆడపిల్ల అయితే లోపం ఏమిటో ఎక్కడుందో తెలుసుకుని పరిష్కారం వెతుకుతుంది.

17. నా భర్తని నేను మార్చుకోవాలా ?
సోషల్ సర్వీస్ చేయాలని నాకేం లేదు.

శ్వేత గులాబి

1. ఆమెని ఎంతో అదృష్టవంతురాలిగా ఈ లోకం ముందు నిలబెట్టిన ఆ ఐశ్వర్యమే ఆమె జీవితానికి పాము పడగగా మారింది.

2. విపరీతంగా ప్రేమించే గుణం వున్న వారంటే నాకు భయం, ఎందుకంటే ఆ ప్రేమని నేను తట్టుకోలేను.
నా వ్యక్తిత్వాన్ని వరదలా ముంచేసే ప్రేమ నాకు అవసరం లేదు.

3. స్త్రీ ముందు రెండే మార్గాలున్నాయి.
ఒకటి చాతనైతే డబ్బు సంపాయించుకోవటం.
రెండోది డబ్బు సంపాయించటం చాతకాకపోతే అలా సంపాయించగల సమర్థుడిని భర్తగా పొందటం.
ఈ రెండూ చాతకాని స్త్రీల జాతకాలు త్రిశంకు స్వర్గాలే.

4. ఈ ప్రపంచంలో డబ్బు సంపాయించే వాళ్ళెవరూ సుఖపడరు. వాళ్ళు ఎండలో నిలబడిన చెట్టులా ప్రయాసలో వుంటారు. మరోరకం మనుష్యులున్నారు. వాళ్ళు డబ్బున్న వాళ్ళని స్వంతం చేసుకుని చెట్టుక్రింద నీడలా సుఖం పొందుతారు.

5. స్త్రీ ఎప్పుడూ ధనికుల ఇళ్ళలో వుండే ఫ్లవర్ వేజ్‌లాగానో, విలాసంగానో, అలంకారప్రాయంగానో వుండకూడదు.

6. దరిద్రం అనేది ఒక మహా జ్వాల. దానికి గురి అయిన మనిషికి సుఖ సంతోషాలుండవు.

7. నాకు 60 ఏళ్ళు.
నా పిల్లలు నాకు 60 వసంతాల పండగ చేస్తున్నారు.
60 దుఃఖపు మూటలు మోసానని తెలిసిన మనసు సంతోషపడలేకపోతోంది.

జీవన సౌరభం

1. భగవంతుడా ! ఒకరిముందు చేయి జాచుటకంటే మృత్యుకెరటం యింకోటి లేదు. నేను నా సాటి మనుష్యుల మధ్య నా మర్యాదని, ఆత్మగౌరవాన్ని దక్కించుకునే అవకాశం యివ్వు. ఎంతయినా కష్టపడతాను. ఈ రోజు యీ క్షణం నుంచీ నా దృష్టిలో అలసట అనే పదమే లేదు.

2. నిగ్రహం నీకు వజ్రకవచం అయితే ఎదురే వుండదు.

3. ధనవంతులకి పూరిగుడిసెలు ఎలుక కన్నాలుగా కన్పిస్తాయి. కానీ బీదవారికి అవే రమ్యహర్మ్యాలుగా వుంటాయి.

4. కుటుంబ సభ్యులందరి ఆశలనూ ఆ యింటి యజమాని ఒంటెద్దు బండి లాగినట్టు భరించాడు. ఆయన పోయిన తర్వాతగాని ఆయన విలువ వారికి తెలియలేదు.

5. వాళ్లు వాళ్ళ కాళ్ళతో నడిస్తే తప్ప జీవితంలో అడుగులు వేయలేరు. ఆర్థికంగా కూడా అంతే. మీ సంపాదన మీకు మొదలయితేనే మీకు స్వేచ్ఛగా వుంటుంది.

6. మనం ఖర్చుల ఒరవడిలో కొట్టుకుపోతుంటే అప్పుడప్పుడు రెడ్ సిగ్నల్ 'జాగ్రత్త అపాయం' అని హెచ్చరిక చేసినా మనం పట్టించుకోం.

7. స్వార్థపరుల్లో మంచి ప్రవర్తన ఎదుటవారి నుండి లబ్ధిపొందేంతవరకే. అది అందనప్పుడు, వారిలో క్రూరత్వం కోరలు చూపిస్తుంది.

8. పేదరికాన్ని ఆయుధంగా చూపి బ్రతికేవారు పేదలపట్ల జాలిపడనవసరం లేదు.

9. అందరూ బోర్ బోర్ అంటారు. చేసిన పనే చేయటానికి విసుగు పడటమా! రోజూ ఉదయించే సూర్యుడు బోర్ అని మానేస్తే ? రోజూ జీర్ణంచేసే మన పొట్ట ఒక్కరోజు బోర్ అని ఆహారాన్ని ఆరిగించకపోతే మనమేమవుతాం.

10. ఈ రోజుల్లో మంచి లక్ష్యం వైపు జీవనపథం ఎంచుకుంటే సుఖశాంతులు లభిస్తాయనే మాట మరిచిన జనం సుఖాన్వేషణ కోసం పక్కదారుల్లో వేటప్రారంభించి, ఎండమావులని నిస్పృహ చెందుతున్నారు.

11. అనాది నుంచీ స్త్రీలు పడే కష్టానికి జమిందారిణి – దాసి అనే తేడా ఏ మాత్రం కన్పించటంలేదు.

12. దుర్వ్యసనపరుడైన భర్త అసమర్థుడైన భర్త ఈ యిద్దరితో స్త్రీ జీవితం నరకమే.

13. భర్త కూడా ఒక 'పెద్ద పిల్లవాడు మాత్రమే' అని గ్రహించగలిగిన స్త్రీ అతని ఆహాన్ని భరించగలుగుతుంది.

14. ఈ రోజుల్లో కుటుంబానికి – వ్యక్తికీ లంకెలు తెగిపోతున్నాయి.

15. ఎవరెన్ని అనుభవ పాఠాలు చెప్పినా మనిషి వినడు. అలా మనిషి ఎదుటవారి అనుభవం అంగీకరించి వుంటే చరిత్రకి యింత చరిత్ర వుండేది కాదు.

16. 80 సంవత్సరాలు బ్రతికినా ఆయుష్షు చాలలేదని ఏడిచే మనిషి, పొద్దుట వికసించి సాయంత్రానికి ఒడిలిపోయే పువ్వుని చూసి పాఠం నేర్చుకోవాలి.

17. కొడుకుని తీసుకుని కోడలు అమెరికా వెళ్లిపోయిందని మెటికలు విరుస్తున్న అత్తగారిని చూసి 'ఏమ్మా' నా కాయలు కోసుకుని నువ్వు ఫలితం అనుభవించటం లేదా' అంటుంది దొడ్లోని జామచెట్టు.

18. అతనికి ఇటు తల్లి కావాలి – అటు భార్య కావాలి. అతని జీవనప్రయాణం రెండు పడవలమీద రెండు కాళ్ళుగా మారింది.

19. కూతురిని కన్నతల్లి మనసు పుష్పక విమానం. అల్లుడితోపాటు అతని బంధువులనీ ఆదరిస్తుంది. కొడుకుని కన్నతల్లి మనసు ఒరలాటిది. ఒక ఒరలో రెండు కత్తులుకి చోటులేదు.

20. ఈ ప్రపంచం అంతా ఒక పెద్ద వూచల పంజరం. మనిషి స్వేచ్ఛ గురించి, ఆలోచించటానికి, గట్టిగా వాదించటానికే తప్ప నిజమైన స్వేచ్ఛ ఎక్కడా లేదు.

21. ఇదివరకు రోజుల్లో బంధువులంటే ఆత్మబంధువులు అని భావన. ఈ రోజుల్లో బంధువులంటే రాబందులు అని కినుక.

22. అప్పటికీ యిప్పటికీ ఒకడు సంపాయించటం, పదిమంది తినటం ధనవంతులకే. బీదవారు అప్పుడూ - ఇప్పుడూ కుటుంబంలో పిల్లలతో సహా కష్టపడి తమ వంతు ధర్మం నేరవేరుస్తారు.

23. ఈ భూకంపాలు - జలప్రళయాలు విర్రవీగుతున్న మనిషి నెత్తిన భగవంతుడు వేసే మొట్టికాయలు.

24. "ప్రళయం వచ్చింది సర్వం నాశనం అయింది. నన్ను మాత్రం ఎందుకు బ్రతికించావు ప్రభూ" ఒక చెట్టు ఏడుస్తోంది. 'నీవు నిర్వర్తించాల్సిన కర్తవ్యం యింకా వుంది' భగవంతుడు జవాబు చెప్పాడు.

25. శివుడు ఆజ్ఞలేకపోతే చీమయినా కుట్టదంటారు. ఓ భగవంతుడా! నేనేం పాపాలు చేసానయ్యా ! నా మీదకి ఇన్ని బాధలు అనే చీమలు పంపావు.

26. నా వంశం, నా కులం, నా మతం అని వెంపర్లాడే మూర్ఖులారా! మీ తాత ముత్తాల రక్తాలు ఎవరికి చెందినవో మీరు కనుక్కోలేరు. ఈ సృష్టిలో స్త్రీ పురుషులుద్భవించినప్పటి నుంచీ చీకటిచాటున మనిషి పుట్టుకల్లో చాలా మాయలు జరిగిపోతున్నాయి.

27. సుఖం అనేది మన మూతికి కాస్త దూరంలో కట్టిన క్యారెట్ లాటిది. మనం దాన్ని అందుకోవాలని పరుగెత్తిన కొద్దీ, అది మనతోపాటు ముందకు పరుగెత్తుతూ వుంటుంది. మనకి వృథా శ్రమ ఆయాసం మాత్రమే మిగులుతాయి.

28. ఈ రోజుల్లో సౌందర్య సాధకులు నేరేడు కాయకి సువర్ణకాంతులు యిస్తున్నారు.

29. అభ్యాసంతో కూసు విద్య అన్న మంత్రం యీ కాలం వాళ్ళు ఎక్కువగా జపిస్తున్నారు. ప్రతి చిన్న విషయం ప్రాక్టీస్ - ప్రాక్టీస్. వీరు అభ్యాసంతో గాడిదచేత గాన కచేరీ చేయించవచ్చు అని నమ్ముతారు.

30. అమ్మకంటే దైవం యింకేదైనా వుందా అని నా కొడుకుని అడిగాను. వాడు వెంటనే "వుంది" అన్నాడు "ఎవరు ?" ఆతురతగా అడిగాను. "అన్నం" ఠక్కున వచ్చింది సమాధానం.

31. ఇదివరకు యీ ప్రపంచానికి ధర్మం - న్యాయం - మానవత్వం - మంచితనం నాలుగు స్థంభాలుగా వుండేవి. ఇప్పుడు స్వార్థం - దుర్మార్గం యీ రెండే స్తంభాలుతో వుంది. అందుకే యీ ప్రపంచం ఒక పక్కకి వాలి పడిపోతోంది.

32. స్వీయ అనుభవాన్ని మించిన మంచి గురువు యింకెవ్వరూ లేరు.

33. ఇప్పుడు వస్తున్న జీవిత చరిత్రల్లో వారి జీవితం కంటే వారుచెప్పే "చరిత్రే" ఎక్కువగా వుంటోంది.

34. స్త్రీల కళ్ళవెంట కన్నీటి కాల్వల కంటే ఆనంద భాష్పాలు యెక్కువగా వచ్చే స్వర్ణయుగం స్త్రీలు తమకి తామే తెచ్చుకోవాలి. పురుషుడు తెస్తాడనే భ్రమతో వుంటే జీవితాలే అయిపోతాయి.

35. వంద కాకుల మధ్య ఒక్క కోకిలలా, లక్షలాది దుర్మార్గపు మగవాళ్ళ మధ్య ఒక్క మంచి వ్యక్తి వుంటాడు.

36. "నీ తల్లితండ్రులని ఎందుకురా అలా వదిలేసావు ?" బామ్మగారు ఒక కుర్రాడిని ఆరా తీసింది.

"వారిని చూసి చూసి విసుగు పుట్టింది నాకు" ఎప్పుడూ కొత్తని కోరుకునే అతను సమాధానం ఇచ్చాడు.

37. బద్ధవిరోధుల్ని కలుపుదామని ప్రయత్నించకు వారిద్దరిలో ఎవరో ఒకరు నీకు పాడె కట్టేస్తారు.

38. స్వతంత్ర ప్రతిపత్తి గల ఆలోచనలు వచ్చినప్పటినుంచీ యీ రోజు ఆడపిల్లల్లో స్త్రీకి సహజమయిన సౌకుమార్యం ఒడిలిపోతోంది.

39. ఈ ప్రపంచంలో మనిషికి తన గమ్యం పట్ల నమ్మకం ఒక్కటే వుంటే చాలదు. "అదృష్టం" అనే శక్తి తోడు కూడా కావాలి.

40. ఈ రోజుల్లో మనిషి డబ్బు వెంటపడి పరుగెత్తుతుంటే అతని వెంట రోగాలు తరుముకు వస్తున్నాయి.

41. నువ్వు భయపడేది ఎదుటివారిని చూసికాదు, నీలో వున్న పిరికి తనానికి.

42. తను అబలని అంటుందిగానీ, స్త్రీ దగ్గర ఒక పెద్ద అయుధం వుంది అదే ఏడుపు.

43. ఇదివరకు కొంతమంది వ్యక్తులని చూస్తే అబద్ధం, అధర్మం వేయిమైళ్ళు పారిపోయేవి. వారి వ్యక్తిత్వపు తీక్షణత అలాటిది. ఇప్పుడు చాలా మందికి అవి కవచాలుగా మారాయి.

44. డబ్బు సంపాదన అనేది చాలా మందికి ఒక అవసరంగా వచ్చి, రాను రాను ఒక వ్యసనంగా మారిపోతుంది.

45. ఇంటికి చుట్టాలు వస్తున్నారని ఆవిడ సంబరం.

పీక్కుతినే దయ్యాలు వస్తున్నాయని అతని భయం.

46. మా 92 సంవత్సరాల బామ్మ నాకు చెప్పింది. నేను ఇంత ప్రపంచం చూసాను. మనుష్యుల్లో మంచివాడా, చెడ్డవాడా, ధర్మపరుడా - అధర్మ పరుడా ఈ లెక్కలు గట్టేకంటే వాడొక మనిషి అని తీసిపారేస్తే మనకి చాలా తలనొప్పులు తగ్గుతాయి.

47. అన్నం తినగలిగిన అవకాశం వున్నా పస్తులుండాల్సి రావడం కంటే ఖర్మ మనిషికి ఇంకోటిలేదు.

48. అతను ఆకలికి వుండగలడు. చలికి ఓర్చుకోగలడు. ఎంత ఎండ వేడినైనా భరించగలడు. ఎవరా హీరో అని అడుగుతున్నారా ! అడుగో ఆ పేవ్‌మెంట్ మీద నిద్రపోతున్న పేదవాడు.

49. "నేనెప్పుడూ అనారోగ్యం పాలవకూడదు" అనేది మన మనసులో భయంకరమైన పట్టుదలగా వుండాలి.

50. నాకు మృత్యువు అంటే భయం లేదు. ఆకలి అంటేనే చాలా భయం.

51. మనం ఈ అద్భుత ప్రపంచాన్ని కొద్దిసేపు వీక్షించటానికి వచ్చిన అతిధులం మాత్రమేనని గుర్తుపెట్టుకుంటే మనకి యే బాధలూ ఉండవు.

52. అతనికి ఎవరి ప్రశంశాపత్రాలూ అవసరం లేదు.

ఎందుకంటే జీవితం అతని శ్రమకి తగ్గ ఫలితం యిచ్చింది.

53. కొంతమంది ఎదుటివారిని అర్థం చేసుకుంటారు.

మరికొంతమంది ఎదుటవారిని అపార్థం మాత్రమే చేసుకుంటారు.

54. ఓ మానవుడా ! ఈ చరాచర సృష్టిలో నీ ఒక్కడిలోనే చైతన్యం వుందని విర్రవీగకు. ఈ సృష్టిలో అనంతకోటి జీవరాసుల్లో నువ్వు ఒకడివి మాత్రమే. ఒక్కసారి పరిశీలిస్తే ఆకాశంలో కదిలే మేఘం, గాలికి తలవూపే చెట్టకొమ్మలు నీకు యీ సందేశం నిరంతరం యిస్తూనే వుంటాయి.

55. ఈ ప్రపంచంలో ప్రతిమనిషీ బీదరికంలో పుట్టి, పెరిగి పెద్దయిన తర్వాత స్వయంకృషితో సుఖశాంతులు సంపాయించుకోవాలి. అప్పుడే జీవితం విలువ తెలుస్తుంది.

56. బీదరికం మనిషిని చాలా బాధపెడ్తుంది.

కానీ అతనిలో వ్యక్తిత్వపు నాణ్యత తనని నిగ్గుతేలుస్తుంది.

57. కొంతమంది జీవితం 'ఎదుటివారి కోసమే నేను పుట్టాను.

నా కోసం నేను పుట్టలేదు' అన్నట్టు గడిచిపోతుంది.

58. కొంతమంది కళ్ళల్లో చెడుని చూస్తే అపరిమిత ఆనందం, మంచిని చూస్తే భయంకర ద్వేషం కన్పిస్తాయి.

59. డబ్బున్న వాళ్ళకి శాపం కూడా వుంటుంది. వారికి నిజమైన ఆత్మీయత దొరకదు. ఇది మనిషికి డబ్బు ప్రసాదించే దురదృష్టం.

60. తల్లితండ్రులు సాయపడలేని యుద్ధాలు పిల్లల జీవితాల్లో చాలా వుంటాయి. మౌనంగా చూస్తూ వాళ్ళతోపాటు ఆవేదనని, బాధని దిగమింగటమే తల్లితండ్రులు చేయాల్సినపని.

61. కొన్ని సంవత్సరాల క్రిందట నేను 'స్వయం నిర్ణయం' అని ఒక గొప్పపని చేసానని విర్రవీగాను.

ఈనాడు తెలుస్తోంది అదెంత తెలివితక్కువ పనో !

62. మోసంతో భవిష్యత్తు నిర్మించుకునే వాళ్ళకి, ఎండమావులమీద రాజసౌధాలు కట్టినట్టే అని చివరలో గానీ అర్థం గాదు.

63. తనకి తాను కష్టపడి డబ్బు సంపాయించుకోలేని సోమరిపోతులే ఎదుటివారి ధనంకోసం ఆశపడ్తారు.

64. సోమరిపోతుతనం లేకుండా, కృషి చేయటానికి సిద్ధంగా వున్న మనిషికి ఏదో ఒక పని దొరకకుండా వుండదు.

65. మనిషికి బాంబులు, తుపాకులు, యుద్ధటాంకులు అంటే ఏ మాత్రం భయంలేదనటానికి సాక్ష్యం యీ యుద్ధాలే.

66. మనిషి పుట్టేంతవరకూ తను ఏ మతంలోకి దిగుతున్నాడో తెలియదు.

67. ప్రతి మనిషికీ తనదైన సంస్కృతితో అనుబంధం వుండితీరాలి.

68. మన దుర్గామాతకి వున్నన్ని చేతులు, బ్రహ్మకి వున్న ముఖాలు, శివుడికి వున్న మూడోకన్ను, ఏనుగు తలతో వినాయకుడు, వానర తలతో ఆంజనేయుడు, సగం సింహం, సగం మనిషిగా ఉగ్రనరసింహుడు మొదలైన దేవతలని చూస్తుంటే ఈ బయోటెక్నాలజీ విద్య అప్పుడే వుంది సుమా అన్పిస్తోంది.

69. బాధలు - సంతోషాలు లేని ఏ జీవితం పరిపూర్ణం కాదు.

70. బ్లాక్‌మెయిల్ చేసే వాడికి కన్నతండ్రి - కన్న కూతురు అనే వివక్షత వుండదు.

71. ఆకలిని మరిపించేది నిద్ర ఒక్కటే.

72. దుష్టత్వం - మంచితనాన్ని చంపేయాలని, అనాదిగా వేటాడుతూనే వుంది. సాధ్యంకాక మధ్యలో అలిసి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుంటుంది.

73. అతని చేతులు తపస్సులా కళాకృతులని తయారుచేస్తూనే వుంటాయి. అతని పొట్ట మాత్రం ఆకలితో నకనకలాడుతూంటుంది.

74. మామూలు మనుష్యులంతా యుద్ధం వస్తే ఆశక్తులం అంటూ భయపడ్తారు. అది పొరపాటు. గండుచీమల చేత చిక్కి బలిసిన సర్పం చావలేదా. మనం చీమల ద్వారా ఐకమత్యం, మౌనంగా, దీక్షగా తన పని తాను చేసుకుపోవటం నేర్చుకోవాలి.

75. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదని పెద్దలు చెబుతారు, కానీ, నేను జీవించి వున్నంతకాలం నా జీవితం నాకు శాశ్వతమే కదా.

76. మనిషికి పసితనం ఒకమాయ తెర. బాల్యం ఒక అశక్తత. కౌమారం రెక్కలు వచ్చీరాని స్థితి. యవ్వనం కలల బందిఖానా, వృద్ధాప్యం జరిగినదంతా నెమరు వేసుకుంటూ పడే ఆవేదన.

77. నువ్వు - నిన్ను ద్వేషించే వారితో చాలా అప్రమత్తతగా వుండాలి.

78. మనిషి గుణాల్లో ద్వేషం అంత కాలనాగు విషం యింకేదీ లేదు.

79. నువ్వు రాజీపడటమే కాదు, ఎదుటివాళ్ళు కూడా నీతో రాజీపడేలా చూసుకోవాలి నువ్వు.

80. మనసులో నసని కంట్రోల్ చేయగలిగితే మామూలు మనిషిలా బ్రతికేయగలవు.

81. విశాలమైన ప్రకృతి అందులో ఎత్తయిన పర్వతాలు, గలగలపారే నదులతో వున్న చిన్న దేశం. ఆ దేశంలో ఒక రాష్ట్రంలో, ఒక నగరం. ఆ నగరంలో - అతి చిన్న బజారులో, వున్న అతి చిన్న యింట్లో ఈ బ్రహ్మాండమైన ప్రకృతిలో ఒక పిపీలకంలా నేను ! ఇదీ నా అడ్రస్. మీ అందరి అడ్రస్‌లు కూడా యివే.

82. మూర్ఖుడు అద్దంలో కన్పించేంత మాత్రమే యీ ప్రపంచం అనుకుంటాడు.

జ్ఞాని ఈ ప్రపంచాన్ని యిముడ్చుకోగల అద్దం ఎక్కడా లేదు అని గ్రహిస్తాడు.

83. మృత్యువు కొంతమందిని వరిస్తే - కొంతమంది మృత్యువునే వరిస్తారు.

84. సాహసం, వ్యక్తిత్వం, మంచితనం, విచక్షణగల అమ్మాయితో కలిసి జీవితం గడపటం ఎంత కష్టమో, అంత సుఖం కూడా వుటుంది. అలాటి తోడుకి సరైన జోడీగా మగవాడు వుంటే ఆ జీవితం పందెపు గుర్రంలా పరుగులు దీస్తుంది. నందనవనంలా, సుఖశాంతులతో వర్ధిల్లుతుంది.